తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 07.09.2025 | సంపుటి :12 సంచిక : 49 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి

98483 28698







ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పూణే సదరన్ కమాండ్‌కు చెందిన కమాండింగ్-ఇన్-చీఫ్, జనరల్ ఆఫీసర్ లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ బృందం.

## ఆపరేషన్ సిందూర్ మూడ్రోజుల్లో ముగియలేదు

చాలా రోజులు కొనసాగింది

ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది

న్యూఢిల్లీ(జనంసాక్షి):పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టడం, ముగించడంపై ఆర్మీ చీఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఆపరేషన్ అందరూ

మిగతా 2లో..



## గణేష్ నిమజ్జన ప్రక్రియలో

# సీఎం రేవంత్

### తక్కువ సెక్యూరిటీతో జనంతో కలియదిరిగిన ముఖ్యమంత్రి



గణేష్ నిమజ్జన ప్రక్రియలో ప్రజలకు అభివాదం తెలుపుతూ, వారితో కలిసి నడుస్తూ సీఎం రేవంత్..

- ఎలాంటి ముందస్తు షెడ్యూల్ లేకుండా ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్యపరిచిన సీఎం
- పరిమిత వాహనాలతో సాదాసీదాగా పర్యటన
- ఓ వైపు సందర్శిస్తూనే మరోవైపు ప్రజలకు జాగ్రత్తగా ఉండాలని సూచనలు

హైదరాబాద్(జనంసాక్షి): హుస్సేన్ సాగర్ వద్ద నిమజ్జనాలను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పరిశీలించారు. భక్తులు, సందర్శకులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి వేదికపై నుంచి భక్తులకు అభివాదం చేశారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులతో కలిసి నినాదాలు చేశారు. క్రేన్ నెం.4వద్ద నిమజ్జనాలను పరిశీలించారు. నిమజ్జనం ఏర్పాట్లను కలెక్టర్ హరిచందన సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా విధుల్లో పాల్గొన్న అన్ని విభాగాల సిబ్బందిని సీఎం అభినందించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. ముందస్తు సమాచారం లేకుండా సాదాసీదాగా సీఎం రేవంత్‌రెడ్డి హుస్సేన్ సాగర్ వద్ద ప్రత్యక్ష కావడంతో భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా హుస్సేన్ సాగర్ వద్దకు సీఎం

మిగతా 2లో..





# కమీషన్లు రావని పేదలకు ఇళ్లు కట్టలేదు

### వారి దుర్బుద్ధితో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారు

కాళేశ్వరంతో లక్షకోట్లు కూడగట్టారు • సొంతింటి కల.. పేదవాడి చిరకాల కోరిక

అర్హులైన లబ్దిదారులకు విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు : మంత్రి పొంగులేటి



మహబూబ్‌నగర్ బ్యూరో (జనంసాక్షి): అర్హులైన ప్రతి పేద వారికి స్వంత ఇంటి కల నెరవేర్చేలా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర,సంబం ధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.శనివా రం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం లో మూసా పేట మండల కేంద్రం లో ఉప్పరిపల్లి ప్రమీల ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమం లో మంత్రులు పాల్గొని గృహ ప్రవేశం చేసి శిలా ఫలకం ఆవిష్కరణ చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సభ లో మంత్రులు మాట్లాడారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ స్వంత ఇంటి నిర్మాణం పేదోడి ఆత్మ గౌరవం,భరోసా,ధైర్యం అన్నారు.ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో పేద వారి చిరకాల కోరిక చిన్న ఇల్లు నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ఇండ్లు రాష్ట్రంలో మొదటి విడత 4 లక్షల 50 వేల ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు..ప్రతి నియోజక వర్గానికి 3500 ఇండ్ల చొప్పున మంజూరు చేసినట్లు ఇండ్ల నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు

మిగతా 12లో..

## రాష్ట్రాల ఆర్థికమంత్రులతో చర్చించాకే

# శ్లాబుల సవరణ

- జిఎస్టీ సంస్కరణలపై నిర్మలా సీతారామన్ వివరణ
- ధరలు దిగివచ్చి..సామాన్యులకు మేలుచేస్తుందని వెల్లడి
- సహకరణకు ధన్యవాదాలు తెలుపుతూ రాష్ట్రాలకు లేఖ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జిఎస్‌టి శ్లాబులు 5, 12,18, 28 శాతంగా ఉండేవి. అయితే ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న ట్టుగా ఈ శ్లాబుల విధానం బిజెపి నిర్ణయం కాదని, రాష్ట్ర ఆర్థిక మంత్రుల సాధికార కమిటీ- తీసుకున్నదని శనివారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. నాలుగు శ్లాబుల విధానంపై ప్రతిపక్ష పార్టీలు దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆమె శనివారం అన్నారు. నాలుగు శ్లాబుల విధానం కాస్తా.. తాజాగా జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో 5, 18 శాతం శ్లాబులకి తగ్గిస్తూ.. గతంలో ఉన్న 12, 28 శాతం శ్లాబులను తొలగిస్తూ ఈ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ శ్లాబులు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానుంది. తాజాగా ఈ విషయంపై నిర్మలా సీతారామన్ పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'సామాన్యులపై దృష్టిసారించి సంస్కరణలు చేపట్టాము. సామాన్యుడు వినియోగించే వస్తువులపై విధించే పన్నుపై సమీక్షించాము. ఈ సంస్కరణల వల్ల రేట్లు- బాగా తగ్గనున్నాయి' అని ఆమె అన్నారు. ఇకపోతే జీఎస్టీ లో సంస్కరణలకు మద్దతు తెలిపినందుకు అన్ని రాష్ట్రాలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు లేఖ రాసినట్లు- చెప్పారు. పన్ను రేట్లను సవరించాలనే దానిపై రాష్ట్రాలు అభిప్రాయాలు చెప్పినప్పటికీ.. అవన్నీ సామాన్యుడికి ప్రయోజనం కలిగించేవేనని అన్నారు. జీఎస్టీ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రజలకు ఎంతో దోహదపడతాయన్నారు. జీఎస్టీ రేట్లలో మార్పునకు మద్దతు తెలియ జేసినందుకు ప్రతి ఆర్థిక మంత్రికి ధన్యవాదాలు

మిగతా 2లో..

# మోదీ గొప్ప ప్రధాని

### కానీ ప్రస్తుత సమయంలో ఆయన చేస్తున్నది నాకు నచ్చడం లేదు



- రష్యా చమురు కొనుగోలు నిరాశకు గురిచేస్తోంది
- నేను విధించిన 50 శాతం సుంకాలు చాలా ఎక్కువే..
- భారత్‌తో సంబంధాల పునరుద్ధరణకు సిద్ధంగా ఉన్నా..
- భారత్- అమెరికా సంబంధాలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు

వాషింగ్టన్(జనంసాక్షి):భారీ సుంకాల విధింపు నేపథ్యంలో భారత్- అమెరికా సంబంధాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మోదీ గొప్ప ప్రధాని అని ప్రశంసించారు. భారత్, రష్యాలకు దూరమయ్యాం అంటూ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్టు పెట్టిన విషయం తెలిసిందే. దీనిపై మీడియా ప్రశ్నించగా.. ఆయన స్పందించారు. రష్యా నుంచి భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. అది తనను చాలా నిరాశకు గురిచేసిందన్నారు. అక్కడి చమురు కొనుగోలు చేయొద్దని భారత్‌కు చెప్పానన్నారు. వెనక్కి తగ్గకపోవడంతో భారత దిగుమతులపై పెద్ద మొత్తంలో టారిఫ్‌లు కూడా విధించానన్నారు. తాను విధించిన 50 శాతం

మిగతా 2లో..

## రష్యా,ఉక్రెయిన్ యుద్ధం ఆపడం కష్టమే:ట్రంప్

3లో..

## ఐక్యరాజ్యసమితి సమావేశాలకు భారత్ దూరం

9లో..

అమెరికా అధిక టారిఫ్‌ల వేళ కేంద్రం కీలక నిర్ణయం

## ట్రంప్ సానుకూల వైఖరి అభినందనీయం

### ఆయన వ్యాఖ్యలను అభినందిస్తున్నా: మోదీ



న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్-అమెరికా మధ్య టారిఫ్ విభేదాలు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా చమురు కొనుగోలు విషయంలో భారత్‌పై కొంతకాలంగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ వస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు స్వరం మార్చారు. భారత్‌కు దూరమయ్యామని అన్న ఆయన.. మోదీ గొప్ప ప్రధాని అంటూ తాజాగా కితాబిచ్చారు. దీనికి భారత ప్రధాని స్పందించారు. ట్రంప్ సానుకూల వైఖరి అభినందనీయమని అన్నారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.

మిగతా 2లో..

## అమెరికాతో భాగస్వామ్యానికి మోదీ అధిక ప్రాధాన్యం: జైశంకర్



న్యూఢిల్లీ(జనంసాక్షి):టారిఫ్‌ల నేపథ్యంలో భారత్- అమెరికా సంబంధాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. తాజాగా మోదీ గొప్ప ప్రధాని అంటూ ట్రంప్ ప్రశంసించడం.. ఆ వెంటనే మోదీ స్పందించడం చకచకా

మిగతా 2లో..

## ముంబయిలో తీగ లాగితే హైదరాబాద్‌లో డొంక కదిలింది

- మేడ్చల్ జిల్లా చర్లపల్లి ప్రాంతంలో భారీ డ్రగ్ తయారీ ఫ్యాక్టరీ గుట్టురట్టు
- 12 మందిని అరెస్టు చేసిన ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు
- అక్కడ అరెస్టైన బంగ్లాదేశ్ మహిళ కేసు ఆధారంగా ఆపరేషన్
- 32 వేల లీటర్ల రసాయనాలు స్వాధీనం



2లో..



## ఖమ్మం-దేవరపల్లి నేషనల్ హైవే తెలంగాణకు

# గేమ్ ఛేంజర్

ఉత్తర, దక్షిణ భారతాన్ని కలిపే ఈ రహదారి పూర్తైతే సరిహద్దు రాష్ట్రాలకు తగ్గనున్న దూరభారం • పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

ఖమ్మం(జనంసాక్షి): సూర్యాపేట నుంచి దేవర పల్లి నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. దం సలాపురం వద్ద జాతీయ రహదారి ఎంట్రీ, ఎగ్జిట్, మున్నేరు బ్రిడ్జి పనుల పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం నుంచి దేవరపల్లి నేషనల్ హైవే గేమ్ చేంజర్‌గా మారనుందన్నారు. ఉత్తర, దక్షిణ భారతాన్ని కలుపుతూ కనెక్టింగ్ హైవేగా ఖమ్మానికే కాకుండా తెలంగాణ రాష్ట్రానికే గేమ్ ఛేంజర్‌గా మారుతుందన్నారు. ఈ రహదారి పూర్తయితే ఖమ్మం నుంచి రాజమండ్రికి గంటన్నర సమయంలో ప్రయాణం చేయవచ్చని తెలిపారు.

మిగతా 12లో..

## గుజరాత్‌లో ఘోర ప్రమాదం

కార్గో రోప్‌వే వైర్ తెగిపోవడంతో ఆరుగురు దుర్మరణం

పంచ్‌మహల్ జిల్లాలోని పావగఢ్ శక్తి పీఠంలో విషాదం



2లో

## ఢిల్లీలోని ఎర్రకోటలో భారీ చోరీ


రూ. కోటి విలువచేసే కలశం అపహరణ



12లో

# కేసీఆర్‌తో హరీశ్‌రావు భేటీ

కాళేశ్వరంపై సీబీఐకి దర్యాప్తు, కవిత సస్పెన్షన్‌ల నేపథ్యంలో ఇరువురి భేటీకి సంతరించుకున్న ప్రాధాన్యం



ఎర్రవల్లి(జనంసాక్షి): భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌తో మాజీ మంత్రి హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇప్పటికే కేటీఆర్ సహా పలువురు పార్టీ ప్రముఖులు అక్కడ ఉన్నారు. ఇటీవల అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలు, కాళేశ్వరంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించడం, ఎమ్మెల్సీ పదవికి, భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కవిత రాజీనామా చేయడం తదనంతర పరిణామాలపై అంశాలపై మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే చర్చించినట్టు తెలుస్తోంది.

మిగతా 2లో..

## ఉద్యమం నుంచి నా ప్రస్థానం తెరిచిన పుస్తకం

- నాపై ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నా
- కవిత వ్యాఖ్యలపై స్పందించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్(జనంసాక్షి): ఇటీవల కవిత తనపై చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. ఉద్యమం నుంచి 25 ఏళ్లుగా తన ప్రస్థానం తెరిచిన

మిగతా 2లో..

# మోదీ గొప్ప ప్రధాని..

సుంకాలు చాలా ఎక్కువని అంగీకరించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీతో తనకు న్న వ్యక్తిగత సంబంధాల గురించి కూడా ట్రంప్ ప్రస్తావించారు. భారత్‌తో సంబంధాల పునరుద్ధరణకు సిద్ధంగా ఉన్నారా? అని విలే కరి అడగ్గా.. కచ్చితంగా అని ట్రంప్ బదులిచ్చారు. 'నేను ఎప్పుడూ అదే కోరుకుంటా. ప్రధాని మోదీతో నేను ఎప్పుడూ స్నేహంగానే ఉంటాను. ఆయన గొప్ప ప్రధాని. కానీ.. ప్రస్తుత సమయంలో ఆయన చేస్తున్నది నాకు నచ్చడం లేదు. భారత్‌- అమెరికా మధ్య ప్రత్యేకమైన సంబంధం ఉంది. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని సమాధానమిచ్చారు. ఇటీవల మోదీ అమెరికాలో పర్యటించిన విషయాన్ని కూడా ఆయన గుర్తు చేశారు. అంతకుముందు భారత్‌, రష్యాలను అమెరికా కోల్పోయిందని.. అవి రెండూ చైనా చీకటి వలయంలో చిక్కుకున్నాయని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో వ్యాఖ్యానించారు. భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు కలిసి ఉన్న ఫొటోను కూడా పంచుకున్నారు. ఆ మూడు దేశాలు సుదీర్ఘ, సుసంపన్న భవితవ్యం కలిగి ఉండాలని కోరుకుంటున్నట్లు వ్యంగ్యాస్త్రాలు విసిరారు. రష్యా, ఉత్తర కొరియాలతో కలిసి చైనా తమపై కుట్రపన్నుతున్నట్లు ఉందని ఆయన ఆరోపించారు. 2026 జీ20 శిఖరాగ్ర సదస్సును మియామిలోని తన సొంత గోల్ఫ్ రిసార్ట్‌లో నిర్వహించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. వచ్చే ఏడాది డిసెంబరులో ఈ సమ్మిట్ జరగనుంది. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్‌ను 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్' గా మార్చే ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు.

## ట్రంప్ సానుకూల వైఖరి అభినందనీయం

"ఇరు దేశాల సంబంధాలపై అధ్యక్షుడు ట్రంప్ భావాలు, సానుకూల దృక్పథాన్ని అభినందిస్తున్నా. భారత్‌, అమెరికా మంచి భవిష్యత్తు, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి" అని మోదీ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. దీనికి కొన్ని గంటల ముందు భారత్‌తో సంబంధాలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. "భారత్‌, అమెరికా మధ్య ప్రత్యేక బంధం ఉంది. దీనిపై ఆందోళన ఏమీ లేదు. రెండు దేశాలు కొన్ని సందర్భాల్లో మాత్రమే విభేదిస్తాయి. నేను ఎప్పుడూ ప్రధాని మోదీతో స్నేహంగా ఉంటాను. ఆయన గొప్ప ప్రధాన మంత్రి. కానీ ఈ సమయంలో ఆయన చేస్తున్నది నాకు నచ్చలేదు" అని అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు. ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని మోదీ హాజరైన సంగతి తెలిసిందే. ఆ సమావేశంలోనే రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ ద్వైపాక్షికంగా భేటీ అయ్యారు. ఆ సమయంలో మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌, పుతిన్ సన్నిహిత మిత్రుల మాదిరిగా ముచ్చటించుకున్నారు. దీనిపై ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో స్పందిస్తూ.. భారత్‌, రష్యాలను అమెరికా కోల్పోయిందని, అవి రెండూ చైనా చీకటి వలయంలో చిక్కుకున్నాయని అన్నారు. ఆ మూడు దేశాలు సుదీర్ఘ, సుసంపన్న భవితవ్యం కలిగి ఉండాలని కోరుకుంటున్నట్లు ఒకింత వ్యంగ్యంగా అన్నారు.

## అమెరికాతో భాగస్వామ్యానికి మోదీ అధిక ప్రాధాన్యం

జరిగిపోయాయి. ఈ క్రమంలో ఇరుదేశాల సంబంధాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్‌.జైశంకర్ మాట్లాడారు. అమెరికాతో భాగస్వామ్యానికి మోదీ అధిక ప్రాధాన్యత ఇస్తారని వ్యాఖ్యానించారు. ట్రంప్‌తో కూడా ఆయనకు బలమైన వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయన్నారు. అగ్రరాజ్యంతో భారత అధికారుల సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో భారత్‌పై ట్రంప్ భారీగా సుంకాలు విధించారు. చైనా, రష్యా, భారత్‌లు దగ్గరైన నేపథ్యంలో ఆయన స్వరం మారుస్తూ.. మోదీ గొప్ప ప్రధాని అంటూ ప్రశంసలు కురిపించారు. భారత్‌- అమెరికాలది ప్రత్యేక బంధమని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇరుదేశాల సంబంధాలపై ట్రంప్ భావాలు, సానుకూల దృక్పథాన్ని అభినందించారు. భారత్‌, అమెరికా మంచి భవిష్యత్తు, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయన్నారు.

## ఐక్యరాజ్యసమితి సమావేశాలకు భారత్ దూరం

**అమెరికా అధిక టారిఫ్‌ల వేళ భారత్ కీలక నిర్ణయం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అమెరికా అధిక టారిఫ్‌ల వేళ భారత్ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులో అమెరికాలో జరగనున్న ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరు కావాల్సి ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఈ సమావేశాలకు మోదీ హాజరు కావడం లేదని తెలిసింది. ఆయనకు బదులు విదేశాంగ శాఖ మంత్రి ఎస్‌.జైశంకర్ ఈ సమావేశాల్లో ప్రసంగించనున్నట్లు తాజా సమాచారం. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. హై లెవల్ డిబేట్ మాత్రం సెప్టెంబర్ 23 నుంచి 29 వరకు జరగనున్నది. చర్చలో పాల్గొనే వక్తల జాబితాను తాజాగా యూఎన్ గత నెల రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. తొలుత బ్రెజిల్ చర్చను ప్రారంభిస్తుంది. ఆ తర్వాత అమెరికా మాట్లాడుతుంది. సెప్టెంబర్ 23వ తేదీన యూఎన్జీఏ పోడియం నుంచి డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నేతలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సెప్టెంబర్ 26వ తేదీన ప్రధాని మోదీ ప్రసంగం ఉంటు-ందని ఆ జాబితాలో ఉంది. అదే రోజున ఇజ్రాయిల్‌, చైనా, పాకిస్థాన్‌, బంగ్లాదేశ్ నేతలు కూడా ప్రసంగిస్తారు. ఈ సమావేశాలకు ప్రధాని యూఎస్ వెళ్తారని అంతా భావించారు. ఈ పర్యటన సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇరుదేశాల మధ్య నెలకొన్న వాణిజ్య సమస్యల పరిష్కారానికి ట్రంప్‌-మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. అయితే, అనూహ్యంగా ఈ సమావేశాలకు మోదీ దూరంగా ఉన్నట్లు- తెలిసింది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.






# గణేశ్ నిమజ్జన ప్రక్రియలో సీఎం రేవంత్


వచ్చి ఏర్పాట్లను పరిశీలించడం పట్ల భాగ్యనగర్ ఉత్సవ్ సమితి ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. నగర వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ నేపథ్యంలో ట్యాంక్‌బండ్ వద్ద జరుగుతున్న గణేష్ నిమజ్జనాల వేడుకను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్వయంగా ట్యాంక్‌బండ్‌కు సీఎం వచ్చినట్లు- సమాచారం. నిమజ్జనాల నేపథ్యంలో అధికారులు చేసిన భద్రత ఏర్పాట్లను సీఎం పరిశీలించారు. అనంతరం ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సాధారణ వ్యక్తిగా ట్యాంక్ బండ్ వద్దకు వచ్చి నిమజ్జనం ఏర్పాట్లు- పరిశీలించారు. రేవంత్ రెడ్డి రావడంతో భారీగా ప్రజలు తరలివచ్చారు. ప్రజలకు అభివాదం చేస్తూ.. ముందుకు కదిలారు. అత్యంత తక్కువ సంఖ్యలో భద్రత సిబ్బందితో.. మూడు కార్ల ఎస్కార్ట్‌తో సీఎం ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు. నిమజ్జనం జరుగుతున్న తీరును అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. వినాయక నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించాలని సీఎం స్పష్టం చేశారు. సాదాసీదాగా ప్రత్యక్షమైన రేవంత్ రెడ్డి అకస్మాత్తుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలాంటి షెడ్యూల్ లేకుండా ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్యపరిచారు. ముఖ్యమంత్రిని చూడగానే అక్కడున్న భక్తులు ఆశ్చర్యపోతూ అభివాదం చేశారు. గణేశ్ నిమజ్జనాలను సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా



పరిశీలించారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి వేదిక పైనుంచి ప్రజలకు అభివాదం చేసిన సీఎం భక్తులతో కలిసి 'గణపతి బప్పా మోరియా' అని నినాదాలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. అనంతరం క్రేన్ నంబర్ 4 వద్ద నిమజ్జనం ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. నిమజ్జనం ఏర్పాట్ల గురించి సీఎంకు హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి వివరించారు. విధుల్లో పాల్గొన్న అన్ని విభాగాల సిబ్బందిని ఆయన అభినందించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. భక్తులు, సందర్శకులు ఇళ్లకు క్షేమంగా చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా సాదాసీదాగా సీఎం రేవంత్‌రెడ్డి హుస్సేన్ సాగర్ వద్ద ప్రత్యక్ష కావడంతో భక్తులు కొంత ఆశ్చర్యానికి గురయ్యారు. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతానికి సీఎం వచ్చి ఏర్పాట్లను పరిశీలించడం పట్ల భాగ్యనగర్ ఉత్సవ్ సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రావడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఫొటోలు దిగడానికి పోటీ పడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలా సాధారణంగా వచ్చి గణేశ్ నిమజ్జనాల తీరును ఎప్పుడూ పరిశీలించలేదని పలువురు చెబుతున్నారు. అనంతరం ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్?లోని తన నివాసానికి వెళ్లారు. మరోవైపు హుస్సేన్‌సాగర్‌లో గణపతి విగ్రహాల నిమజ్జనం కొనసాగుతోంది. ట్యాంక్‌బండ్ మీదకు గణపతి విగ్రహాలు వేలాదిగా తరలివస్తున్నాయి. భక్తులతో హుస్సేన్‌సాగర్ పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. జనసంద్రంగా ట్యాంక్‌బండ్‌, ఎన్టీఆర్ మార్గ్ ప్రాంతాలు మారాయి. ప్రధాన, చిన్నచిన్న చెరువుల్లోనూ గణేశ్ నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. మినీట్యాంక్ బండ్‌గా పిలుచుకునే సరూర్‌నగర్ చెరువులోనూ వేలాది విగ్రహాల నిమజ్జనం అవుతున్నాయి. చెరువులతో పాటు బేబీపాండ్స్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. కాగా హైదరాబాద్‌లో ఎంజే మార్కెట్ మీదుగా ట్యాంక్‌బండ్ వరకు గణేశ్ శోభాయాత్రలు కొనసాగుతున్నాయి. దీంతో గణేశ్ విగ్రహాల వాహనాలు, భక్తులతో రోడ్లు కిటకిటలాడుతున్నాయి. పలు ప్రాంతాల నుంచి వస్తున్న గణనాథులను ఎంజే మార్కెట్ మీదుగా పోలీసులు తరలిస్తున్నారు. బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర పాతబస్తీలో ఎంజే మార్కెట్ వద్దకు చేరుకుంది. హైదరాబాద్‌లో గణపతుల నిమజ్జనం ప్రశాంతంగా జరుగుతోందని డీజీపీ జితేందర్ తెలిపారు. ఖైరతాబాద్ గణనాథుడి నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందని, సాయంత్రం వరకు బాలాపూర్ గణేశుడి నిమజ్జనం పూర్తవుతుందని వెల్లడించారు. రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 1.66 లక్షల గణపతి విగ్రహాలు ఏర్పాటు చేశారని, ఇప్పటి వరకు 80 వేల గణపతి విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యిందని ప్రకటించారు. ఇంకా 36 వేల విగ్రహాల నిమజ్జనం పూర్తి కావాల్సి ఉందన్నారు. నిమజ్జనం కోసం ప్రత్యేక బలగాలు విధులు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ మూడ్రోజుల్లో ముగియలేదు

అను కున్నట్లు- మూడు రోజుల్లోనే ముగిసి పోలేదని, చాలా రోజులు కొనసాగిందని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. దిల్లీలో 'ఆపరేషన్ సిందూర్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఇండియాస్ డీప్ స్ట్రైక్స్ ఇన్‌సైడ్ పాకిస్థాన్' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ద్వివేది మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'పాకిస్థాన్‌తో మే 10న యుద్ధం ముగిసిందని మీరు అనుకుంటున్నారు. కానీ కాదు. అనేక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండటంతో.. అది చాలా రోజులు కొనసాగింది. ఆ విషయాలన్నీ ఇక్కడ వెల్లడించలేను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాక్ మద్దతు ఉన్న ఉగ్రవాదులు ఇంకా ఉన్నారని, సరిహద్దు వెంబడి వారి చొరబాటు- ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. భారత్ చేపట్టిన ఆపరేషన్‌లో ఎంత మంది ఉగ్రవాదులు హతమయ్యారో అందరికీ తెలుసన్నారు. ఆపరేషన్ సమయంలో సాయుధ దళాల సహకారాన్ని ఆయన ప్రశంసించారు. ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలను ద్వివేది స్వాగతించారు. డ్రోన్‌లపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం హర్షణీయమన్నారు. భారత్ 'ఆపరేషన్ సిందూర్'తో పాక్‌, పీవోకేలోని ఉగ్ర శిబిరాలే లక్ష్యంగా మెరుపుదాడులు చేసింది. అత్యంత కచ్చితత్వంతో కీలక ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. దీంతో ఇరుదేశాల మధ్య కొన్ని రోజులపాటు- భీకర ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. అనంతరం పాక్ అభ్యర్థన మేరకు భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది. ఈ క్రమంలో ద్వివేది చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.




## రష్యా,ఉక్రెయిన్ యుద్ధం ఆపడం కష్టమే..

**వాషింగ్టన్(జనంసాక్షి):** 'అధికారంలోకి వస్తే ఒక్క రోజులోనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేస్తా' - అధ్యక్ష ఎన్నికల సమయంలో డొనాల్డ్ ట్రంప్ పదే పదే చెప్పిన మాట ఇది. అయితే, ఆ హామీని తాను నెరవేర్చలేకపోతున్నానని ట్రంప్ తాజాగా అంగీకరించారు. ఆ యుద్ధం ఆపడం చాలా ఈజీ అనుకున్నానని, కానీ, తన హయాంలో చూసిన అత్యంత క్లిష్టమైన ఘర్షణ ఇదేనని వ్యాఖ్యానించారు. అమెరికా కాంగ్రెస్ సభ్యులకు ట్రంప్ వైట్‌హౌస్‌లో ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఏడు సుదీర్ఘ యుద్ధాలను తాను ఆపానని మరోసారి చాటింపు వేసుకున్నారు. అయితే, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని మాత్రం ఆపలేకపోయానని తెలిపారు. "గత ఏడు నెలల కాలంలో నేను చేసినంతగా ఎవరూ చేయలేదు. ఏడు యుద్ధాలను ఆపా. 31 ఏళ్లుగా కొనసాగుతున్న ఓ ఘర్షణ ముగియడం అసాధ్యమని అంతా అనుకున్నారు. కానీ, నేను వెళ్లి రెండు గంటల్లో దాన్ని ముగించా. 35-37 ఏళ్లుగా జరుగుతున్న యుద్ధాలను కూడా ఆపా. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తో నాకు ఉన్న స్నేహబంధం కారణంగా మాస్కో-కీవ్ యుద్ధాన్ని ముగించడం చాలా సులువైన పని అని భావించా. కానీ, అది అంత ఈజీ కాదు. ఈ రెండు దేశాల మధ్య ఘర్షణను ఆపడం అత్యంత కష్టతరంగా మారింది" అని ట్రంప్ వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం కోసం ట్రంప్ గత కొంతకాలంగా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇటీవల అలాస్కా వేదికగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ భేటీ అయ్యారు. ఆ చర్చలు ఫలప్రదమైనట్లు ట్రంప్ చెబుతున్నప్పటికీ.. కాల్పుల విరమణకు అధికారిక ఒప్పందం మాత్రం జరగట్లేదు.

## రాష్ట్రాల ఆర్థికమంత్రులతో చర్చించాకే శ్లాబుల సవరణ

తెలియజేశా. ఎన్ని తీవ్రమైన చర్చలు, వాదనలైనా చేయవచ్చు. చివరకు జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలతో దేశ ప్రజలకు ఉపశమనం కలిగింది. ఇందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ లేఖ రాశానని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. సామాన్యులకు ప్రయోజనం చేకూర్చే సవరణలే ఉన్నాయని, వీటికి వ్యతిరేకంగా మాట్లాడే అవకాశమే లేదన్నారు. దేశ ప్రయోజనాల కోసం అందరూ ఒక్కతాటిపైకి రావడం సంతోషకర విషయమన్నారు.రేట్ల తగ్గింపుపై రాష్ట్రాలు ఎప్పుడూ అనుకూలంగానే ఉంటాయని, అయితే, వారి ఆందోళనంతా రాబడిలో కోతపైనే ఉంటుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. తాజా తగ్గింపుతో రాష్ట్రాలకే కాకుండా కేంద్రం కూడా ఆదాయం కోల్పోతుందన్న విషయం వారికి చెప్పాను. రేట్లు- తగ్గితే ప్రజలు కొనుగోలు చేస్తారు. తద్వారా కోల్పోయిన ఆదాయాన్ని ప్రభుత్వాలు భర్తీ చేసుకోవచ్చు. ఈ విషయంతోనే ఏకాభిప్రాయం కుదిరిందని కేంద్ర మంత్రి వివరించారు. ఇదిలాఉంటే, ఇటీవల తీసుకున్న జీఎస్‌టీ- కొత్త రేట్లు- సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్న విషయం తెలిసిందే.

రాష్ట్రాలకు నిర్మలా సీతారామన్ లేఖ


జీఎస్టీ లో సంస్కరణలకు మద్దతు తెలిపినందుకు అన్ని రాష్ట్రాలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు లేఖ రాసినట్లు చెప్పారు. పన్ను రేట్లను సవరించాలనే దానిపై రాష్ట్రాలు అభిప్రాయాలు చెప్పినప్పటికీ.. అవన్నీ సామాన్యుడికి ప్రయోజనం కలిగించేవేనని అన్నారు. పీటీఐతో మాట్లాడిన ఆమె జీఎస్టీ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రజలకు ఎంతో దోహదపడతాయన్నారు. "జీఎస్టీ రేట్లలో మార్పునకు మద్దతు తెలియజేసినందుకు ప్రతి ఆర్థిక మంత్రికి ధన్యవాదాలు తెలియజేశా. ఎన్ని తీవ్రమైన చర్చలు, వాదనలైనా చేయవచ్చు. చివరకు జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలతో దేశ ప్రజలకు ఉపశమనం కలిగింది. ఇందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ లేఖ రాశా" అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. సామాన్యులకు ప్రయోజనం చేకూర్చే సవరణలే ఉన్నాయని, వీటికి వ్యతిరేకంగా మాట్లాడే అవకాశమే లేదన్నారు. దేశ ప్రయోజనాల కోసం అందరూ ఒక్కతాటిపైకి రావడం సంతోషకర విషయమన్నారు. రేట్ల తగ్గింపుపై రాష్ట్రాలు ఎప్పుడూ అనుకూలంగానే ఉంటాయని, అయితే, వారి ఆందోళనంతా రాబడిలో కోతపైనే ఉంటుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. "తాజా తగ్గింపుతో రాష్ట్రాలకే కాకుండా కేంద్రం కూడా ఆదాయం కోల్పోతుందన్న విషయం వారికి చెప్పాను. రేట్లు తగ్గితే ప్రజలు కొనుగోలు చేస్తారు. తద్వారా కోల్పోయిన ఆదాయాన్ని ప్రభుత్వాలు భర్తీ చేసుకోవచ్చు. ఈ విషయంతోనే ఏకాభిప్రాయం కుదిరింది" అని కేంద్ర మంత్రి వివరించారు. ఇదిలాఉంటే, ఇటీవల తీసుకున్న జీఎస్‌టీ కొత్త రేట్లు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్న విషయం తెలిసిందే.

## ఉద్యమం నుంచి నా ప్రస్థానం తెరిచిన పుస్తకం

పుస్తకమని పేర్కొన్నారు."ఇటీవల కాలంలో నాపై, పార్టీ పై కొందరు ఆరోపణలు చేశారు. ఎందుకు చేశారో? ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు చేశారో?. నాపై చేసిన ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నాను. కేసీఆర్ గత పదేళ్లుగా నిర్మించిన ఒక్కో వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారు. రాష్ట్రంలో ఓ వైపు రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతుంటే ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మంచివి కావు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే మా ముందున్న కర్తవ్యం" అని హరీశ్‌రావు అన్నారు.

## ముంబయిలో తీగ లాగితే హైదరాబాద్‌లో డొంక కదిలింది

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్‌లో భారీ డ్రగ్స్ తయారీ యూనిట్ గుట్టురట్టయింది. ముంబయిలో అరెస్టైన ఓ బంగ్లాదేశ్ మహిళ కేసు ఆధారంగా దర్యాప్తు చేపట్టిన ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులు కీలక ముఠాను హైదరాబాద్?లో అరెస్టు చేశారు. డ్రగ్స్ తయారీకి వినియోగించే 32 వేల లీటర్ల రసాయనాలు, 950 కిలోల ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా సరఫరా చేస్తున్న సిండికేట్‌పై మరిన్ని వివరాలు కోసం ముమ్మర విచారణ చేస్తున్నారు. మేడ్చల్ జిల్లా చర్లపల్లిలో పెద్ద ఎత్తున మాదక ద్రవ్యాల తయారీ కలకలం రేపింది. ఈ ఘటనలో మహారాష్ట్ర క్రైం బ్రాంచ్ పోలీసులు 12 మందిని అరెస్టు చేశారు. మెఫిడ్రిన్ డ్రగ్స్ తయారీలో వినియోగించే 32 వేల లీటర్ల రసాయనాలు, మిథైల్‌ఎనెడియాక్సీ మెథాంఫెటమైన్ అనే ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఫ్యాక్టరీలో తయారైన మాదక ద్రవ్యాలను ఎక్స్‌టసీ, మోలీ, ఎక్స్‌టీసీ పేర్లతో దేశంలోని వివిధ ప్రాంతాలకు నిందితులు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. నిందితులు తయారీదారులు, పంపిణీదారులను పట్టుకున్న పోలీసులు ప్రధాన నిందితులు ఫ్యాక్టరీ



యజమాని శ్రీనివాస్ విజయ్ ఓలేటి, అతని భాగస్వామి తానాజీ పంధరీ నాథ్ పట్వారీని అరెస్టు చేశారు. ఫ్యాక్టరీ నుంచి 5.79 కిలోల మెఫెడ్రిన్‌, 35వేల లీటర్ల రసాయనాలు, 950 కిలోల ముడి పదార్థం, 27 ఫోన్లు, 3 కార్లు, ఓ బైక్‌, డ్రగ్స్ తయారీ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.డ్రగ్స్ తయారీ దందాలో ముంబయిలో తీగ లాగితే హైదరాబాద్‌లో డొంక కదిలింది. ఆగస్టు 8న ముంబై మిరా భయందార్ పరిధిలో బంగ్లాదేశ్‌కు చెందిన ఫాతిమా మురాద్ షేక్ అలియాస్ మొల్లా అనే మహిళ వద్ద 105 గ్రాముల మెఫడ్రిన్ మత్తు పదార్థం పట్టుబడింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఫాతిమా డ్రగ్ సరఫరాలో కీలకంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో ఫాతిమాతో పాటు 12 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు 23.97లక్షల నగదు, 178 గ్రాముల మెఫిడ్రిన్ స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో నిందితులు మాదక ద్రవ్యాలను తెలంగాణ నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన ముంబై పోలీసులు చర్లపల్లి నవోదయ కాలనీలో డ్రగ్స్ తయారీ ఫ్యాక్టరీ గుట్టు రట్టు చేశారు. విచారణలో దేశవ్యాప్తంగా సరఫరా చేస్తున్న సిండికేట్‌పై మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. చర్లపల్లిలో డ్రగ్స్ తయారీ కేంద్రం ఘటనపై తెలంగాణ పోలీసులు కూడా దర్యాప్తును ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. డ్రగ్స్, మాదక ద్రవ్యాల నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్? టీంను ఏర్పాటు చేసింది. యాంటి నార్కోటిక్? బ్యూరో సైతం మాదక ద్రవ్యాల తయారీ సరఫరా ఘటనలపై ఉక్కుపాదం మోపుతోంది. తెలంగాణ సీఎం రేవంత్? రెడ్డి మాదక ద్రవ్యాల విషయంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని పదే పదే పలు ప్రసంగాల్లో వెల్లడించిన సంగతి తెలిసిందే.

## గుజరాత్‌లో ఘోర ప్రమాదం

- కార్గో రోప్‌వే వైర్ తెగిపోవడంతో ఆరుగురు దుర్మరణం
- పంచ్‌మహల్ జిల్లాలోని పావగఢ్ శక్తి పీఠంలో విషాదం

**గాంధీనగర్(జనంసాక్షి):** గుజరాత్‌లోని పంచ్‌మహల్ జిల్లాలోని పావగఢ్ శక్తి పీఠంలో ఘోర ప్రమాదం జరిగింది. కార్గో రోప్‌వే వైర్ అకస్మాత్తుగా తెగిపోవడంతో ఆరుగురు మరణించారు. మృతుల్లో ఇద్దరు లిఫ్ట్‌మెన్లు, ఇద్దరు కార్మికులతో పాటు మరో ఇద్దరు ఉన్నారని చెబుతున్నారు. ఈ ప్రమాదం మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో జరిగింది. పంచ్‌మహల్ కలెక్టర్‌, పోలీసు సూపరింటెండెంట్ హరీష్ దుధత్ ఈ సంఘటనను ధృవీకరించారు. ప్రమాదం తర్వాత, మొత్తం ప్రాంతంలో భయాందోళన వాతావరణం నెలకొంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. పావగఢ్ కొండ దాదాపు 800 మీటర్ల ఎత్తులో ఉంది. భక్తులు 2000 మెట్లు- ఎక్కడం ద్వారా లేదా రోప్‌వే ద్వారా ఆలయానికి చేరుకుంటారు. అయితే, శనివారం ఉదయం నుండి రోప్‌వే సేవ మూసివేయబడింది. వస్తువులను తీసుకెళ్లడానికి ఉపయోగించే కార్గో రోప్‌వేలో ఈ ప్రమాదం జరిగింది. పావగఢ్ శక్తి పీఠం మహాకాళి అమ్మవారికి అంకితం ఇవ్వబడింది. ఇక్కడ ప్రతి సంవత్సరం దాదాపు 25 లక్షల మంది భక్తులు దర్శనం కోసం వస్తుంటారు. ప్రమాదం జరగడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. సాంకేతిక దర్యాప్తు తర్వాతే ప్రమాదానికి అసలు కారణం స్పష్టంగా తెలుస్తుందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం, మృతుల కుటు-ంబాలకు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే, పోలీసులు , అగ్నిమాపక శాఖ బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రాథమిక దర్యాప్తులో ఆరుగురు మరణించినట్లు- నిర్ధారించామని పావగఢ్ ఎస్పీ హరీష్ దుధత్ తెలిపారు. మృతదేహాలను పోస్ట్ మార్టంకు తరలించామని వెల్లడించారు. బలమైన గాలుల కారణంగా, ప్రయాణీకుల భద్రత కోసం రోప్‌వే ఆపరేషన్‌ను కూడా నిలిపివేశారని చెప్పుకొచ్చారు.

# సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు అస్వస్థత

### అపోలోకు తరలించి చికిత్స



**హైదరాబాద్,సెప్టెంబర్6 (జనంసాక్షి) :** సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో, ఆయనను జూబ్లీహిల్స్ అపోలో ఆసుప్రతికి తరలించారు. ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు వెల్లడించారు. శ్రీశైలం దర్శనం కోసం వెళ్లిన ఆయన శనివారం ఉదయం హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది.. ఆయన్ను జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన పోలీసు ఉన్నతాధికారులంతా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. శుక్రవారం నగరానికి చేరుకున్న ఆయన హైదరాబాద్ జోన్ సీబీఐ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. రెండు గంటలకు పైగా సుదీర్ఘంగా చర్చించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 1న కేంద్రానికి అధికారికంగా లేఖ రాసింది. ఈ పరిణామం జరిగిన వెంటనే సీబీఐ డైరెక్టర్ స్వయంగా హైదరాబాద్‌కు రావడం హాట్ టాపిక్‌గా మారింది.

# హోటల్ లాకర్ నుంచి 60 లక్షల నగదు చోరీ

### లాకర్ పగులగొట్టి దోచుకున్న దుండగులు



**మిర్యాలగూడ, సెప్టెంబర్6 (జనంసాక్షి):** ఓ హోటల్లోని లాకర్‌లో భద్రపరిచిన రూ.60 లక్షలకు పైగా నగదును దుండగులు దోచుకెళ్లారు. ఈ ఘటన నల్గొండ జిల్లా మిర్యాలగూడలో శనివారం వెలుగులోకి వచ్చింది. డీఎస్పీ రాజశేఖర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హోటల్ వైష్ణవి గ్రాండ్ నిర్వాహకులు గత కొద్ది రోజులుగా తమ వ్యాపారాల ద్వారా వచ్చిన నగదును హోటల్ మొదటి అంతస్తులోని లాకర్‌లో భద్రపరిచారు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత ఓ దుండగుడు హోటల్‌లోకి ప్రవేశించి.. గది తలుపులు, లాకర్ తాళం పగులగొట్టి నగదు తీసుకెళ్లినట్టు- నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్లూస్ టీ-మ్, డాగ్ స్క్వాడ్ బృందాల సాయంతో ఆధారాలు సేకరిస్తున్నట్లు- డీఎస్పీ తెలిపారు. ఒకే వ్యక్తి చోరీకి పాల్పడినట్లు- సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించామని తెలిపారు. విచారణ వేగవంతం చేశామని, త్వరలోనే నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.


# పీసీబీ సైంటిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

### రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్తల అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రసాద్ నేతృత్వంలో ఆ సంఘం జనరల్ సెక్రటరీ, కార్యనిర్వాహక సభ్యులు రాష్ట్ర మంత్రి కొండా సురేఖను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మొట్ట మొదటి రిజిస్టర్డ్ అసోసియేషన్ ఏర్పాటు చేశామని మంత్రి సురేఖకు వివరించారు. తమ సమస్యలను ఉన్నత అధికారులకు, ప్రభుత్వానికి తెలియచేయడానికి పర్యావరణ కాలుష్యం నిరోధించడానికి ఈ అసోసియేషన్ కృషి చేస్తుందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సైంటిఫిక్ అసోసియేషన్ ఏర్పడిన సందర్భంగా మంత్రికి తమ సమస్యలు, ఇంకా విధులలో తమకు జరుగుతున్న వివక్షను తెలియజేశారు. విధులలో సముచిత ప్రాధాన్యత, ప్రాతినిధ్యం కల్పించటం లేదని తెలిపారు. ఇటీవల ప్రతిపాదించిన 42 పోస్టులలో కేవలం ఎనిమిది పోస్టులు మాత్రమే శాస్త్రవేత్తలకు కేటాయించి మిగతా అంతా ఇంజినీరింగ్ పోస్టులతో కొత్త జోనల్, రీజనల్ ఆఫీసుల ఏర్పాటుకు ప్రతిపాదించారన్నారు. జోనల్ ఆఫీసుల్లో ఏర్పాటుకు జోనల్ ల్యాబ్ కూడా ఉండాలని, కాని వాటిని ప్రతిపాదించలేదని చెప్పారు. ఈ విధంగా అన్నింట తమకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని వివరించారు. శాస్త్రవేత్తలకు కనీసం ఆఫీస్ లాగిన్ ఐడీలు కూడా ఇవ్వకుండా వారిని పర్యావరణ, పరిశ్రమలలో నమూనాలను సైతం సేకరించడానికి వినియోగించటం లేదని మంత్రికి తెలిపారు. కాగా, వీరి విజ్ఞప్తి మేరకు పీసీబీలో జరుగుతున్నా వివక్షకు సంబంధించి పూర్తి వివరాలు తెప్పించుకుని పరిశ్రమల తనిఖీల్లో ఒక శాస్త్రవేత్త ను విధిగా ఉండాలన్న నిబంధనను విధిస్తామని హామీనిచ్చినట్టు తెలిసింది. ఇక లాగిన్ ఐడీ అన్నది ప్రతి అధికారికి ఇవ్వటానికి ఆదేశాలు జారీ చేస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణకు శాస్త్రవేత్తలు చాలా ముఖ్యం కావున అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలి

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్







**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి/కోనరావుపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొనరావుపేట మండలం మర్రిమడ్ల నందు గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లో 5వ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెలక్షన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. మంత్రి స్థాయిలో కొనరావుపేట మండలంలో జరుగుతున్న ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీలకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తక్కువ సమయంలో క్రీడ పోటీల నిర్వహణకు మంచి ఏర్పాటు చేసిన అధికారులను సిబ్బందిని మంత్రి అభినందించారు. రాష్ట్ర నలుమూలల నుంచి నేడు 1200 మంది పైగా విద్యార్థులకు క్రీడా పోటీలు జరుగుతున్నాయన్నారు. ఇండోర్, ఔట్ డోర్ క్రీడా పోటీలను ప్రణాళిక ప్రకారం పక్కగా నిర్వహించాలన్నారు. క్రీడ పోటీలో పాల్గొనేందుకు వచ్చిన పిల్లలకు ఎక్కడ ఇబ్బంది కలగకుండా క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. నిబంధనలు ప్రకారం పోటీలు నిర్వహించాలన్నారు. ఏకలవ్య పాఠశాలలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని , తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత రూ 740 కోట్లు గిరిజన గ్రామ పంచాయతీలకు విడుదల చేశామన్నారు. ప్రభుత్వ విప్ కోరిక మేరకు గిరిజన ప్రాంతాలకు రోడ్ల నిర్మాణానికి అదనంగా రూ 10 కోట్లు తప్పనిసరిగా మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలకు మంచి విద్యార్థి అందించాలని లక్ష్యంతో గురుకులాలను ప్రభుత్వం నిర్వహిస్తుందనన్నారు. గురుకులలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని, అనేకమంది కలెక్టర్,ఎస్పీ లాయర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు వంటి గొప్ప స్థానాలకు ఎదిగారనన్నారు. తల్లిదండ్రులు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, గురుకులాలో ఉపాధ్యాయులు చెప్పే మాటలు పాటించాలన్నారు. చిన్నారులలో ఉన్న సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ఉపాధ్యాయుల అంతర్గత బదిలీలు, పదోన్నతుల కల్పన, గురుకులాల్లో 40 శాతం డైట్ చార్జీలు,200 శాతం కాస్మోటిక్ చార్జీల, ప్రతి నియోజకవర్గ పరిధిలో 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం, అడ్వాన్స్ ట్రేడ్ సెంటర్ల ద్వారా ప్రత్యేక నైపుణ్యా శిక్షణ అందించడం నువ్వంటే అనేక కార్యక్రమాలను విద్యాశాఖలు ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీలలో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి ముందుకు పోవాలన్నారు. క్రీడలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుందన్నారు. క్రీడాకారులకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత అందిస్తుందన్నారు. మనకు రూ 9 కోట్లు నిధులు మంజూరు చేసినందుకు మంత్రి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వేములవాడకు మరో రూ10 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ.. మన రాష్ట్రం నుంచి అధికంగా క్రీడాకారులు ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనాలని కలెక్టర్ ఆకాంక్షించారు. క్రీడలు ఆడే సమయంలో గెలవడం, ఓడిపోవడం ముఖ్యం కాదని పాల్గొనడం చాలా కీలకమన్నారు. క్రీడల వల్ల విద్యార్థులకు మంచి క్రీడా స్ఫూర్తి లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. రాబోయే మూడు రోజుల పాటు ఈఎంఆర్ఎస్ క్రీడ పోటీల సందర్భంగా విద్యార్థులందరికీ మంచి ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. క్రీడ పోటీల నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈఎంఆర్ఎస్ సెక్రటరీ సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ 5వ జాతీయ ఈఎంఆర్ఎస్ స్పోర్ట్స్ సెలక్షన్ మీట్ జరుగుతుందని,ఇందులో 300 మంది క్రీడాకారులు తెలంగాణ రాష్ట్రాన్ని జాతీయ ఈఎంఆర్ఎస్ క్రీడ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపిక చేసిన క్రీడాకారులు అనేక పతకాలు సాధించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని 23 ఈఎంఆర్ఎస్ పాఠశాలల నుంచి 1200 మంది బాలికలు వచ్చారని, 16 రకాల క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలని, గెలవడం ఓడటం సహజమని, క్రీడలలో పాల్గొనడం చాలా ముఖ్యమన్నారు. అనంతరం ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన మాలావత్ పూర్ణ మాట్లాడుతూ గురువుల పాఠశాలలో చదువుకున్న తాను ఎవరెస్ట్ శిఖరం అధిరోహించడం జరిగిందని అన్నారు. మనం ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నా మనం నిర్దేశించుకున్న మంచి లక్ష్యం సాధన కోసం కృషి చేస్తే సమాజం మొత్తం మనకు సహకారం అందిస్తుందన్నారు. లక్ష్యం దిశగా మొదటి అడుగు వేయడం చాలా కీలకమన్నారు. మనం ఏదైనా సాధించాలి అనుకుంటే కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావాలన్నారు. అనంతరం మంత్రి ,విప్ కబడ్డీ క్రీడ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పి శేషాద్రిని రెడ్డి, ఆర్డిఓ రాధా బాయి, విద్యార్థిని విద్యార్థులు ప్రిన్సిపాల్, పిఈటిలు, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# యాదాద్రి సహా ప్రధాన ఆలయాల మూసివేత

**యాదగిరిగుట్ట,సెప్టెంబర్6 (జనంసాక్షి) :** ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి ప్రధాన, ఉప, అనుబంధ ఆలయాలను మధ్యాహ్నం నుంచి మూసివేయనున్నట్లు- అధికారులు తెలిపారు. నిత్య కైంకర్యాలు, నివేదన ముగించి ఆలయాన్ని మూసివేయనున్నారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఆలయ సంప్రోక్షణ చేసి సుప్రభాతం, బిందె తీర్థం, బాలభోగం, నిజాభి సహస్రనామార్చన నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల లోపు స్వామివారి దర్శనాలకు అనుమతించనున్నారు. ఆ తర్వాత తలుపులు మూసివేయనున్నారు. మధ్యాహ్నం 12, సాయంత్రం 4 గంటలకు నిర్వహించే సత్యనారాయణ స్వామి వ్రతాల బ్యాచ్ రద్దు చేశారు. వాహన పూజలు మధ్యాహ్నం వరకే నిర్వహిస్తామని తెలిపారు. వేములవాడ ఆలయం కూడా మూతపడనుంది. మధ్యాహ్నం ఆలయం మూసివేసి సోమవారం తెల్లవారుజామున తెరుస్తామని ప్రకటించారు. తిరుమల, శ్రీశైలం, కనకదుర్గ ఇలా ప్రధాన ఆలయాలన్నీ మూసివేయనున్నారు.

# క్రేన్ కిందపడి విశ్రాంత ఉద్యోగి మృతి

**రంగారెడ్డి,సెప్టెంబర్6 (జనంసాక్షి) :** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ గాయత్రి నగర్‌లో విషాదం చోటు-చేసుకుంది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న విశ్రాంత ఉద్యోగి ప్రసాద్‌బాబు (65) క్రేన్ ఢీకొని మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... డ్రైవర్ నిర్లక్ష్యంగా క్రేన్ నడపడంతో నడుచుకుంటూ వెళ్తున్న ప్రసాద్‌బాబు.. వాహనం ముందు టైరు తగిలి కిందపడిపోయాడు. ఆ తర్వాత క్రేన్ అతనిపై నుంచి తొక్కుకుంటూ వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన జరిగిన వెంటనే డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న మీర్‌పేట్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

# శోభాయాత్రలో అపశృతి

### డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిన వ్యక్తి

**నారాయణపేట,సెప్టెంబర్6 (జనంసాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో శనివారం వినాయక నిమజ్జన ఉత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. నృత్యం చేస్తూనే ఓ వ్యక్తి కుప్పకూలాడు. నారాయణపేట పురపాలికలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న శేఖర్(45) గుండెపోటుతో మృతి చెందాడు. నిమజ్జన ఉత్సవాల్లో డ్యాన్స్ చేస్తూ పడిపోయాడు. విషయాన్ని గమనించిన స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు సీపీఆర్ చేసి.. స్థానికుల సాయంతో ఓ ప్రైవేటు-ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే శేఖర్ మృతి చెందినట్లు- వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

# ఆవేశానికి లోనై యువకుడు ఆత్మహత్య

**బోయిన్ పల్లి సెప్టెంబర్ 06 (జనం సాక్షి) :** బోయినపల్లి మండలంలోని వెంకటరావుపల్లి గ్రామానికి చెందిన యువకుడు ఆవేశానికి లోనై ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పోతు అరవింద్ హైదరాబాద్‌లోని రాపిడ్ సంస్థలో డెలివరీ బాయ్‌గా పని చేసుకుంటున్నాడు. శుక్రవారం రోజున వినాయక నిమజ్జనం సందర్భంగా స్వగ్రామం వెంకటరావుపల్లికి వచ్చి స్నేహితులతో కలిసి డాన్స్ చేశాడు. అనంతరం ఉదయం ఇంటికి చేరి ఆవేశంతో కత్తెరతో తనపై దాడి చేసుకోవడానికి ప్రయత్నించగా, తల్లి ఆపింది. తల్లి ఇంటి పనులు చేసుకుంటూ ఉండగా, అరవింద్ గది తలుపులు వేసుకుని లోపలికి వెళ్లిపోయాడు. తల్లి పిలిచినా స్పందించకపోవడంతో పెద్ద కుమారుడికి సమాచారం ఇచ్చింది. పెద్ద కుమారుడు వచ్చి తలుపులు బలవంతంగా తీసి చూడగా, అరవింద్ కుర్చీ సహాయంతో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. అరవింద్ ను వెంటనే కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి మృతి చెందాడని ధృవీకరించారు.మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోయినపల్లి ఎస్ఐ రామకాంత్ తెలిపారు.

# సింగరేణి కార్మికులకు హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

### యాజమాన్యం నోటిఫికేషన్ జారీ

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు, రిటైర్డ్ ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందించేందుకు గుర్తింపు సంఘం ఏఐటియుసి చేసిన కృషి మేరకు హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటుకు యాజమాన్యం నోటిఫికేషన్ జారీ చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పేర్కొన్నారు. కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. సూపర్ స్పెషాలిటీ సంస్థలు అందించిన వివరాల మేరకు ఒక ఆసుపత్రిని సెలెక్ట్ చేసి వారితో లీజు ఒప్పందంగాని, కొనుగోలుగాని చేయాలని యాజమాన్యం సంకల్పించిందని అన్నారు. దీనివల్ల సింగరేణి కార్మికులకు వారి కుటుంబాలకు, రిటైర్డ్ కార్మికులకు,అసంఘటిత కార్మికులకు త్వరలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందనున్నాయని పేర్కొన్నారు. స్పందించి నోటిఫికేషన్ జారీ చేసిన యాజమాన్యంకు కార్మికుల పక్షాన గుర్తింపు సంఘం ఏఐటియుసి అభినందనలు తెలుపుతుందని ఆయన అన్నారు.

# యూరియాపై ప్రభుత్వ తీరు అనుమానాస్పదం

### ప్రజల్లో కాంగ్రెస్ పట్ల పూర్తి వ్యతిరేకత
### మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు



**నిజామాబాద్, సెప్టెంబర్6 (జనంసాక్షి) :** యూరియా సంక్షోభంపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు దారితీస్తోందని మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. పంటల కొనుగోళ్లకు, ఆ తర్వాత వాటికి ఇవ్వాల్సిన బోనస్‌ను ఎగగొట్టాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే యూరియా సరఫరా చేయడం లేదని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. వ్యవసాయ రంగం, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంత దుర్మార్గమైన ఆలోచన ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం 21 నెలల్లోనే ప్రజల నుంచి సంపూర్ణ వ్యతిరేకతను మూటగట్టుకుందని ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. హామీల వైఫల్యం, నమ్మకద్రోహం ఒక కారణం అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల తీరు, వ్యవహార శైలి మరో ప్రధాన కారణమని పేర్కొన్నారు. సిఎం రేవంత్ రెడ్డి పరిపాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిక్షణం కెసిఆర్ పేరు తలుచుకుంటూ అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో జరిగిన ఫిరాయింపులపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, త్వరలో రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని వేముల అన్నారు. స్పీకర్ లేదా ఫిరాయింపుదారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా రాబోయే ఆరు నెలల కాలంలో ఉప ఎన్నికలు వస్తాయని ఆయన అన్నారు. ఈ ఎన్నికల్లో బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డి ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. గట్టుదాటిన వారి పదవులు పోయే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బిఆర్ఎస్‌లో ఉన్న ప్రతి కార్యకర్త గర్వంగా చెప్పుకునేలా పరిస్థితి రాబోతోందని అన్నారు. ప్రభుత్వాన్ని నడపడం చేతగాక, గత ప్రభుత్వం అప్పులు చేసిందని కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని వేముల మండిపడ్డారు. గత ప్రభుత్వం కేవలం రూ. 2.80 లక్షల కోట్ల అప్పు మాత్రమే చేసిందని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని తెలిపారు. అయితే, ఈ 21 నెలల కాలంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 2.20 లక్షల కోట్ల పైగా అప్పులు చేసిందని, ఆ అప్పుతో ఏ ఒక్క సంక్షేమ పథకం లేదా అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. గత ప్రభుత్వం సంవత్సరానికి రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తే, ఈ ప్రభుత్వం నెలకు రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తోందని ఆరోపించారు.

# జనగామ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్

### రెండ్రోజులు పలు జిల్లాల్లో వానలు
### వెల్లడించిన వాతావరణ శాఖ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** జనగాం జిల్లాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే ఆదిలాబాద్, హైదరాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నల్గొండ, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం నాడు ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని సూచించింది. మంగళవారం నాడు ఆదిలాబాద్ ,హైదరాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం హెచ్చరించింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# రిచ్‌మండ్ విల్లాలో రూ.2.32 కోట్లు పలికిన గణేశ్ లడ్డూధర



**హైదరాబాద్,సెప్టెంబర్6 (జనంసాక్షి) :** నగర శివార్లలోని రిచ్‌మండ్ విల్లాలో గణనాథుడి లడ్డుకు రికార్డు ధర పలికింది. విల్లా సభ్యులు ఏకంగా రూ.2.32 కోట్లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ గేటెడ్ కమ్యూనిటీలో లడ్డు ధర గతేడాది కన్నా భారీగా పలకడం గమనార్హం. గండిపేట్ మండల పరిధిలోని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని రిచ్‌మండ్ విల్లాస్‌లో ప్రతి యేడాదిలాగే ఈ ఏడాది సైతం గణనాధుని లడ్డు వేలంపాట అందరి దృష్టిని ఆకర్షించింది. గత ఏడాది గణపతి లడ్డు వేలంపాటలో రూ.1.87 కోట్లు- పలికిన విషయం తెలిసిందే. ఈసారి 10 కేజీల గణపతి లడ్డు వేలం పాటలో అత్యధికంగా రూ.2.32 కోట్లు పలికి చరిత్ర సృష్టించింది. వేలం పాటలో కమ్యూనిటీ సభ్యులు ఈ లడ్డును దక్కించుకోవడం మరో విశేషం. వేలం పాట ద్వారా వచ్చే ఈ డబ్బుతో రిచ్‌మండ్ విల్లా ద్వారా ఏర్పాటు-చేసిన ట్రస్టు తరపున ప్రతియేటా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని నిర్వాహకులు తెలిపారు. అనాథ పిల్లలకు, వృద్దులకు చేయూత నిస్తున్నామని తెలిపారు.

# ముగ్గురు మంత్రులున్నా ఇక్కట్లే..


### రైతులకు యూరియా అందించడంలో విఫలం
### మండిపడ్డ మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్



**కరీంనగర్,సెప్టెంబర్6 (జనంసాక్షి) :** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా రైతాంగానికి యూరియాను అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్టార్ హోటల్‌లోనే ఉంటూ కాలం వెళ్లదీస్తున్నారని ఒక ప్రకటనలో మండిపడ్డారు. రైతులు యూరియా కోసం తెల్లవారుజాము నుంచే పడిగాపులు కాస్తు , సహనం నశించి ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలను ఒప్పించి ఉమ్మడిజిల్లాకు సరిపోయే రీతిలో యూరియాను తెప్పించడంలో జిల్లా మంత్రులు ఫెయిల్ అయ్యారని విమర్శించారు. మంత్రులు జిల్లాను వదిలి హైదరాబాద్ హోటల్‌లో సమావేశాలకే పరిమితమవుతున్నారని ఆరోపించారు. యూరియాను అడిగితే కేంద్రం ప్రభుత్వం ఇవ్వడం లేదని మంత్రులు విఫల సమాధానం చెబుతున్నారని వెల్లడించారు. నెల రోజులుగా రైతులు సాగు పనులు వదిలి, కోడికూయక ముందే సహకార సంఘాల వద్దకు చేరుకొని క్యూ కడుతున్నారు. అయినా దొరకక తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు. సమైక్య రాష్ట్రంలో మాదిరిగానే చెప్పులను లైన్‌లో పెట్టి గంటల తరబడి నిరీక్షిస్తున్నారని మాజీ మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా కొరతకు పరిష్కరించాలన్న సోయి పాలకులకు లేకుండా పోయిందని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో యూరియా కొరతను తీర్చడానికి మంత్రులు చర్యలు తీసుకోవాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు.

# వృద్ధ మహిళలే టార్గెట్‌గా చైన్‌స్నాచింగ్

### ఐదుచోట్ల 14 తులాల బంగారం చోరీ
### హుజురాబాద్ ఏసిపి మాధవి



**వీణవంక, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** వీణవంక జల్సాలకు అలవాటుపడి కుటుంబానికి పోషించే స్థోమత లేక వీణవంక మండలానికి చెందిన ఓ వ్యక్తి 60 ఏళ్ళు దాటిన వృద్ధ మహిళలనే టార్గెట్ చేస్తూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. గ్రామంలో దొంగతనానికి ముందు రెండు మూడుసార్లు అటు ఇటు తిర్కుంటూ రెక్కీ నిర్వహించి వృద్ధ మహిళల మెడలోని బంగారం చోరీకి పాల్పడ్డాడు. వాటిని బంగారంపైన రుణమిచ్చే ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో జల్సాలు చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. ఆరు నెలల వ్యవధిలో ఐదుచోట్ల దొంగతనాలకు పాల్పడి 14 తులాల బంగారాన్ని దొంగతనం చేసి ఎత్తుకెళ్ళాడు. రెండురోజుల నుండి నిర్విరామంగా శ్రమించి సెల్ఫోన్ సిగ్నల్స్ ద్వారా నిందితున్ని చల్లూరు శివారులో పట్టుకొని 11 తులాల బంగారాన్ని రికవరీ చేశారు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన కొలిపాక రవి (38) ఇటీవల కుటుంబ పోషణ భారమై, పేకాట ఆడుతూ జల్సాలకు అలవాటు పడ్డాడు. డబ్బుల కోసం 60 ఏళ్ళుదాటిన వృద్ధ మహిళలను టార్గెట్‌గా ఎంచుకున్నాడు. వారి మెడలోని బంగారు తాడ్లను దొంగలిస్తూ దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ సంవత్సరం మార్చి నెల నుండి వరుసగా మండలంలోని చల్లూరు, మామిడాలపల్లి, దేశాయిపల్లి, మానకొండూరు మండలంలోని అన్నారం, జమ్మికుంట మండలంలోని కొత్తపల్లిలో ఐదు చోట్లచైన్ స్నాచింగ్లకు పాల్పడి ఏకంగా 14 తులాల బంగారాన్ని దొంగతనం చేసి ఎత్తుకెళ్ళాడు. వీటిలో కొంత బంగారాన్ని సుల్తానాబాద్‌లోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రుణం డబ్బులు తీసుకోగా.. కొంత బంగారాన్ని మహారాష్ట్రకు తీసుకువెళ్ళి కరిగించుకొని డబ్బులు తెచ్చుకున్నాడు. పోలీసులకు అందిన సమాచారం మేరకు జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఆవుల తిరుపతి, పోలీసు సిబ్బంది రెండు రోజులు నిర్విరామంగా శ్రమించి నిందితుడి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా శనివారం మండలంలోని చల్లూరు శివారులో పట్టుకున్నారు.





నిందితుడి దగ్గర నుండి 11తులాల బంగారం రికవరీ చేసుకున్నట్టు, మరో చైన్ సుల్తానాబాద్‌లోని ముత్తూట్ ఫినాకార్ప్‌లో బంగారంపై రుణం తీసుకున్నట్టు ఏసీపీ మాధవి తెలిపారు. చైన్‌స్నాచింగ్ కేసు చేధనకు కృషి చేసిన జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఆవుల తిరుపతిలను అభినందించి, అనంతరం వీణవంక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మోహన్, కానిస్టేబుళ్ళు కోమల్, ప్రశాంత్, రమేష్, మహేశ్‌లకు నగదు రివార్డులు హుజూరాబాద్ ఏసిపి మాధవి, జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఆవుల తిరుపతిలు రివార్డులు అందజేసి సిబ్బందికి అభినందించి వారి సేవలను కొనియాడారు.

# సుడాన్‌పై ప్రపంచం
## నిద్ర నటించడం ఆపాలి



సుడాన్‌లోని పశ్చిమ డార్ఫూర్ ప్రాంతంలో జరిగిన కొండచరియల విషాదం ఒక ప్రకృతి వైపరీత్యం కాదు. అది మానవత్వంపై పడిన ఒక గట్టి దెబ్బ. తారసిన్ గ్రామం మొత్తం భూమిలో కలిసిపోయి, వేల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ విషాదం కేవలం భారీ వర్షాల వల్ల జరిగిందని మనం నమ్మితే అది మన అమాయకత్వమే. ఈ ఘోరం వెనుక రెండేళ్లుగా రగులుతున్న అంతర్యుద్ధం, ప్రపంచ దేశాల నిర్లక్ష్యం ఉన్నాయి. ఈ భయంకరమైన విషాదం చూసైనా ప్రపంచం కళ్ళు తెరవాలి. లేకపోతే ఈ విధ్వంసం ఇంకా పెద్దదిగా మారుతుంది.

**అంతర్యుద్ధం- విలవిలలాడుతున్న కథ:**

సుడాన్‌లోని సైనిక బలగాలు, పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ మధ్య జరుగుతున్న యుద్ధం ఆ దేశాన్ని ముక్కలు చేసింది. ఈ యుద్ధం అధికార దాహం, ఆర్థిక ఆధిపత్యం కోసం నాయకుల మధ్య సాగుతున్న ఓ అగ్నిపరీక్ష. ఈ యుద్ధంలో లక్షలాది మంది ప్రజలు సర్వం కోల్పోయి వీధిన పడ్డారు. ప్రాణాలు దక్కించుకోవడానికి పర్వత ప్రాంతాలకు పారిపోయిన వేలాది మందికి, పర్వతాలు ఆశ్రయం ఇవ్వడానికి బదులుగా మరణాన్ని ఇచ్చాయి. బాంబులు, తూటాలకు భయపడి కొండల మీద తలదాచుకున్న వీరికి, ఆ కొండలే యమదూతలుగా మారాయి. యుద్ధం ప్రజలను బతికే అవకాశం ఇవ్వకుండా, మరణం వైపు నెట్టివేసిందని ఈ సంఘటన తేటతెల్లం చేసింది. ఇది కేవలం ఒక వార్త కాదు ఇది మానవత్వం మర్చిపోయిన ఒక జాతి యొక్క కన్నీటి గాథ. ఈ విషాదం వెనుక దశాబ్దాల చరిత్ర ఉంది. డార్ఫూర్ ప్రాంతం సుడాన్‌లోని ఇతర ప్రాంతాల కంటే ఎక్కువగా నిర్లక్ష్యానికి గురైంది. ఇక్కడి ప్రజలు తరతరాలుగా నీరు, భూమి కోసం పోరాటాలు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇక్కడి తిరుగుబాటు గ్రూపులు ఆయుధాలు పట్టుకోవడానికి ఇదే ప్రధాన కారణం. 2003లో జరిగిన డార్ఫూర్ యుద్ధంలో లక్షలాది మంది ప్రజలు చనిపోయారు. దాని తర్వాత కూడా పూర్తి శాంతి నెలకొనలేదు. ఇప్పుడు జరుగుతున్న తాజా యుద్ధం పాత గాయాలపై మళ్ళీ ఉప్పు చల్లినట్లుగా ఉంది. ప్రజల బాధలు, వేదనలు, కష్టాలు వర్ణనాతీతం.

**రాజకీయాల వైఫల్యం -చేతకాని పాలన:**

ఈ విషాదం జరిగినప్పుడు సుడాన్‌లోని నాయకుల స్పందన చూస్తే ఛీ అనిపిస్తుంది. ప్రజల బాధను పట్టించుకోకుండా వారు తమ అధికారం కోసం కొట్టుకుంటూనే ఉన్నారు. సహాయక బృందాలు బాధితుల వద్దకు చేరుకోవడానికి ప్రయత్నించినప్పుడు, యుద్ధం వల్ల రోడ్లన్నీ మూసుకుపోయాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడటానికి ఉన్న తొలి కొన్ని గంటలు ఈ నాయకుల చేతకానితనం వల్ల వృథా అయ్యాయి. ఈ సంఘటన, సుడాన్‌లోని సైనిక నాయకులకు ప్రజల ప్రాణాల కంటే అధికారం మాత్రమే ముఖ్యమని రుజువు చేసింది. ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వమే పౌరులను గాలికి వదిలేసింది.

**ప్రపంచం ఎందుకు ప్రేక్షక పాత్ర పోషిస్తోంది?**

సుడాన్‌లో జరుగుతున్న ఈ దుర్ఘటనపై ప్రపంచ సమాజం స్పందించిన తీరు మనల్ని ఆలోచింపజేస్తుంది. ఉక్రెయిన్ - రష్యా యుద్ధం, ఇజ్రాయెల్ - పాలస్తీనా సంఘర్షణపై ప్రపంచ దేశాలు చూపించినంత ఆసక్తిని సుడాన్‌పై చూపించడం లేదు. దీని వెనుక ప్రధాన కారణం ఆర్థిక ప్రయోజనాలు లేకపోవడం. సుడాన్‌లో బంగారం, చమురు, ఇతర విలువైన ఖనిజాలు ఉన్నప్పటికీ, ఈ సంఘర్షణలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటే ఎదురయ్యే ఆర్థిక, రాజకీయ సమస్యల వల్ల ప్రపంచ దేశాలు దూరంగా ఉంటున్నాయి. వార్తా సంస్థలు కూడా దీనిపై పెద్దగా దృష్టి సారించలేదు. ఈ నిర్లక్ష్యం, సుడాన్ ప్రజల బాధలు, వేదనను ప్రపంచ దృష్టికి రానీయకుండా చేసింది. సుడాన్ ప్రజలు ఒంటరిగా ఈ భయంకరమైన పోరాటంలో ఉన్నారని ఈ మౌనం స్పష్టం చేస్తుంది.

**బాధిత ప్రజల ఆర్తనాదం:**


ఈ విషాదంలో ప్రాణాలు కోల్పోయిన వేలాది మంది ప్రజల కథలను మనం వినలేకపోతున్నాం. బతికి బయటపడినవారి ఆర్తనాదాలు కూడా ఎవరి చెవికీ వినిపించడం లేదు. ఒక చిన్నారి తన తల్లిదండ్రులను కోల్పోయి ఏడుస్తున్న దృశ్యం, ఒక వృద్ధుడు తన ఇల్లు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో నిలబడి ఉన్న చిత్రం. ఇవన్నీ కేవలం కథనాలు కాదు, అవి ఈ యుద్ధం సృష్టించిన నిజమైన విషాదాలు. ఆ గ్రామంలో మిగిలి ఉన్న కొన్ని శిథిలాలు, కూలిన ఇళ్లు, అక్కడక్కడా కనిపిస్తున్న వస్తువులు ఆ ప్రాంత ప్రజల జీవితాలు ఎంత దయనీయంగా ఉన్నాయో చెబుతున్నాయి. సహాయం కోసం వారు ఎదురుచూస్తున్న కళ్ళు, మనల్ని ప్రశ్నిస్తున్నట్లుగా ఉన్నాయి.

**శాశ్వత శాంతి ఒక్కటే మార్గం:**

ఈ విపత్తుకు పరిష్కారం కేవలం బాధితులకు ఆర్థిక సహాయం ఇవ్వడం మాత్రమే కాదు. అంతర్జాతీయ సమాజం తక్షణమే మానవతా సహాయాన్ని అందించాలి. కానీ అంతకంటే ముఖ్యంగా ఈ సంక్షోభానికి ప్రధాన కారణమైన అంతర్యుద్ధాన్ని ముగించడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలి. ఐక్యరాజ్యసమితి, ఆఫ్రికన్ యూనియన్ వంటి అంతర్జాతీయ సంస్థలు తక్షణమే శాంతి చర్చలు ప్రారంభించి, పోరాట వర్గాలపై ఒత్తిడి తీసుకురావాలి. కొత్తగా ఒక నిజమైన పౌర ప్రభుత్వం ఏర్పడినప్పుడే, సుడాన్ తన పౌరుల భద్రతను తిరిగి నిర్మించగలదు. అప్పుడే విపత్తు నిర్వహణ, పునరావాస కార్యక్రమాలను సమర్థవంతంగా చేపట్టగలరు. రాజకీయ సుస్థిరత లేకపోతే సుడాన్ ప్రజలు ఇలాగే ప్రకృతి, మానవ నిర్మిత విపత్తుల వల్ల నిరంతరం ప్రాణాలు కోల్పోతూనే ఉంటారు. ఈ విషాదం నుండి ప్రపంచం పాఠాలు నేర్చుకొని, సుడాన్‌లో శాంతి స్థాపనకు కృషి చేయాలి. లేకపోతే, తమ పౌరుల భద్రత కంటే అధికారం ముఖ్యమని భావించే నాయకుల చేతుల్లో ఆ దేశం నిరంతరం నాశనమవుతూనే ఉంటుంది.

జె యం ఆర్ దుంగ
8247045230

# తెలుగెక్కడుందిరా తెలుగోడా!



తెలుగు భాష ద్రావిడ మూలాలను కలిగి ఉన్నప్పటికినీ సంస్కృత ప్రభావం గణనీయంగా ఉంది . డెబ్భై ఐదు శాతం సంస్కృత మూలాలు పదాలతో తెలుగు జీవనం సాగిస్తుంది .నిజానికి తూర్పు చాళుక్యుల కాలం లో తెలుగు ప్రాచుర్యం పొందింది. సంస్కృత ప్రాకృత భాషా సాహిత్యాల ముందు తెలుగు వెల వెల బోయింది అనడంలో అతిశయోక్తి లేదు. తెలుగు వ్యాకరణ పై సంస్కృత ప్రభావం ఉంది. ఏ దేశానికి చెందినదో.. ఎక్కడో పుట్టిందో.. ఈ సంస్కృత పద జాలమును నెత్తిన పెట్టుకొని మోస్తున్నాం. ఇది మన తెలుగు వెలుగు అని గొప్పగా చెప్పు కొంటున్నాము. 56 అక్షరాల కు బదులు 52 అక్షరాలకు కుదించారు ఎందుకో.. తెలుగు భాషా దినోత్సవాలు జరుపు కొంటూ గొప్ప ఉపన్యాసాలు దంచి కొడుతున్న పాలకులకు పాఠశాలల్లో ప్రాథమిక విద్యాభ్యాసం తెలుగులో ప్రవేశ పెట్టాలన్న సోయి లేదా ? ఇంతకు పిల్లలకు బాలశిక్ష పుస్తకం తెలుసా ? తెలుగు పదాలు నీతి కథలు ,చెప్పే వారున్నారా ? .కాన రాని తెలుగు. జాడ లేని వెలుగు. విద్యా సంస్థలలో సంస్కృతం తీసివేసి తెలుగు సబ్జెక్ట్ తప్పని సరిగా పెట్టాలి. లేని యెడల తెలుగు మరుగున పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బడులకు భవనాలు లేక మౌలిక వసతులు కరువై తెలుగు తల్లిని ఏడిపిస్తున్నారు. తెలుగు సొబగులు గ్రంథాలయాల ద్వారా ఊరికి ఒక్కటైనా ఉండాలి. పట్టణాలలో ప్రతి బస్తీకి పుస్తక భాండాగారాలు దేవాలయాలుగా ప్రత్యక్షం కావాలి. అలా కాని యెడల సంబంధిత గ్రంథాలయాల అధికారు లు ఎందుకు? “ఆకార పుష్టి నైవేద్య నష్టి” అన్నట్లే కదా! సంస్కృతి పేర బోనాల పండుగకు ప్రార్థనామందిరాలకు కోట్లు ఖర్చు పెడుతున్నారే.. కుంభ మేళాలకు ధార పోస్తున్నారే ! విజ్ఞాన కాంతులు వెదజల్లే పుస్తకాలకు పత్రికలకు నిధులు ఎందుకు కేటాయించడం లేదు? ప్రశ్నించకుండా ఉంటే స్వాతంత్ర్యం వచ్చిందా? మౌనముగా రాజ్యమేలుతే ఉద్యమాలు చెలరేగేనా ? తెలుగు బతికి బట్ట కట్టాలంటే పాలనా వ్యవస్థను నిలదీ యాలి. పార్టీల కతీతంగా అందరూ ఒక్కటై పోరాటం చేయాలి. సాహిత్య పరిషత్తులు, అకాడమీలు తల్లి భాషకు చేసిన సేవలు ఏమి? వారు సాధించిన ప్రగతి ఏమి? నిధులు లేక అల్లాడుతున్నారా? పరిరక్షణ లేదు గ్రంథాల ముద్రణలు ఎక్కడా? ఈ అధికారుల కన్న సి .పి బ్రౌన్ ఆంగ్లేయు డు ఎంతో మిన్న .ఆయన ఆయన రూపొందించిన తెలుగు నిఘంటువు ఇప్పటికీ ప్రామాణిక గ్రంథంగా ఉంది కొనియాడదగినవి రచన కు ప్రోత్సహించేది ప్రభుత్వేతర సాహితీ సంస్థలు మాత్రమే అకాడమీ పరిషత్తు. సాహితీ వేత్తలు నిర్వహించిన కార్యక్రమాలకు గెస్ట్‌గా వచ్చి సన్మానాలు అందుకొని అర చేతిలో స్వర్గం చూపి వెళ్ళిపోతున్నారు తెలుగుకు పట్టాభిషేకం చేసింది ఎక్కడా? అందుకే తెలుగెక్క డుందిరా తెలుగోడా! అని కవులు రచయితలు వేదిక పై గొంతెత్తి కవితాగానం చేస్తున్నారు తెలుగు ఉనికి కొరకు తెగ ఆరాటపడుతున్నారు .నిజానికి సినీ కవులు సముద్రాల రాఘవాచార్య, ఆత్రేయ, కోసరాజు ,పింగళి,సి .నా.రే, వేటూరి మొదలైన వారు పాటలు రాసి తెలుగును ఇంటింటా సుసంపన్నం చేశారు ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేశారు వారి పద ప్రయోగాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. దిన పత్రికలు తెలుగు అక్షరాలను ఇంటింటి దీపాలుగా వెలిగిస్తున్నాయి. ఈ మధ్యనే సంచలనం సృష్టించుతున్న శ్రీ శ్రీ కళావేదిక ఖండాంతరాలు దాటింది. శ్రీ శ్రీ పేరు తెలియని దేశాలకు కూడా చొచ్చుకొని పోయినా శ్రీ శ్రీ అభ్యుదయ భావాలు మాత్రం కవులలో మచ్చుకైనా కాన రావు “సొమ్ము ఒకరిది సోకు మరొకరిది “ అన్న చందంగా నడుస్తున్నాయి .కవిత్వాలు కామెంట్ చేయమంటున్నారు , అనుభవం లేని వారు న్యాయనిర్ణేతలు గా ఉన్నారు తమ పిల్లలకు తెలుగు భాష రాయడం చదవడం తెలియదని తల్లిదండ్రులు గొప్పగా చెబుతుంటే వారికి నోబుల్ ప్రైజ్ తీసుకున్నంత గౌరవంగా గర్వంగా ఉంటుంది కాబోలు. తెలుగును హీనంగా చేసి మాట్లాడే వారు ఉన్నంత కాలం తెలుగు ఉనికి ఉంటుందా? తెలుగు ఔన్నత్యం చాటే సాహితీ వేత్తలు తమ పిల్లలకు తెలుగును నూరి పోస్తున్నారా? మన జాతీయ మువ్వన్నెల జెండా కు రూపకల్పన చేసిప్రాణం పోసింది పింగళి వెంకయ్య తెలుగు వాడు అన్న సంగతి మన పిల్లలకు కాని పెద్ద వారికి గాని తెలుసా ? సందేహమే మరి. మాతృభాష రక్షణకు ప్రభుత్వాలు కంకణం కట్టుకోవాలి.తెలుగు సాహిత్యం ఖండాంతరాలు దాటాలి అంటే ఆంగ్లం లోకి అనువదించాలి. విశ్వకవి రవీంద్రుని గీతాంజలి బెంగాలీ నుండి ఆంగ్ల భాషకు అనువదించ కుండా ఉంటే ప్రపంచానికి ఆయన ప్రతిభ తెలిసేనా? నోబుల్ బహుమతి వరించేనా?. తెలుగు భాష గ్రంథాలు అన్ని భాషలలోకి అనువాదం చేయడానికి తెలుగు ప్రభుత్వాలు కృషి చేయాలి . అన్ని మతాల వారికి తెలుగు మాధుర్యం అర్థం కావాలి. “”ప్రపంచ భాష లందు తెలుగు లెస్స”” అనాలి పిల్లలు శారీరకంగా ఎదగడానికి తల్లి పాలు ఎంత అవసరమో మానసిక ఎదుగుదలకు అమ్మ భాష కూడా అంతే అవసరం అని గమనించాలి . ఆంగ్ల భాష మోజులో పడి తల్లి భాషను మరచిపోతే కన్న బిడ్డలను మరచినట్లే అవుతుంది .తెలుగు లో సామెతలను పదాలను ,మాండలికాలను బతికించుకోవాలి “”. తెలుగు భాష ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్” గా ప్రసిద్ధి చెందినది. ఆంగ్ల సాహిత్యం పఠనం తెలుగు కవులు రచయితలకు కొత్త ఆలోచనలకు దారి తీసింది .మాతృభాష పటిష్ఠంగా ఉన్నప్పుడే పరాయి భాష హృదయానికి తాకుతుంది. ప్రపంచ తెలుగు మహాసభలలో తెలుగు జెండాను ఆకాశం నిండా ఎగుర వేసినా శతాబ్దాలు గడిచినా తెలుగు వారి ఇంటింటా తెలుగు తేనెయ పలుకు లేదే! మమ్మీ డాడీ పిలుపు మధురమాయే! మన తేట తేట తెలుగు తెల్లవారి వెలుగు లా తెల్ల వారిందా? తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు ఉన్న ప్రాంతీయ భాషాభిమానం మన తెలుగు వారిలో కూడా త్రికరణ శుద్ధిగా ఉండాలి కదా! మన భాషను మనం బతికించుకుందాం.మాతృమూర్తి ఋణం తీర్చుకొనుటకు నడుం బిగిద్దాం.

పూసాల సత్యనారాయణ
సామాజిక విశ్లేషకుడు
9000792400

## ఆకలిజీవి!

ఆకలి తీర్చుకోటానికి
సృష్టిలోఅన్నిజీవులూ
ఎంతకైనా తెగిస్తాయి!

ఒక్క మనిషిమాత్రమే
ఆకలితో అలమటించి
అణగారే ఆకలిజీవి!

పైగా ఏజీవులకు లేని
నీతి న్యాయం చట్టం
వీడికిమాత్రమే సొంతం!

ఇది విచిత్రంగా లేదూ!
ప్రణాళికలు ఎందుకు?
కనీసం ఆకలి తీర్చలేవా?

ఆకలి చెయ్యని నేరంలేదు
నేరాలకు పరోక్ష కారణం?
ఎవరు? ఎవరు? ఎవరు?

(ఆకలిసూచిలో నెం. 1 స్థానం భారత్.. ఆకలిలో కూడా)

తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## ద్విపదస్మృతి

లోకం రొక్కం వైపు పరుగులు
అవివేకరాజ్యం దోపిడి వైపు పరుగులు
పూల పరిమళాలు కాగితం పూల వాసన
అబద్ధాల పత్రికల వ్యంగ్య వాగ్విలాసం
కులవర్గాల పోరు కను మరుగు
మతాలజెండాల రెపరెపల హెూరు
సొంతింటి కల కడలి తరంగం
తిండిగింజలధర గుంటూరు మిర్చిగాటు
రూపాయి పాపాయి డాలరు దేవత
ఎదుగు దల లేని తగ్గుదలరాత
మేడిపండులా మెరిసే తారు రోడ్లు
కుదుపు కుదుపుకు అమ్మా అమ్మా
ఆస్పత్రి కానే కాలేదు కదా జనం ఛత్రి
మందు మాకులకు పెరిగేది అప్పు పత్రం
మార్పు వస్తుందని ఎనలేని ఆశ
ఉంటుంది అందాక జనం శ్వాస.

రేడియమ్
ఫోన్: 9291527757

## హాజరవుతూనే ఉన్నాం

తన అంగి ముడతలుపడ్డ ఆ జేబుకు
“కలం”..లేనిదే కడప దాటని మొండితనం మా
గురువుది...
తన కడుపున పుట్టినోళ్ళ కంటే తనెక్కువ సార్లు
చంకనేస్కొని తిరిగింది ఆ పుస్తకాలనే..
వయసు మీదపడ్డ తనకు బాగా
యాదికున్న తొవ్వ మా బడిదే....
ఎన్ని జాగలు సంపాదించిన ఆ చెక్క కుర్చీల
కూకుంటనే తను శ్రీమంతుడు...
మసకబారిన కండ్లతో చీకట్లో కూడా
తను మాత్రమే చూడగలిగేది ఆ నల్లబల్లను...
అరవైలో కూడా తన కాళ్ళకి
బలాన్నిచ్చి ఉర్కిచ్చేది ఆ బడి గంట సప్పుడే....
తనకెంత బల్గమున్న అడుగేస్తే
పలకరిచ్చేది ఆ వేల విద్యార్థులే....
పిల్లల అల్లరి లేని నిశ్శబ్దం కూడా
తనకొక చెరసాల లాంటిదే...
తన చేతిలో బెత్తం మా “కాకిరి బికిరి”
రాతను మార్చితే...
మా సార్ బడికి రావద్దని కోరుకున్న
రోజుల నుండి తనని మరిచిపోలేని
రోజులుగా మారాయి...
తన రూపాన్ని మేము అక్షరాలతో చెక్కుకుంటే...
మా స్థాయిని తను ఆకాశంలో చూసుకుంటాడు...
తన పాఠమెప్పుడు సంపాదన గురించి
చెప్పలేదు....
సంస్కారాన్ని మాత్రమే నేర్పించింది...
మార్చులేయలేని బంధం మా గురుశిష్యులది.....
అదెప్పుడు హాజరవుతూనే ఉంటది..
ఒకసారి కలలో...
ఇంకోసారి కన్నీళ్లలో..
మరోసారి మాటల్లో...
ఎప్పటికి జ్ఞాపకాల్లో....
తరగతి గది దాటితే తనెంత
ఒంటరో ఆ నాలుగ్గోడలకే తెలుసు..
ఆ ఒంటరి మనసుకి ఔషధమే తన విద్యార్థులు....
పాఠాలు చెప్పిన గురువులను పలకరిస్తూ ఉంటే
అది మన పిల్లలకి మనం నేర్పుతున్న ఒక
పాఠమవుతుంది....
వాళ్ళేక్కడున్న సరస్వతి పుత్రులే....
మేమెక్కడున్న వారి ప్రియ శిష్యులమే...

- తుమ్మల కల్పన రెడ్డి


# విమల కవిత్వంలో సామాజిక సంస్కరణ
## దిగుడు బావి నుంచి సాంస్కృతిక విప్లవం వైపు

సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ కవయిత్రి వై. విమల నాలుగు దశాబ్దాలుగా తన కవిత్వంలో ప్రత్యేక శైలిని ప్రదర్శిస్తున్నారు. ఆమె కవిత్వంలో కథా కథనం, దృశ్యీకరణ (విజువలైజేషన్) స్పష్టంగా కనిపిస్తాయి. భావానికి పదచిత్రాలు, తాత్విక భావనలకు బదులు జీవిత దృశ్యాల ఆవిష్కరణ ఆమె కవితలు, కథలలో ప్రధానంగా కనిపిస్తుంది. ఇటీవల రాసిన “దిగుడు బావి” కవితలో ఆమె ప్రేమ, పెళ్లిని తిరిగి పైకి రాలేని దిగుడు బావితో పోల్చారు. అయితే, పెళ్లి అనే నిర్మాణం స్థానంలో సామాజిక వ్యవస్థలో మరో స్థిరమైన నిర్మాణ రూపం ఆవిర్భవించలేదు. వేశ్యాగృహాలు, సౌందర్య ఆరాధన, బ్రహ్మచర్యం, సన్యాసం వంటివి దశాబ్దాలు, శతాబ్దాలుగా కొనసాగుతున్నాయి. నేడు మద్యపానం భార్యల జీవితాలను, కుటుంబాలను కల్లోలపరుస్తోంది, కానీ ప్రభుత్వాలు మద్యం ఆదాయంపై ఆధారపడుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? విడాకులు లేదా ఒంటరి మహిళగా జీవించడం వ్యక్తిగత పరిష్కారం కావచ్చు, కానీ సామాజిక స్థాయిలో ఇది పరిష్కారం కాదు. ఒంటరిగా పిల్లలను పెంచడం తల్లులకు భారంగా మారుతుంది. అక్రమ లైంగిక వేధింపులను ఎదుర్కొంటూ ఒంటరి మహిళగా నిలబడడం ఉద్యోగం, భద్రత ఉన్నవారికి కొంతవరకు సాధ్యమైనప్పటికీ, మిగతా వారికి అసాధ్యం. కాబట్టి, మార్చాల్సింది సంస్కృతినే! శంకర్ గుహ నియోగి చత్తీస్‌గఢ్‌లో రెండు దశల్లో సాంస్కృతిక విప్లవం చేపట్టారుమద్య నిషేధం ఒకవైపు, మహిళా చైతన్య సంఘాల ద్వారా పురుషాధిపత్య భావజాలాన్ని మార్చడం మరోవైపు. రాలెగాం సిద్ధిలో అన్నా హజారే కూడా గాంధీ మార్గంలో ఇలాంటి సంస్కరణలు సాధించారని చెబుతారు. వరకట్నం, ఆస్తి హక్కు సమస్యలను మహిళలకు అనుకూలంగా పరిష్కరిస్తే దాంపత్యంలోని చాలా సమస్యలు తగ్గుతాయి. విడాకుల సమాజం, ఒంటరి మహిళల జీవనం సామాజిక స్థాయిలో ఆచరణీయం కాదు, అది కొందరికే పరిమితం. తండ్రిలేని పిల్లల పెంపకం వారిపై అవమానాలు, అభద్రత, ఆర్థిక సమస్యలను తెచ్చిపెడుతుంది. సహజీవన సంస్కృతి పేదవర్గాలు, ఇతర కులాల మహిళలకు సాధ్యం కాదు. సహజీవనంలో పిల్లలను కనకపోవడం ఒక సంస్కృతిగా స్థిరపడుతోంది, కానీ ఇది మరిన్ని సమస్యలకు దారితీస్తోంది. సంబంధాల స్థిరత్వం అనిశ్చితంగా ఉంటుంది. పెళ్లి, దాంపత్య సంస్కృతిని పాఠ్యపుస్తకాల నుంచి సినిమాలు, టీవీ సీరియల్స్ వరకు మహిళానుకూల సాంస్కృతిక విప్లవం ద్వారా మార్చాలి. ఆడపిల్లలతోపాటు మగపిల్లలను కూడా క్రమశిక్షణలో పెంచాలి. మగపిల్లలు మాత్రమే ఉన్న తల్లిదండ్రులు ఒక ఆడపిల్లను దత్తత తీసుకొని కుటుంబంలో భాగం చేయాలి. మద్య నిషేధం, ఉచిత గురుకుల విద్య, ఉచిత వైద్యం, అందరికీ ఉపాధి, కనీస వేతనాల పెంపు, మహిళల పేరిట ఆస్తులు వంటి సంస్కరణలు తప్పనిసరి. ఇవి అమలైతే పెళ్లి, కుటుంబ వ్యవస్థలో అణచివేత, అసమానతలు తగ్గుతాయి. అప్పుడే సామాజిక పరిష్కారం సాధ్యమవుతుంది. విమల ఈ అంశాలపై మరో కవిత రాస్తారని ఆశిస్తున్నాను.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# “న్యాయం” ఆలస్యమైతే.. ప్రజాస్వామ్యాన్ని నిరాకరించినట్లే..



ఢిల్లీ హైకోర్టు ఇటీవల ఉమర్ ఖాలిద్, షార్జీల్ ఇమామ్ అలాగే మరో ఏడుగురికి అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్ (యుఏపిఏ) కింద 2020 ఢిల్లీ అల్లర్ల కుట్ర కేసులో బెయిల్ నిరాకరించిన నిర్ణయం, భారతదేశ జ్యుడీషియల్ వ్యవస్థలో పెరుగుతున్న చీలికలను స్పష్టంగా గుర్తుచేస్తుంది. ఇంకా ట్రయల్ కూడా మొదలుకాకుం డానే ఐదు సంవత్సరాలకు పైగా జైలులో ఉన్న ఈ వ్యక్తులలో చాలామంది సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ (సి.ఏ.ఏ.) వ్యతిరేక శాంతియుత నిరసనలలో ప్రముఖంగా పాల్గొన్న యువ కార్యకర్తలు. వీరు మన న్యాయస్థానం వేగవంతంగా న్యాయం అందించటం కంటే నిందూతుల్ని దీర్ఘకాలం డిటెన్షన్‌కు ప్రాధాన్యత ఇచ్చే వ్యవస్థ ఉన్న పరిస్థితుల్లో లీగల్ చిక్కుల్లో ఇరుకున్నారు. ఇది ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి మాత్రమే ఎదురుదెబ్బ కాదు. ఇది మొత్తం న్యాయ వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపిస్తుంది.అంతిమ తీర్పు కన్నా ఇక్కడ ప్రాసెస్ ద్వారానే శిక్ష ఇవ్వడం జరుగుతుంది.దీనిపై దీర్ఘకాలంగా లీగల్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఏ వ్యక్తి పై నైనా ప్రభుత్వం తలుచుకుంటే తన ప్రత్యర్థులను చాలా తేలికగా యాంటీ-టెర్రరిస్ట్ చట్టాల కింద బుక్ చేసి జేళ్ళలో నిర్బంధించ వచ్చు.నిజమైన సమస్యలను పరిష్కరించడం కంటే విభేదాలను అణచివేయడానికి ఈ చట్టం బహు బాగా ప్రభుత్వానికి ఉపయోగ పడుతుంది.రుజువులు దొరకలేదని ఓ పదేళ్ల తర్వాత కోర్టులు విడు దల అయినా.. ఇన్నాళ్ల నిర్బంధానికి ఎవరూ బాధ్యత వహించరు. ప్రొఫెసర్.సాయిబాబా ఉదంతం తెలిసిందే.

ఈ వివాదానికి కేంద్రంగా ఉన్నది 2020 ఈశాన్య ఢిల్లీ అల్లర్లు, ఇది 53 మంది ప్రాణాలు తీసి, వందల మందిని గాయపరచి, సమాజాలను విడదీసిన దురదృష్టకర సంఘటన. అధికారిక రిపోర్టు లు మరియు స్వతంత్ర దర్యాప్తుల ప్రకారం, ముస్లింలపై అసమాన ప్రభావం పడింది, 40 మంది మరణాలు ఆ సమాజానికి చెందినవి.అందులో హిందువులు 13 మంది మాత్రమే ఉన్నారు. ఈ గణాంకాలే ముస్లిం కార్యకర్తలు కమ్యూనల్ హింసను రెచ్చగొట్టడా నికి పెద్ద కుట్ర రచించారన్న ప్రాసిక్యూషన్ వాదనను బలహీనప రుస్తాయి. తమ సమాజమే అత్యధిక నష్టం భరించేలా కుట్ర రచించడం ఎంత సహేతుకం? సి.ఏ.ఏ.పై పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య ఈ హింస జరిగింది. ఈ చట్టం వివక్షాత్మకమని విమర్శలు చాలా వచ్చాయి. కానీ కేసు దానిని తిరగరాసి, శాంతియుత నిరసనకారులను గందరగోళం చేసే ఆందోళన సృష్టికర్తలుగా చిత్రీకరించింది. మరోకవైపు రెచ్చగొట్టే మాటలు చెప్పిన వారిని మాత్రం విస్మరిస్తుంది.

సాక్ష్యాలను పరిశీలించి చూస్తే, లేదా సాక్ష్యాల లోపాన్ని బట్టి చూస్తే ... కోర్టు 133 పేజీల ఆర్డర్ అస్పష్టమైన ప్రొటెక్టెడ్ విట్నెస్ స్టేట్‌మెంట్లు, పెద్ద గ్రూపుల వాట్సాప్ చాట్లు, అలాగే స్పీచ్‌ల వ్యాఖ్యానాలపై ఆధారపడి ఉంది. వీటి పరిశీలనలో అహింస, గాంధీ, అంబేడ్కర్ వంటి ఐకాన్‌లను సూచిస్తాయి. ఉమర్ ఖాలిద్ మాటలు, ఉదాహరణకు, ఐక్యత మరియు సమాన పౌరసత్వానికి పిలుపునిచ్చాయి. ‘ఆజాదీ’ని విడిపోవడం కాకుండా వివక్ష మరియు ఆకలి నుండి స్వేచ్ఛగా చూపాయి. యు.ఏ.పి.ఏ. జ్యురిస్‌ప్రుడెన్స్‌ను ట్రాక్ చేస్తున్న లీగల్ అనలిస్టులు, ఇలాంటి రీజనింగ్ ‘కుట్ర’ నిర్వచనాన్ని అసంబద్ధ స్థాయికి విస్తరిస్తుందని, ఫ్యాక్ట్స్ కంటే అనుమానాలతో సాక్ష్యాల ఖాళీలను పూరించడం జరుగుతుందని వారు సూచిస్తున్నారు. ఇది ఇతర హై-ప్రొఫైల్ కేసుల్లోని ఆందోళన కర పాటర్న్‌లను ప్రతిబింబిస్తుంది. ఇక్కడ ప్రైమా ఫేసీ గిల్టీ ఆధారంగా బెయిల్ ను నిరాకరిస్తున్నారు. బెయిల్ నార్మ్ మరియు జైలు ఎక్సెప్షన్ అన్న సూత్రాన్ని చాలా తేలికగా తిరగరాస్తున్నారు.

కేసు టైమ్‌లైన్ చూస్తే, వ్యవస్థాగత లోపాలను మరింత బయట పెడుతుంది. హియరింగ్‌లు కావాలనే నెలల తరబడి లాగించ బడ్డాయి. జడ్జిలు ఆర్డర్లను రిజర్వ్ చేసి, ట్రాన్స్‌ఫర్ అయ్యా రు. లేదా కొందరు రిటైర్ అయ్యారు. ఈ లేటెస్ట్ వెర్డిక్ట్ ముందు రెండుసార్లు ఇలాగే జరిగింది. ప్రెసైడింగ్ జడ్జి రిటైర్‌మెంట్‌కు కొన్ని రోజుల ముందు కేసును ఇచ్చారు. మరోవైపు, ట్రయల్ కోర్టు ఇంకా చార్జెస్ ఫ్రేమ్ కూడా చేయలేదు. కనుక, ప్రస్తుత కేసు నడక వేగాన్ని బట్టి చూస్తే మరో దశాబ్దం పట్టవచ్చు. అంత వరకు నిర్బంధం తప్పదు. ఈ విషయాల్లో నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ గణాంకాలు దుర్భర పరిస్థితుల్ని చూపిస్తాయి. ఇప్పటికే భారత దేశ కోర్టుల్లో 4.5 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. యు.ఏ.పి.ఏ. మ్యాటర్స్ సంక్లిష్టత మరియు రాజకీయ సెన్సిటివిటీ కారణంగా తరచూ ఇలాగే లాగించబడుతున్నాయి. దీనికి విరుద్ధంగా, అసంబంధిత కేసుల్లో శిక్ష పడిన వ్యక్తులు, కొన్ని రిలిజియస్ లీడర్లు సీరియస్ చార్జెస్ ఎదుర్కొంటూ కూడా, మల్టిపుల్ పెరోల్స్ పొందిన ఉదాహరణలు అనేకం ఉన్నాయి. ఒక కేసులో ఎనిమిది సంవత్సరాల్లో 14 సార్లు అతనికి పెరోల్స్ దొరికాయి. ఇది ఈక్విటీపై ప్రశ్నలు లేవనెత్తటం లేదా!?

ఈ అసమానత “హేట్ స్పీచ్ “ పారదర్శకతను కూడా విస్తరిస్తుంది. కోర్టు యాంటీ-సి.ఏ.ఏ. స్పీచ్‌లను ‘రెచ్చగొట్టేవి’ అని పేర్కొంటుంది. కానీ రైట్-వింగ్ ఫిగర్ల నుండి డాక్యుమెంటెడ్ ప్రొవకేషన్స్ - ‘ద్రోహులను కాల్చేయండి’ లేదా అల్లర్లను రెచ్చగొట్టండి అన్న బెదిరింపులను విస్మరిస్తుంది. ఈ సంఘటనల వీడియోలు మరియు ట్రాన్స్‌క్రిప్ట్లు ఫ్యాక్ట్-చెకర్ల చేత విస్తృతంగా ప్రచురితమైనవి. ఇలాంటి ఉదంతాలు ఎన్ని ఉన్నా కానీ, చాలా కేసుల్లో ప్రాసిక్యూట్ మాత్రం చేయలేదు. ఇది చట్టాన్ని అమలు పరచడంలో పక్షపాతాన్ని బాహాటంగా చూపిస్తుంది. ఇలాంటి అసంగతులు పబ్లిక్ ట్రస్ట్‌ను క్షీణింపజేస్తాయి. ముఖ్యంగా అమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి ఆర్గనైజేషన్ల డేటా 2019 తర్వాత యు.ఏ.పి.ఏ. అరెస్టులలో పెరుగుదల కనిపిస్తుంది. మైనారిటీలు అలాగే ప్రభుత్వ విమర్శకులను అన్యాయంగా టార్గెట్ చేస్తున్నాయి. 2015 నుండి 2020 వరకు సుమారు 8,000 మందికి పైగా ఇలాగే చార్జ్ చేయబడ్డారు. కన్విక్షన్ రేట్లు 3 శాతం కంటే తక్కువగా ఉంది.

ఈ కేసు తొమ్మిది మంది వ్యక్తుల భవిష్యత్తును మాత్రమే కాకుండా, భారతదేశ ప్రజాస్వామ్య ఆదర్శాల దృఢత్వాన్ని కూడా పరీక్షిస్తుంది. కేవలం అసమ్మతిని లేదా నిరసనను కూడా టెర్రరిజం నేరంతో పాటు కలిపేస్తే, జ్యుడీషియరీ అసమానతలను సవాలు చేసే గొంతులను కూడా అణచివేయడాన్ని లెజిటిమైజ్ చేసే ప్రమాదం కూడా ఉంది. ఎమర్జెన్సీ (అడ్మిరల్టీ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్) జబల్పూర్ రూలింగ్ వంటి చీకటి అధ్యాయాలను ప్రతిధ్వనిస్తుంది. అక్కడ సివిల్ లిబర్టీలు సమూలంగా అతి తేలిగ్గా తోసిపుచ్చబడ్డాయి. ఆరోపణలు సుప్రీం కోర్టుకు అప్పీల్ చేస్తున్నట్లు ... వారి చివరి ఆశ్రయం “ఎక్స్‌పెడియెన్సీ” కంటే సాక్ష్యాలకు ప్రాధాన్యత ఇచ్చే రీఎవాల్యుయేషన్ కోసం ఆశిస్తున్నాం. లేకపోతే, న్యాయం వాగ్దానం దూరమైన ఆదర్శంగా మిగిలిపోతుంది. సమాజాన్ని నేరాలను శిక్షించడం కంటే భావాలను (ఐడియాలను ) ఇంప్రిజన్ చేసే వ్యవస్థతో పోరాడేలా చేస్తుంది. గ్లోబల్ లీడర్‌షిప్‌కు ఆకాంక్షించే దేశంలో, ఇలాంటి లోపాలు న్యాయాన్ని ఆలస్యం చేయడమే కాకుండా నిరాకరిస్తున్నాయి కూడా, మన కోర్టులు స్వేచ్ఛను కాపాడుతాయా లేదా “స్టేటస్ కో” ను (యధాతథంగా) మాత్రమే రక్షిస్తాయా అని సమస్త ప్రజలు సమిష్టి ఆత్మపరిశీలనకు పిలుపునిస్తున్నాయి.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# డ్రగ్స్ కేసులో చర్లపల్లి నవోదయనగర్, నాచారంలో ఇద్దరు నిందితుల అరెస్టు

• 11 కోట్ల 58 లక్షల విలువైన 5 కేజీల ఎండి డ్రగ్స్ స్వాధీనం



**కాప్రా, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసుకు సంభదించి మూలాలు నగరంలో బయటపడాడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని రాంనగరుండుకు చెందిన ఒలేటి శ్రీనివాస్ విజయ్, తనాజీరావులు గతంలో జివికె ల్యాబరేటరీలో వని చేసేవారు. గత నాలుగు సంవత్సరాల క్రితం తెలంగాణలోని హైదరాబాద్లోని చర్లపల్లి పారిశ్రామికవాడకు అనుకుని ఉన్న నవోదయనగర్ షెడ్డును అద్దెకు తీసుకుని, అలాగే నాచారం పారిశ్రామికవాడలో వాక్తేవి ల్యాబరేటరీ పేరుతో ఒపెన్ పరిశ్రమలను నిడిపిస్తున్నాడు. చర్లపల్లి నవోదయనగర్ పరిశ్రమలో గడ్రగ్స్ వినియోగించే రా మెటీరియల్ తయారు చేస్తు నాచారం పారిశ్రామికవాడలోని ల్యాబ్లో డ్రగ్ ఫార్ములను తయారు చేసి ముంబాయితో పాటు ఇతర ప్రాంతాలకు సరఫర చేస్తున్నాడు. ఇటీవల ముంబాయి క్రైమ్ బ్రాంచ్ పోలీసుకలు విదేశాలకు చెందిన మహిళ వద్ద డ్రగ్స్ దొరకడంతో విచారణ చేపట్టిన పోలీసులకు మూలాలు హైదరాబాద్లో ఉన్నట్టు తెలిసింది. గత రెండు రోజులుగా చర్లపల్లి నవోదయనగర్ లో, నాచారం విచారణ చేసిన పోలీసులు ముంబాయి థానేలో 11 మందిని, చర్లపల్లి నవోదయనగర్లో విజయ్ శ్రీనివాస్, నాచారంలో తనాజీరావును అరెస్టు చేశారు. చర్లపల్లి నవోదయ నగర్లో 11 కోట్ల 58 లక్షల విలువైన 5 కేజీల 790 గ్రాముల ఎండి డ్రగ్ స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

# అన్యాయంపై ఎవరు మాట్లాడినా అర్బన్ నక్సలైట్ ముద్ర

• రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** ఈ దేశంలో అన్యాయంపై ఎవరు మాట్లాడిన అర్బన్ నక్సలైట్ అనే ముద్ర వేస్తున్నారని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. నక్సలైట్ గా మారడానికి ఎంతో విశ్వాసం ఎంతో ధైర్యం కావాలన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని పెన్షనర్ భవన్ లో రాజ్యాంగ విలువలు పరిరక్షణ కోసం తెలంగాణ పౌర సమాజం ఆధ్వర్యంలో జర్నలిస్ట్ మిద్దెల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ హరగోపాల్ హాజరై మాట్లాడారు. రాజ్యాంగ విలువలను పరిరక్షించాలంటే జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఉపరాష్ట్రపతిగా ఎన్నుకునేందుకు ఎంపీలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు రాజ్యాంగ విలువలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తుంగలో తొక్కి ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తుందని వాపోయారు కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ప్రజలంతా ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజ్యాంగంపై పూర్తిస్థాయిలో పట్టు ఉన్న జస్టిస్ సుదర్శన్ రెడ్డిని దేశ ఉప రాష్ట్రపతిగా ఎన్నుకుంటేనే రాజ్యాంగాన్ని రక్షించిన వాళ్ళం అవుతామని పేర్కొన్నారు. మనిషికి నైతిక విలువలు అనేవి ఎంతో ముఖ్యమని, ఆ విలువలు లేనప్పుడు మనిషిగా బ్రతకడం కూడా దండుగేనని అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి తన తొలినాళ్ల నుండి ఎంతో విశిష్టతగా పనిచేశారని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని అనేక పర్యాయాలు ఆర్ఎస్ఎస్ తిరస్కరించిందే తప్ప ఏనాడు స్వాగతించలేదని వివరించారు ఆర్ఎస్ఎస్ ఆలోచనా విధానం ఎంతో ప్రమాదకరంగా ఉంటుందని, అలాంటి కోవకు చెందిన వ్యక్తినే కేంద్ర ప్రభుత్వం ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్నికల్లో నిలబెట్టిందని వివరించారు. సమాజానికి పనికిరాని విలువలను, వ్యక్తులను



నియంత్రించేందుకు కృషి చేయాలని సూచించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి నక్సలైట్లకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తప్పుడు ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. సల్వాజుడుంను రద్దు చేస్తూ జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీర్పు ఇస్తే నక్సలైట్లకు మద్దతుగా తీర్పు ఇచ్చారని అసత్య ప్రచారాలకు ఒడిగట్టడం బిజెపి ప్రభుత్వానికి చెల్లిందని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్న అమిత్ షాకు గట్టి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ప్రతి పౌరుడు పై ఉందని అన్నారు. దేశ చరిత్రలో అసమానతలు క్రమంగా పెరుగుతున్నాయని ఇందుకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. దేశంలో నిరుద్యోగం అసమానతలు బిజెపి ప్రభుత్వం పెంచుతుందే తప్ప ఎక్కడ తగ్గించడం లేదని పేర్కొన్నారు. అమానవీయంగా దేశం వెళుతున్న క్రమంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి లాంటి వ్యక్తులను ఉపరాష్ట్రపతిగా ఎన్నుకుంటే రాజ్యాంగ విలువలను పరిరక్షించిన వాళ్ళం అవుతామని వివరించారు. అదేవిధంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రాజకీయ ప్రాబల్యం కోసమే హెూం మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎక్కడ ఓడిపోతామని భయంతోనే జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేసేందుకు ఒడిగడుతున్నారని వివరించారు. ఆదివాసి గిరిజనులపై ఇష్ట రాజ్యాంగ దాడులు చేస్తూ నామరూపాలు లేకుండా చేసేందుకు హెూం మంత్రి అమిత్ షా కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమిత్ షా వ్యవహరిస్తున్న నియంతృత్వ పోకడలకు పౌర సమాజం పూర్తిగా వ్యతిరేకిస్తుందని అన్నారు. అవగాహన రాహిత్యంగా అమిత్ షా మాట్లాడటం రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగ సూత్రాలకు కట్టుబడి ఉండాల్సిన కేంద్ర హెూం మంత్రి రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దేశ ప్రధాని ఆదాని, అంబానీ, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పని చేస్తున్నారే తప్ప ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారని వివరించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి జీవితంలో ఉన్నతమైన పదవులు రాజ్యాంగబద్ధంగా పొంది సమాజ శ్రేయస్సుపై ఎంతో అవగాహన కలిగిన వ్యక్తి అని అన్నారు. భారత ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గెలిపించేందుకు ఎంపీలందరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ వనమాల కాంగ్రెస్ పార్టీ ఫరూక్ నగర్ మండల అధ్యక్షులు చల్లా శ్రీకాంత్ రెడ్డి సిపిఐ నాయకులు బుద్ధుల జంగయ్య సిపిఎం నాయకులు ఈశ్వర్ శ్రీనాయక్ టీజీ శ్రీనివాస్, అర్జునప్ప రవీంద్రనాథ్ నర్సింలు గౌడ్ కరుణాకర్, రవి కుమార్ జైపాల్ రెడ్డి ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పవన్ చౌహాన్, వెంకటరమణ, జనార్ధన్, రామారావు నక్క బాలరాజ్, రవీంద్రనాథ్, శ్రీధర్ రెడ్డి సురేష్ తిరుమలయ్య, జైపాల్ రెడ్డి, శివారెడ్డి, రవి, చంద్రరెడ్డి శివా రెడ్డి చంద్రశేఖర్ జనార్దన్ రెడ్డి సురేందర్ రెడ్డి శేఖర్ రెడ్డి చంద్రమోహన్ నరసయ్య సుశీల రంగరాజన్ కుమార్ హున్య నాయక్ శ్యాంసుందర్ మైనారిటీ నేతలు మహమూద్, అబ్దుల్ రహీం, జర్నలిస్టులు భాస్కర్, దన్నారం రమేష్, బూర్గుల ఫణీంద్ర, పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

• నచ్చిన రంగాల్లో నైపుణ్యాని పొందాలి
• తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** మహిళలు తమకు నచ్చిన రంగాల్లో తమ నైపుణ్యాన్ని పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో స్ఫూర్తి గ్రామీణ అభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సీ మహిళకు ఉచిత కుట్టుమిషన్లు, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సభాపతి మహిళను ఉద్దేశించి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత నిమిత్తం వివిధ రంగాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో 35 మంది మహిళలకు 90 రోజుల పాటు కుట్టు మిషన్ లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ లు పంపిణీ చేయడం సంతోషదాయకమన్నారు. కుట్టుమిషన్ల శిక్షణ పొందిన మహిళలు తమ కుటుంబాలకు ఆర్థిక తోడ్పడుకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. కుట్టు మిషన్ లో నైపుణ్య శిక్షణ పొందిన మహిళల ఆర్థిక అభివృద్ధికి వివిధ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యతను ఎస్సీ కార్పొరేషన్ అధికారులు తీసుకోవాలని స్పీకర్



సూచించారు. చదువుతోపాటు మహిళల్లో ఉపాధి కల్పనకు గాను ఉచిత నైపుణ్య శిక్షణలను ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. నైపుణ్య శిక్షణలను సద్వినియోగం చేసుకొని గ్రామీణ ప్రాంత యువతను కూడా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా మరిన్ని ఉచిత శిక్షణ కేంద్రాలను నిర్వహించేందుకు తల వంతు సహకారం అందిస్తానని స్పీకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.సుధీర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, ఆర్టిఏ సభ్యులు జాఫర్, స్ఫూర్తి గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, టెక్నికల్ ట్రైనింగ్ ఇంచార్జ్ ప్రసన్నలు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 16న బైరాన్‌పల్లి అమరవీరుల సంస్మరణ సభ

• సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



**చేర్యాల, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఈనెల 16న బైరాన్ పల్లి బురుజు వద్ద జరిగే అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చేర్యాల సిపిఎం కార్యాలయంలో చేర్యాల ప్రాంత జిల్లా కమిటీ సభ్యుల మండల కార్యదర్శుల సమావేశం కొంగరి వెంకట మావో అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆముదాల మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ.. భూమికోసం, భుక్తి కోసం, దున్నేవాడికె భూమి, వెట్టి చాకిరి విముక్తి జరగాలని నాటి భూస్వాముల, దొరల, జమీందారుల, నైజాం రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా కార్మికులు, కౌలు రైతులు, వృత్తిదారులు ఏకమై తమ హక్కుల సాధన కోసం, నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరుల కు నిలువెత్తు సాక్ష్యం బైరాన్ పల్లి బురుజు ఈ బురుజును కేంద్రంగా చేసుకొని గ్రామ స్వరాజ్యాలు ఏర్పాటు చేసి పోరాడిన వీరుల త్యాగాన్ని స్మరించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడిన కృష్ణారెడ్డి, అత్తిని శారద, తాడూరి ప్రశాంత్, మండల కార్యదర్శిలు బండ కింది అరుణ్ కుమార్, తాడూరి రవీందర్ రాళ్లబండి నాగరాజు, ఎండి షఫీ యుద్దీన్, చేర్యాల టౌన్ కమిటీ సభ్యులు ఇప్పకాయల శోభ, బోయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**తలకొండపల్లి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** సీఎం సహాయనిది నిరుపేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవంచనరసింహారెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని 3 వార్డుకు చెందిన కటిక వెంకటేష్ మాతృమూర్తి పులబాయ్ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది ఉన్నారు. కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన పీఎం సహాయనిది రూ,30 వేల చెక్కును శనివారం తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అవాంఛ నరసింహారెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ అజీమ్, డిసిసి ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, పుట్ట పాండు, మీసేవ



మల్లేష్, బోల యాదగిరి, పోతుగంటి గణేష్, పోసారం గిరేందర్ రెడ్డి, నూకం శేఖర్, పురుషోత్తం, సురేష్, శ్రీశైలం, కుమ్మరి బాలస్వామి, జంగయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 119 మంది పేదలకు రూ.39,79,000 విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. అనారోగ్యం తో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన తాండూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన 119 మంది లబ్ధిదారులకు దాదాపు రూ. 39,79,000/- విలువ గల సీఎంఆర్ ఎఫ్ చెక్కులను మరియు పెద్దేముల్, తాండూరు, బషీరాబాద్ మండలాలకు చెందిన 96 మంది లబ్ధిదారులకు రూ.96,11,136/- విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.



# ఆయిల్‌ఫామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకం

• మెగా ఆయిల్ ఫామ్ ఫౌండేషన్ ప్రారంభం
• పాల్గొన్న రాష్ట్ర ఉద్యాన శాఖ సంచాలకులు
• యాస్మిన్ భాష జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**శివ్వంపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** జిల్లాలో ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ సమృద్ధిగా చేపట్టాలని, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం లభిస్తుందని రాష్ట్ర ఉద్యానవన శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాషా, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శనివారం శివ్వంపేట మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలో మాజీ ఐఏఎస్ అధికారి సింగయపల్లి నర్సింగ్ రావు పొలంలో మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉద్యానవన సంచాలకులు యాస్మిన్ భాషా, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ లు హాజరై మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి రాష్ట్ర ఉద్యాన సంచాలకులు, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులందరూ డిమాండ్ ఉన్న పంటలపై మొగ్గు చూపాలని, అందులో ఆయిల్ పామ్ పంట దేశంలో ఎ పంటకి లేనివిధంగా చట్టం ద్వారా ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. ఆయిల్ పామ్ పంట సాగుకు అనుకూలంగా వుందని ఆయిల్ పామ్ పరిశోదన స్థానం, పెదవేగి శాస్త్రవేత్తలు జిల్లాను సందర్శించి దృవీకరించగా, 2023-24 సంవత్సరం నుండి జిల్లాలో ఆయిల్ పామ్ పంటను ప్రోత్సహించడం జరిగిందన్నారు. ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు మొక్కలపై రాయితితో పాటు నాలుగు సంవత్సరములు తోట నిర్వహణ, అంతర పంటల సాగు



కొరకు రాయితీ సొమ్మును రైతుల ఖాతాకు జమ అవుతాయన్నారు. రైతులకు పంట దిగుబడితో అధిక లాభాలను చేకూర్చే ఆయిల్ ఫామ్ తోటల విస్తీర్ణం పెంచాలని, నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఆయిల్ ఫామ్ తోటల సాగు పై సందేహాలను నివృత్తి పరిచేందుకు రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగుతో రాణిస్తున్న రైతులతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒక రైతుకు గరిష్టంగా 12.50 ఎకరాల వరకు డ్రిప్ పరికరాలపై రాయితీ సదుపాయం ఉంటుందన్నారు .ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగు సంవత్సరముల తరువాత ఎకరానికి 10-12 టన్నుల దిగుబడి వస్తుంది అని అన్నారు. ప్రస్తుతం ఒక్క టన్ను ఆయిల్ పామ్ గెల ధర రూ. 19,108 ఈ లెక్కన సంవత్సరమునకు రూ. 1,50,000 ఆదాయం వస్తుందని తెలిపారు. ఖర్చులు పోను ఒక ఎకరానికి సంవత్సరమునకు రూ. లక్షా 20 వేలు పొందవచ్చునని తెలిపారు. రైతులు తమ ఆయిల్ పామ్ ఉత్పత్తులను ఫ్యాక్టరీ వరకు రవాణా చేసుకొనుటకు అధిక ఛార్జీలు కేటాయించవలసి రావడం వలన కంపనీ వారు రైతులకు ఇబ్బంది కలుగకుండా ప్రతి 15 కిలోమీటర్లకు ఒక కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కంపనీ వారు గెలలను కొనుగోలు చేసిన తరువాత నియమ నిబందనల ప్రకారం 14 రోజులలోపు రైతు ఖాతాకు డబ్బు జమ చేయబడుతుంది అన్నారు. ఒక ఎకరా వరి వేసే నీళ్ళతో 5 ఎకరాల ఆయిల్ పంట పండించవచ్చని, పైగా ఆయిల్ పామ్ పంట దేశంలో ఎ పంటకి లేని విధంగా చట్టం ద్వారా, ఎటువంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా సంబధిత కంపెనీ కొనుగోలు చేస్తారని దొంగల, కోతుల బెడద లేని పంట కాబట్టి రైతులందరూ ముందుకు వచ్చి ఆయిల్ పంట సాగు చేపట్టాలని, మెదక్ జిల్లాలో 2023-24 సంవత్సరంలో 78 మంది రైతులు 336 ఎకరాలలో, 2024-25 సంవత్సరం లో 152 రైతులచే 533 ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేశారన్నారు .ఈ సంవత్సరం అనగా 2025-26 సంవత్సరానికి మెదక్ జిల్లాకు 2500 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటల సాగు చేయుటకు ప్రణాళికా చేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు 2008 ఎకరాలకి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, అందులోనుండి 388 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటలు పెట్టడం జరిగిందన్నారు. ఆయిల్ పామ్ పెట్టిన 5 సంవత్సరాల తర్వాత చాక్లెట్ తయారు చేసే పంట ఐన కోకో పంటను కానీ, నీడని తట్టుకొని పెరిగే పంటల సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చు. అని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్‌ల గృహలబ్ధిదారులకు న్యాయం చేస్తానని మంత్రి పొంగులేటి హామీ

• మంత్రిని కలిసిన సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షులు మోహన్ రావు

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలో గద్వాల పట్టణంలోని గృహలబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుల విన్నపానికి రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించారనీ కె. మోహన్‌రావు అన్నారు. గద్వాల పట్టణంలో ఉన్న గ్రామపంచాయితీ పరిధిలోని సర్వే నంబర్లు 968, 969, 979, 980, 983, 984, 985లో లబ్ధిదారులకు డబుల్‌బెడ్ రూముల ఇళ్ల కేటాయింపులో



ఏర్పడిన సమస్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటుగా మంత్రి వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావులకు విన్నపంను అందజేసినట్లు, 2013లోనే బెనిఫిషియరీల పేర్లతో ఇండ్ల నిర్మాణం ప్రారంభమైన ఇప్పటివరకు పూర్తిగా కేటాయింపులు జరగకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారనీ, ఈ సమస్యపై త్వరలోనే సమగ్రంగా సమీక్షించి, డబుల్ బెడ్‌రూమ్‌ల ఇండ్ల కేటాయింపులో ఏర్పడిన ఇబ్బందులను తొలగించి, అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారనీ, తమ విన్నపంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారనీ సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కె. మోహన్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో పూడూరు అచ్చన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
07 సెప్టెంబర్ 2025

# ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతున్నాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా..ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం
- మంత్రి జూపల్లి కృష్ణారావు





**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** గత పాలకులు 10 సంవత్సరాల్లో 8.19 లక్షల కోట్ల అప్పు భారం చేసి వెళ్లినప్పటికీ ఈ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ ను నెరవేర్చుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, స్థానిక శాసన సభ్యులు తుది మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం పైన ఇన్ని అప్పులు ఉన్నా ప్రతి నెల చేసిన అప్పులకు వడ్డీ చెల్లిస్తూనే అభివృద్ధి, సంక్షేమాన్ని జోడేద్దుల వలె ముందుకు తీసుకువెళుతున్నామని చెప్పారు.ప్రజల దీవెనలతో ఏర్పడిన ఇందిరమ్మ ప్రభుత్వం అసలు ప్రభుత్వం అంటే ఇలా ఉండాలి అని ప్రజల చేత శభాస్ అని మెప్పులు పొందుతున్నారు. అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే సిలిండరు, రూ. 21 వేల కోట్లతో రెండు లక్షల రూపాయల వరకు రైతు రుణ మాఫీ, గత ప్రభుత్వం సంవత్సరానికి ఎకరాకు 10 వేల చొప్పున రైతు భరోసా ఇస్తే ఈ ప్రభుత్వం 12 వేల చొప్పున ఇచ్చిందన్నారు.గత ప్రభుత్వం వారి వేస్తే ఉరి అని అంటే ఈ ప్రభుత్వం రైతును రాజు చేయాలనే ఉద్దేశ్యంతో సన్న రకం వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడం జరిగింది. రాష్ట్రంలో కొత్తగా 7 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు పాత రేషన్ కార్డుల్లో పెళ్ళైన, పుట్టిన వారి పేర్లు కొత్తగా చేర్చడం జరిగిందన్నారు. వనపర్తి జిల్లాలో కలెక్టర్ ఆదర్శ్ సురభి చాలా బాగా పనిచేస్తున్నారని అభినందించారు. బాగా పని చేసే అధికారులను అక్కున చేర్చుకుంటామని, దురుద్దేశ్యపూర్వకంగా పనిచేసే అధికారులను చట్ట పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలోని రైతులకు భూ భారతి చట్టం ద్వారా తమ భూములకు భరోసా కల్పించామని తెలియజేశారు. రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత పాలకుల ముందు ప్రభుత్వాలు నడిపిన పాలకులు 70 వేల కోట్ల రుణాలు చేస్తే గత పాలకులు 10 సంవత్సరాల్లో 8 లక్షల కోట్ల అప్పులు ప్రజల నెత్తిన పెట్టిపోయారన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని ప్రజలకు మాట ఇచ్చి వందకు ఒకరిద్దరి మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్ర పశుసంవర్ధక డైరీ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క నిరుపేద కుటుంబం స్వంత ఇల్లు లేదు అని బాధపడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామనీ చెప్పారు. రాష్ట్రంలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని ఇందుకోసం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5.00 లక్షల చొప్పున రూ. 22,500 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎన్నికల సందర్భంగా వనపర్తి నియోజక వర్గంలో తూడి మేఘా రెడ్డిని గెలిపిస్తే వనపర్తి నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటా అని మాట ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం నియోజక అభివృద్ధి కొరకు ఇప్పటికే రూ. 1000 కోట్లు ఒకసారి మరోసారి 280 కోట్లు మంజూరు చేయగా పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. మంగంపల్లిలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారులకు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం తరపున లబ్ధిదారులకు బట్టలు పెట్టగా స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి వ్యక్తిగతంగా లబ్ధిదారులకు బట్టలు పెట్టారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, మార్కెట్ కమిటి చైర్మన్ పి. శ్రీనివాస్ గౌడ్, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నర్వ అభివృద్ధికి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ఇవ్వండి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** నర్వ మండల అభివృద్ధి కోసం అధికారులు కేవలం ఆలోచనలకే పరిమి తం కాకుండా, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ రూపంలో ప్రతిపా దనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టర్ చాంబర్లో నిర్వహించిన సమీక్షా సమా వేశంలో ఆస్పిరేషన్ నర్వ బ్లాక్ కింద చేపట్టాల్సిన ఉత్త మ పద్ధతులు, వినూత్న ప్రాజె క్టులు, కొత్త ఆలోచనలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో నర్వ మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొ న్నారు.కీలక పనితీరు సూచికలు సాధించడానికి ప్రతి శాఖ తమవంతుగా చురుకైన చర్యలు తీసుకోవా లని కలెక్టర్ సూచించారు. రైతుల ఆదాయం పెంచే ప్రాజె క్టులు, స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనో పాధి కల్పించే కార్యక్రమాలు, నీటి సంరక్షణ చర్యలు, పాడి ప్రాజెక్టులు వంటి అంశాలపై అధికారులు విస్తృతమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని ఆమె ఆదే శించారు.ఇక విద్య, వైద్య, పశు సంవర్ధక , వ్యవసాయ శాఖల అధికారులు తమ శాఖల్లో అత్యవసరమైన, ప్రజలకు ఉపయోగపడే సృజనాత్మక ప్రాజెక్టులను రూపకల్పన చేసి, డిటైల్డ్ రిపోర్ట్ రూపంలో ఇవ్వాలని కలెక్టర్ ప్రత్యేకంగా ఆదేశించా రు.అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహిస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరే ప్రాజెక్టులను ప్రాధాన్య తగా తీసుకోవాలి అని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావే శంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిఆర్డిఓ మొగలప్ప, డిఎన్హెచ్ఓ, డిఏఓ, డిఈఓ తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులు సిద్ధంగా ఉండాలి

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు



**శివ్వంపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలు ఏ సమయంలో వచ్చిన ఎదుర్కోవడానికి పార్టీపరంగా శ్రేణులు సిద్ధంగా ఉండాలని సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావు పిలుపునిచ్చారు. విదేశీ పర్యటన ముగించుకుని శుక్రవారం రాత్రి స్వదేశానికి వచ్చిన సందర్భంగా హైదరాబాద్‌లోని హరీష్ రావు నివాసంలో శనివారం మండలానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, శ్రేణులు హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసి జరగబోవు స్థానిక సంస్థ ఎన్నికలు, క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం తీసుకోవలసిన అంశాలపై కూలంకషంగా చర్చించారు. అంతకుముందు మండల పార్టీ రమణ గౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ సర్పంచ్ చెన్నా నాయక్, గొర్రె వెంకట్ రెడ్డి లు స్థానిక శాసన సభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి, దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డిలతో కలిసి మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు కు ఆయన ఫోటోతో కూడిన జ్ఞాపికను బహూకరించారు.

### ఫాంహౌస్‌లో కేటీఆర్, హరీష్‌రావును కలిసిన మన్సూర్

టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మెదక్ జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్ శనివారం ఎర్రవల్లి లోని కెసిఆర్ వ్యవసాయ క్షేత్రంలో టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రులు కల్వకుంట్ల తారక రామారావు, తన్నీరు హరీష్ రావు లను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక సంస్థల ఎన్నికలు, సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీల నియామకంపై మన్సూర్ వారితో చర్చించారు.

# పేద ప్రజల అభ్యున్నతి కొరకు రాష్ట్ర ప్రభుత్వం కృషి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసులు రెడ్డి



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో పేద ప్రజల అభ్యున్నతి కొరకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచారం పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శనివారం గద్వాల పట్టణ సమీపంలోని దౌదర్పల్లి దగ్గర నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఇళ్ళను మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ చేతుల మీదుగా గృహప్రవేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజల దీవెనలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కొరకు పాటుపడుతున్నట్లు తెలిపారు. గత పది సంవత్సరాలలో నిరుపేదలకు ఇల్లు కట్టించాలని తపన ఆనాటి ప్రభుత్వానికి లేదని ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ప్రతి నియోజకవర్గానికి 3,500 మంజూరు చేసిందని తెలిపారు.ప్రతి ఇంటికి ఐదు లక్షల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల 50 వేల మందికి ఇల్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని అన్నారు. ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రిచే ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు అందాలనే తలంపుతో మంత్రి శ్రీనివాసులు రెడ్డి కృషి చేశారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా పేదవారి సంక్షేమ పథకాలు ఆగరాదని ముఖ్యమంత్రి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ బి ఎం సంతోషి మాట్లాడుతూ 75 కోట్లతో మొదటి దశ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు 560 పూర్తి చేశామని రెండవ విడత 715 ఏళ్లు నిర్మించినట్లు తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీలో స్కూల్ కమిటీ హాల్ నిర్మించినట్లు సమీపంలోనే మెడికల్ కాలేజీ నర్సింగ్ కాలేజీ ఉన్నదని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్క లబ్ధిదారు సొంత ఇంటిని వారే నివసించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన సొంత ఇంటి కల నెరవేరిందని మంత్రులకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉన్నా వారికి తప్పక ఇల్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అంతకుముందు మంత్రులకు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా గృహప్రవేశం చేసిన వారితో మంత్రులు, కలెక్టర్,ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు.ఈ సందర్భంగా తొమ్మిది కోట్ల రూపాయల చెక్కును మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ ఇండ్ల రుణాల క్రింద అందజేశారు, డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు మంత్రులు పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు,హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీవో అలివేలు, మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల హనుమంతు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్య సంస్థల్లో మౌలిక వసతులు ప్రాధాన్యత

- మంత్రి దామోదర రాజనర్సింహ



**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** విద్య, వైద్య రంగాల్లో మౌలిక వసతులకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తున్నది రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లాలోని కేజీబీవీ, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన మౌలిక వసతులు కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ విద్య, వైద్య సంస్థల్లో మౌలిక వసతులు మెరుగు కోసం ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత ఇస్తున్నదని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. జిల్లాలో ఉన్న కేజీబీవీ, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థుల హాస్టల్ నిర్వారణకు అవసరమైన సదుపాయాల కల్పన బెడ్స్, కిచెన్ సామాగ్రి, టేబుల్స్, ప్లేట్స్, పుస్తకాలు, డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు, స్పోర్ట్స్ కిట్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పనపై సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో ఉన్న అన్ని కేజీబీవీ పాఠశాలలు మోడల్ పాఠశాలలో రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు కార్పొరేట్ స్కూల్స్ కు ధీటుగా ప్రభుత్వ రంగంలోని అన్ని పాఠశాలలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్య రంగాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎంతగానో ప్రాధాన్యమిస్తుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో కావాల్సిన వసతులు పై సమగ్ర నివేదిక రూపొందించాలని, వాటి ప్రాధాన్యాన్ని అనుసరించి సిఎస్ఆర్ నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. సిఎస్ఆర్ నిధులతో ఆయా పరిశ్రమలు చేపట్టిన పనులను ఆయా శాఖల అధికారులు నిరంతరం తనిఖీ చేసి పనులు నాణ్యతతో జరిగేలా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ కు దీటుగా అభివృద్ధి చెందుతాయన్నారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో అవసరమైన ఫర్నిచర్ కిచెన్స్ సామాగ్రి స్పోర్ట్స్ కిట్ లు ,సి ఎస్ ఆర్ నిధులతో అందుబాటులో ఉంచారు అన్నట్లు మంత్రి తెలిపారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి , జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జానాయక్,సిపి ఓ బాలశౌరి, పంచాయతి రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు, టిఎస్ఈడబ్ల్యూ ఐడిసి ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యమకారులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



**చేర్యాల, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** జనగామ జిల్లా సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టులో హాజరై అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లా సాధన కోసం జిల్లా ప్రజలు, విద్యావంతులు, ప్రజాసంఘాలు, న్యాయవాదులు, మేధావులు పెద్ద ఎత్తున ఉద్యమం చేయడంవల్లే జనగామ జిల్లా ఏర్పడిందన్నారు. జిల్లా ఏర్పడటం వల్ల జిల్లా స్థాయి కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయని, అంతే కాకుండా జిల్లా స్థాయి పదవులు వచ్చి ఎంతో మంది నేతలు పదవులు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ దుర్మార్గంగా వ్యవహరించి అనేక మందిపై కేసులు పెట్టించి వారి జీవితాలను ఇబ్బందుల గురి చేసి ఓరి ఉసురు తగిలి ఫామ్ హౌస్ లోనే కూర్చోవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కేసులో డిసిసి అధ్యక్షులతో పాటు అనేకమంది కాంగ్రెస్ నాయకులు, ఉద్యమకారులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను వేగంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**శివ్వంపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. శనివారం శివంపేట మండలం చిన్న గొట్టిముక్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సంబంధిత లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఈ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లో మొత్తం ఎన్ని ఉన్నాయని, అవి ఏ ఏ దశలో ఉన్నాయో అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ప్రారంభం కానీ ఇండ్లు ఎన్ని ఉన్నాయని అధికారులను అడిగారు, నిర్మాణంలో ఉన్న ఇండ్లకు గాను సంబంధిత పంచాయతీ సెక్రటరీలు ఆలస్యం చేయకుండా వెంట వెంటనే ఫోటో తీసి అప్లోడ్ చేస్తే లబ్ధిదారుల అకౌంట్ లలో వెంటనే డబ్బులు జమ అవుతాయని కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కమలాద్రి, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు ఉన్నారు.

# సమాజానికి దిక్సూచి 'ఉపాధ్యాయుడు'

- టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య
- విద్యావంతుల తయారీలో టీచర్ల పాత్ర ఎనలేనిది
- గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి
- దేశాధినేతకైన, రాజ్యాధినేతకైన
- బడితోనే ప్రస్థానం మొదలైంది
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** సమాజానికి దిక్సూచి 'ఉపాధ్యాయుడు అని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో టీచర్ల కృషి ఎంతో ఉంటుందని టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి కొనియాడారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి టీచర్స్ డే వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్య నేర్పే గురువులకు ఎమ్మెల్సీలు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ సమాజానికి దిక్సూచి 'ఉపాధ్యాయుడు' అనికొనియాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య ను అందించాలని విద్యార్థులు ఏ రంగాన్ని అయితే ఎంచుకుంటారో ఆ దిశగా ప్రోత్సాహించాలని వివరించారు. విద్యార్థులకు మంచి నాలెడ్జ్ ఇచ్చి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ విద్యావంతుల తయారీలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది అని డాక్టర్ రాధా కృష్ణ ఆలోచనలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. టీచర్లు ఏంతో గొప్పవాళ్ళని, గురువులేనిదే ఎవరూ లేరన్నారు. ఒకప్పుడు భయంతో చదువు నేర్చుకునే వాళ్ళమని, నేడు టెక్నాలజీ తో విద్య నేర్చుకుంటున్నారన్నారు. జాతీయ విద్యా విధానంతో విద్య బోదించాలని అయన కోరారు. విద్యలో రాణించినప్పుడే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతామన్నారు.గురువులతోనే సమాజ అభివృద్ధి సాధ్యపడుతుందని వివరించారు.పదో తరగతి తర్వాత విద్యార్థులు వారు ఎంచుకున్న కోర్సుల వైపు ముందుకు సాగాలన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతని ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూనే యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో కార్పొరేట్ తరహాలో పాఠశాలలు ఏర్పాటు చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటుందని చెప్పారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు.రాష్ట్ర అధినేత కైనా దేశాధినేతకైన బడిలోంచే తమ ప్రస్థానం మొదలవుతోందన్నారు. విద్యారంగానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు చేసిన కృషిని స్మరించుకోవాలన్నారు విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యం అనే నానుడితో విద్యారంగం నుండి వచ్చి అత్యున్నతమైన స్థాయి పదవులు చేపట్టిన వ్యక్తిగా సర్వేపల్లి రాధా కృష్ణన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన (58 ) మంది టీచర్లను శాలువా, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ ,జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఏ ఎం ఓ సుదర్శన్ మూర్తి, సర్వ శిక్ష అభినయ్ అధికారులు జ్యోతి, ఈశ్వరి నవీన్, రాజు,ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉత్తమ ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు, విద్యా శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న ఆదర్శ ప్రిన్సిపాల్ కృషిత

- విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నందుకు జిల్లా స్థాయి అవార్డు



**కాటారం సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్ ప్రిన్సిపాల్ జనగామ కృషిత జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జరిగిన గురుపూజోత్సవం కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా గ్రంధాలయ చైర్మన్ కోట రాజబాబు, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి ల చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. మారుమూల ప్రాంతానికి చెందిన విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తూ వారిని వివిధ రంగాల్లో దేశ , విదేశాల్లో ఉన్నత స్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తున్న ప్రిన్సిపల్ కృషితను ఎమ్మెల్యే, కలెక్టర్ శాలువాతో సన్మానించి, షీల్డ్ ను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృషిత మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 21వ శతాబ్దం నైపుణ్యాలు, ఆధునిక విద్య బోధన అందిస్తూ అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్ది ఉత్తమ పౌరులను దేశానికి అందించడమే లక్ష్యంగా ఆదర్శ విద్యా సంస్థ 36 ఏళ్లుగా ముందుకు సాగుతుందన్నారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించేలా తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృషిత ను ట్రస్మా ప్రతినిధులు, ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజేందర్, ట్రస్మా ప్రతినిధులు సాంబయ్య, ఉన్నారు.

## చేవెళ్లలో అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు ప్రారంభం

- కేసుల సత్వర పరిష్కారానికి అదనపు కోర్టులు
- హైకోర్టు న్యాయమూర్తి అభినందన్ కుమార్ శావిలి



**చేవెళ్ల, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** కేసుల సత్వర పరిష్కారానికి అదనపు కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి అభినందన్ కుమార్ శావిలి తెలిపారు. శనివారం చేవెళ్లలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి అభినందన్ కుమార్ శావిలి, రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్, చేవెళ్ల జిల్లా అదనపు న్యాయమూర్తి ప్రదీప్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, సివిల్ జడ్జి వినోద్ కుమార్ ఉపాధ్యాయలతో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చేవెళ్ల పట్టణంలో న్యాయ సేవలను మరింత అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో నిర్మించినట్లు తెలిపారు. ఈ కోర్టు స్థాపనతో కేసుల విచారణ వేగంగా జరిగే అవకాశం ఉందని చెప్పారు. న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో అదనపు కోర్టుల ఏర్పాటుకు హైకోర్టు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. కొత్త కోర్టు ప్రారంభం వల్ల స్థానిక ప్రజలకు త్వరితగతిన న్యాయం అందుతుందని హజరైన ప్రజలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి ప్రదీప్ నాయక్, చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, జూనియర్ జడ్జి వినోద్ కుమార్, ఉపాధ్యాయ, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, చేవెళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్, చేవెళ్ల న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, కోర్టు అధికారులు, చేవెళ్ల పోలీసు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

## నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తేనే భవన నిర్మాణ అనుమతులు



**వరంగల్ ఎంజీఎం, సెప్టెంబర్ 6(జనంసాక్షి):** నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తేనే భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేస్తామని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. శనివారం అక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ కోసం నగర పరిధి లోని బాలసముద్రం వడ్డేపల్లి సుబేదారి శాయంపేట ప్రాంతాలలో కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించి సమర్పించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భవన నిర్మాణాల అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే క్రమంలో వాస్తవ సమాచారాన్ని సూచించిన ధృవ పత్రాలను జత చేయడమే కాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించే క్రమంలో సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసిపిలు రజిత, ఎర్షాద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ సబ్ సెంటర్ల ఆకస్మిత తనిఖీ



**మహబూబాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా మాటేడు గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ ని సబ్ సెంటర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దంతాలపల్లిలో శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా డాక్టర్ బానోత్ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది హాజరు రోగులకు అందిస్తున్న వైద్యసేవలు మందుల లభ్యత ల్యాబ్ సదుపాయాలు టీకాల పంపిణీ స్టాక్ రిజిస్టర్లు తదితర అంశాలను సవివరంగా పరిశీలించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజారోగ్య చర్యలు ఎంతవరకు అమలవుతున్నాయని సమీక్షించారు వర్షాకాలంలో మలేరియా డెంగ్యూ వైరల్ ఫీవర్స్ వంటి వ్యాధుల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపు చాలా ముఖ్యం అని తెలిపారు. ప్రతి ఇంటికి శానిటేషన్ శుభ్రమైన తాగునీటి సరఫరా దోమల నియంత్రణ చర్యలను విస్తృతంగా చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామాలలో గృహసందర్శనల ద్వారా వైద్య సిబ్బంది ప్రజల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించి ఆరోగ్య శాఖ అందించే సేవలను ప్రతి పౌరునికి చేరవేయడం ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సుధీర్ రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె విద్యాసాగర్ డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వనాకర్ రెడ్డి తొర్రూర్ వైద్యాధికారిణి నందన డాక్టర్ కవిత డాక్టర్ రమ్య కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సంజీవరావు సాయికుమార్ వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### గ్రామ రెవెన్యూ వ్యవస్థను

## పునరుద్దరించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు

- ట్రెసా వికారాబాద్ జిల్లా అధ్యక్షులు జి.విజయేందర్



**వికారాబాద్ సెప్టెంబర్ 6, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీయుకున్న నిర్ణయం గ్రామ రెవెన్యూ వ్యవస్థ ను పునరుద్దరించి 5610 మంది గ్రామ పాలనాధికారులను నియమించి వారికి నియామక పత్రాలు ఇచ్చినందున తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) వికారాబాద్ జిల్లా పక్షాన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తుందని ట్రెసా వికారాబాద్ జిల్లా అధ్యక్షులు జి.విజయేందర్ తెలిపారు. ఈ గ్రామ పరిపాలన వ్యవస్థ పునరుద్ధరణ తో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు సాదారణ ప్రజలకు, రైతులకు మేలు కలగడంతో పాటు సత్వర సేవలు అంది ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించడానికి అవకాశం లభిస్తుందని. ఈ ప్రజాపాలన అధికారులు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా మారి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తారని ట్రెసా భావిస్తుందని. గ్రామ స్థాయిలో రెవెన్యూ పాలన సజావుగా నడిచేందుకు ఈ వ్యవస్థ ఎంతో దోహద పడుతుందని భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు, పరిగి, తాండూరు శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## యూరియా కోసం కొట్టుకున్న రైతులు

### ఒకరికి తీవ్ర గాయాలు



**సైదాపూర్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు యూరియా బస్తాలు వచ్చాయి. దీంతో వెన్నంపల్లి,సోమారం, లస్మన్నపల్లి, ఆరేపల్లి, ఎక్లాస్పూర్ గ్రామాలకు చెందిన రైతులు సహకార సంఘం వద్దకు చేరుకొని యూరియా కోసం బారులు తీరారు. ఉన్నట్టుండి వెన్నంపల్లి, ఎక్లాస్పూర్ గ్రామాలకు చెందిన రైతుల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రైతులు యూరియా కోసం కర్రలతో, చెప్పులతో, బండరాళ్లతో దాడి చేసుకున్నారు. ఎక్లాస్పూర్ గ్రామానికి చెందిన రైతులు వెన్నంపల్లి గ్రామానికి చెందిన కంది గోపాల్ రెడ్డి అనే రైతును బండలతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే మహిళా రైతుపై చెప్పులతో దాడి చేశారు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి సైదాపూర్ ఎస్సై తిరుపతి చేరుకుని గొడవ జరగడానికి కారణాలు ఏమిటి ఎందుకు రైతులు కొట్టుకున్నారని చైర్మన్,సంఘం సిఈఓ మల్లారెడ్డి, డైరెక్టర్లను అడిగి తెసుకున్నారు. సమస్య పరిష్కరించే వరకు రైతులు ఓపికగా ఉండాలని ఎస్సై రైతులకు సూచించారు.

## అభివృద్ధి కోసమే పార్టీ మారిన ఎమ్మెల్యే ఏం చేస్తున్నట్లు?

### భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు వైఫల్యం

### రూ. 100 కోట్లు కేటాయించాలి




**నూగూర్ వెంకటాపురం సెప్టెంబర్ 6(జనంసాక్షి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో ప్రజా సమస్యలపై భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావుకు పట్టింపేలేదని, వెంకటాపురం ప్రజలు ఓట్లు వేయకుండానే ఆయన గెలిచారా..? ఎమ్మెల్యే వైఫల్యం కారణంగానే అధ్వానంగా తయారైన భద్రాచలం, వెంకటాపురం ప్రధాన రహదారి పరమత్తులకు నిధులు తేలేకపోతున్నారని సిపిఐ(ఎం ) రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, ములుగు జిల్లా పార్టీ కార్యదర్శి బి రెడ్డి సాంబశివ ఎద్దేవా చేశారు. దుర్భరంగా తయారైన భద్రాచలం- వెంకటాపురం ప్రధాన రహదారి నిర్మాణానికి రూ. 100 కోట్లు కేటాయించాలని సిపిఐఎం) పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్రను చేపట్టింది. శనివారం ఈ పాదయాత్రను యాకన్న గూడెం వద్ద సిపిఐ (ఎం ) రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివుడి కృష్ణారెడ్డి, ములుగు జిల్లా కార్యదర్శి బి రెడ్డి సాంబశివ మాట్లాడుతూ.. టిఆర్ఎస్ పార్టీలో గెలిచిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు ఆ పార్టీలో ఉంటే ప్రజా సమస్యల పరిష్కారానికి నిధులు తేవడం కష్టంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారన్నారు. అధికార పార్టీలో చేరిన ఆయన ఏజెన్సీ ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. నెలలుగా భద్రాచలం నుండి వెంకటాపురం ఆర్టీసీ బస్సులను సైతం నిలిపివేస్తే ఆయన ఏం చేశారని అన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ 100 కోట్లు కేటాయిస్తేనే రోడ్డు నిర్మాణం పూర్తవుతుందన్నారు. నిర్మాణానికి నిధులు కేటాయించేదాకా ఎర్రజెండా నాయకత్వంలో ఉద్యమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. సిపిఐ ఎం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర ఆదివారం అంబేద్కర్ సెంటర్ కు చేరుతుందని అంబేద్కర్ సెంటర్లో జరిగే ముగింపు సభకు సిపిఐ ఎం పార్టీ రా ష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగా రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

## 41మహిళా సాధికారత అవగాహనతో సార్ధకత

- మహిళా సాధికారత ఇంచార్జ్ డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ అనూష



**చిట్యాల సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** ఉజ్వల భవితకు పునాది విద్యార్థి దశ ,ఈ సమయంలో సరైన మార్గంలో వెళ్లేలా చూస్తే బాగుంటుందని మహిళా సాధికారత ఇంచార్జ్ డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ అనూష అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి ఆదేశానుసారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల మండల సమైక్య మీటింగ్ లో ఎంపీడీవో జయశ్రీ ,సూపర్వైజర్ జయప్రద ఆధ్వర్యంలో(ఉమెన్ హబ్) మహిళా సాధికారత కేంద్ర సిబ్బంది అనూష, మమత మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. సేఫ్ టచ్- అన్ సేఫ్ టచ్, అక్రమ రవాణా, బాల్య వివాహ నిషేధ చట్టం, మొబైల్ వాడటం వల్ల జరిగే నష్టాల గురించి అదేవిధంగా ఆడపి ల్లలపై లైంగిక వేధింపులు రోజురోజుకి ఎక్కువ అవుతు న్నాయని సోషల్ మీడియా పట్ల జాగ్రత్త ఉండాలి .18 సంవత్సరాల లోపు పిల్లలు ఆపద సమయంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 టోల్ ఫ్రీ నెంబర్ నీ ఉపయోగిం చుకోవాలని, మహిళల హక్కులు, సేవలు అలాగే ఆడ, మగ సమానమేనని బాల్య వివాహాలను అరికట్టాలని, లింగ వివక్షత చూప వద్దని, లింగ నిర్ధారణ చట్టం నేర మని ఇద్దరు ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజన పథకం ను ఉపయో గించుకోవా లన్నారు. మహిళలు ఆపద సమయంలో ఉమెన్ హెల్ప్ లైన్ 181 ,వృద్ధులు 14567 ,సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 నంబర్లను సద్వి యోగం చేసుకోవా లని పలు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లోడి హెచ్ ఈ డబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ మమత, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఏపిఎం మంజుల, అంగ న్వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

## పాఠశాలలో బోధనాభ్యాస మేళా

### ఉపాధ్యాయుల్లో ప్రతిభ ఎక్కువ



**పాలకుర్తి, సెప్టెంబరు 06 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రతిభ గల ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని ఎంపీడీవో రవీందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనాభ్యాస మేళా కార్యక్రమాన్ని నిర్వహించగా, ఎంఈవో పోతుగంటి నర్సయ్యతో కలిసి ముఖ్య అతిథిగా ఎంపీడీవో రవీందర్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు టీచింగ్ లర్నింగ్ మేళా కార్యక్రమాన్ని (టీఎల్ఎం) నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఉపాధ్యాయులు తయారు చేసిన మెటీరియల్ సమాగ్రి విద్యార్థులకు ఉపయోగ పడేదిగా ఉండాలని సూచిం చారు. దీంతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులు తయారు చేసిన మెటీరి యల్ను జిల్లా స్థాయికి ఎంపిక కావాలని సూచించారు. జిల్లాకు ఎంపికైన ఉపాధ్యాయులు దేవగిరి సూర్యప్రకాష్, అశ్రఫ్ సల్సానా, మెటీరి యల్ను జిల్లా స్థాయికి ఎంపిక కావాలని సూచిం చారు. జిల్లాకు ఎంపికైన ఉపాధ్యాయులు,అభినందించారు. ఉన్నారు.

## ప్రభుత్వ వసతి గృహాల్లో ఫాగింగ్



**లకెట్టిపేట, సెప్టెంబర్ 06 (జనంసాక్షి) :** లక్షెట్టిపేట మున్సిపల్ ఏరియా లోని అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు,దోమలు ప్రభలకుండా జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత ఆదేశాల మేరకు వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నాడు అన్ని హాస్టల్స్ లో అల్ఫాసైఫర్ మైత్రిన్ అనే దోమల మందును పిచికారీ చేసినట్లు డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ఈ సీజన్ లో మొదటి రౌండ్ వేసిన 45 రోజుల తర్వాత ఈరోజు తిరిగి రెండవ దోమల మందును పిచికారీ చేసినట్లు తెలిపారు. పాల్గొన్నారు.

## భర్తను చంపిన కేసులో భార్య రిమాండ్



**కోట్ పల్లి సెప్టెంబర్ 06(జనంసాక్షి):** మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో గురువారం అర్ధరాత్రి భర్త తలపై బండరాయి మోదీ హత్య చేసిన సంఘటన తెలిసిందే. ఈ విషయాన్ని పూర్తిగా విచారణ చేసిన పోలీసులు మృతుని భార్య సుజాత హత్య చేసినట్లు నేరం ఒప్పుకున్నట్లు ధారూర్ సిఐ రఘురాములు మీడియాకు వెల్లడించారు. ఈ విషయమై మృతుని భార్య సుజాతను శనివారం రిమాండ్ చేసి చర్లపల్లి జైలుకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మైక్రో బ్రూవరిల ఏర్పాటును విరమించుకోవాలి

### ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్



**గోదావరిఖని, (జనంసాక్షి) :** రామగుండం కార్పొరేషన్ ప్రాంతంలో మైక్రో బ్రూవరి ఏర్పాటు కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసి మైక్రో బ్రూవరి ఏర్పాటు కార్యక్రమాన్ని విరమించుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో లేని శ్రద్ధ తెలంగాణ ప్రాంతంలో మద్యాన్ని ఏరులై పారించడానికి చిత్తశుద్ధి చూపించడం ప్రభుత్వ అసమర్ధతకు నిదర్శనమని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో మద్యం మరియు మత్తు పదార్థాల వల్ల యువత చెడు మార్గాల వైపు పయనిస్తున్నారని ఇలాంటి పరిస్థితుల్లో రామగుండం కార్పొరేషన్ ప్రాంతంలో మైక్రో బ్రూవరి ఏర్పాటు కోసం ఎక్సైజ్ శాఖ ఏర్పాటు చేయడమంటే కార్పొరేషన్ ప్రాంతంలో మరింత మద్యం ఏరులై పారే ప్రమాదం ఉందని సూర్య ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక ప్రాంత మైన రామగుండం కార్పొరేషన్లో ఇప్పటికే గల్లీకో వైన్ షాప్ ఏర్పాటు చేయడంతో పాటు వందల బెల్ట్ షా పులు ఇల్లీగల్‌గా నడుస్తున్న ఏటు వంటి చర్యలు తీసుకోకుండా అక్ర మ సంపాదనే ధ్యేయంగా పనిచే స్తున్న ఎక్సైజ్ శాఖ మైక్రో బ్రూవరి విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సూర్య డిమాండ్ చేశారు. రామగుండం కార్పొరేషన్ ప్రాంతంలో మైక్రో బ్రూవరి ఏర్పాటు వెనక్కి తీసుకోకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎక్సైజ్ శాఖ అధికారులను హెచ్చరించారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు ఐదుగురు ఉద్యోగుల ఎంపిక



**పాలకుర్తి, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్ లోని ఎల్బీ నగర్ స్టేడియంలో ప్రభు త్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ 2025-26 రాష్ట్రస్థాయి క్రీడలకు మండలంలో ఐదుగురు ఉద్యోగులు ఎంపిక య్యారు. శనివారం జిల్లా కేంద్రంలోని దర్శకంచ మినీ స్టేడియంలో జరిగిన ఎంపిక క్రీడల్లో మండలంలో పని చేస్తున్న ఐదుగురు ఉద్యోగులు మంచి ప్రతిభ కనబర చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటరెడ్డి తెలిపారు. పాల కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహి స్తున్న మామిండ్ల సోమల్లు, చెన్నూరు జెడ్పీ ఉన్నత పాఠ శాల లో పీడీగా పని చేస్తున్న కొడిశాల అశోక్. కబడ్డీ పోటీల కు ఎంపిక కాగా, అదే పాఠశాలలో ఉపాధ్యా యులుగా విధులు నిర్వహిస్తున్న శ్రీహరి, క్రాంతిలు క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న చిట్యాల యా దగిరి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు.

## తెలుగు రాష్ట్రాల్లో సుస్థిరమైన వ్యాపారవేత్త "బుయ్యని"




**తాండూరు సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** హైదరాబాద్ ఇంటర్నే షనల్ కన్వెన్షన్ సెంటర్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2025 కార్యక్రమంలో కేంద్ర పర్యాటక, సంస్కృతిక మంత్రి జి.కిషన్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ డా.జాటోత్ రామ్ చందర్ నాయక్ మరియు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చేతుల మీదుగా ఆర్బీఓఎల్ మేనేజింగ్ డైరెక్టర్ బుయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డి బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా వ్యాపార రంగంలో విశిష్ట కృషి,నూతన ఆవిష్కరణలు,సమాజానికి అందిస్తున్న అంకితభావ సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేయడం జరిగింది. ప్రైవేట్ మీడియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు బుయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## పారమిత హెరిటేజ్ పాఠశాల ప్రధానోపాధ్యాయునికి గురుబ్రహ్మ పురస్కారం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** స్థానిక నగరంలోని పద్మ నగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పరంకుశం గోపికృష్ణ కి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురుబ్రహ్మ పురస్కారాన్ని శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ మాజీ ఐ.ఏ.ఎస్ జయప్రకాష్ నారాయణ్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారని పాఠశాల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు తెలిపారు. శ్రీనివాస రామానుజన్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్‌లో రాష్ట్రస్థాయిలో మూడు ప్రథమ ర్యాంకులు, రెండు ద్వితీయ ర్యాంకులు, ఒక తృతీయ స్థానం, మరొక నాలుగవ స్థానం విద్యార్థులు సాధించినందుకు గాను, విద్యారంగానికి విశేష కృషి చేస్తున్నందుకుగాను శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ వారు ఈ పురస్కారాన్ని ప్రదానం చేయడం జరిగింది. ఈ పురస్కారాన్ని అందుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాద్ రావు, డైరెక్టర్స్ ప్రసూన,అనుకర్ రావు, రష్మిత, టి.యస్. వి రమణ, వినోద్ రావు, వి.యు.యం. ప్రసాద్, హనుమంతరావు, కో-ఆర్డినేటర్స్, ఉపాధ్యాయులు అభినందించారు.

## మా సార్ మాకు కావాలని విద్యార్థుల ఆందోళన

### ఆందోళన విరమింపజేసిన ఆర్డిఓ వెంకన్న, తహసిల్దార్ వెంకటేశ్వర్లు



**స్టేషన్ ఘన్పూర్, సెప్టెంబర్ 06 (జనంసాక్షి) :** స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని శివుని పెల్లిలో గల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఇన్చార్జి హెచ్ఎంగా ఉన్న రాజు బదిలీపై వెళ్లగా శనివారం రోజున గిరిజన ఆశ్రమ పాఠశాల బాలికలు మా సార్ మాకు కావాలని పాఠశాల గేటుముందు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న స్టేషన్ ఘన్పూర్ ఆర్డీవో డిఎస్ వెంకన్న, తాహసిల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ వేణు, ఎస్ఐ వినయ్ కుమార్ ఆశ్రమ పాఠశాల వద్దకు చేరుకొని బాలికలతో మాట్లాడి ఆందోళన విరమింపచేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఏ ఉద్యోగి అయినా బదిలీపై వెళ్లడం సహజంగా జరిగేదేనని, ఈ విషయమై బాలికలు సమస్యలు పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లాలి తప్ప ఆందోళనలు చేపట్టవద్దని బాలికలకు నచ్చచెప్పారు. విద్యార్థినిల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తల్లిదండ్రులు కష్టపడి తమ పిల్లలను క్రమశిక్షణతో చదువుకోవాలని, భవిష్యత్తులో మంచి ప్రయోజకులు కావాలని ఆశ్రమ పాఠశాలకు పంపిస్తున్నారని, తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
07 సెప్టెంబర్ 2025

# మంత్రి కోమటిరెడ్డిని విమర్శిస్తే సహించేది లేదు

నల్గొండ బ్యూరో, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) : నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ – బీఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి విమర్శించారు. శనివారం నల్గొండ లోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయంలో నల్గొండ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని వ్యక్తిగతంగా విమర్శిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. నల్గొండ పట్టణంలోని 1వ నెంబర్ వినాయక విగ్రహం వద్ద గణేష్ నిమజ్జనం రోజు బీజేపీ జిల్లా అధ్యక్షుడితో పాటు మాజీ ఎమ్మెల్యే వ్యవహరించిన తీరు పట్ల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వారిద్దరి దిగజారుడు రాజకీయాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉత్సవ కమిటీ ఆహ్వానంతో నిమజ్జనం రోజు 1 వ నెంబర్ విగ్రహం వద్దకు రావడం జరిగిందని అన్నారు. మంత్రి మాట్లాడుతుండగా తనను పైకి పిలవలేదని అక్కసుతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఘర్షణ వాతావరణం సృష్టించాడని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రూ.150 కోట్లతో లతీఫ్ సాహెబ్ గుట్ట, బ్రహ్మంగారి ఘాట్ రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం



అభివృద్ధి పనులు చేపట్టిందని చెప్పాడు తప్ప కాంగ్రెస్ చేస్తుందని చెప్పి రాజకీయాలు చేయలేదన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడికి కనీస రాజకీయ అవగాహన లేదని ధ్వజమెత్తారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు జరుగుతుంటే బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఇది జీర్ణించుకోలేక పోయాడని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నల్గొండ నియోజకవర్గ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎన్నో అభివృద్ధి పనులను చేస్తున్నాడని, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును పూర్తి చేసుకోవడం జరిగిందని తెలిపారు. నల్గొండ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అడ్డా అని ఆయన స్పష్టం చేశారు.

చిల్లర రాజకీయాల కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మేము సహనం కోల్పోతే గణేష్ నిమజ్జనం రోజే వారిద్దరికీ గన్ మెన్లు వచ్చేవారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పాలన సాగుతుందని పేర్కొన్నారు. అన్ని పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని, రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నల్గొండలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తు ఉందని, గణేష్ నిమజ్జనం రోజు నల్గొండలో జరిగిన సంఘటనే దానికి నిదర్శనమని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కత్తుల కోటి, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కమిటీ సభ్యుడు కూసుకుంట్ల రాజిరెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుబ్బ రూపా అశోక్ సుందర్, నాయకులు బొజ్జ శంకర్, సురిగి వెంకన్న గౌడ్, యూత్ కాంగ్రెస్ నల్గొండ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి కార్తీక్, పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, కంచర్ల ఆనంద్ రెడ్డి, ఇటికాల శ్రీనివాస్, పిల్లి యాదగిరి యాదవ్, పెండెం పాండు, ఎగ్గడి సుజాత, బొబ్బలి స్వరూప రెడ్డి, పిల్లి రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



చండూరు, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) : జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఆమె చండూరు తహసీల్దార్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబ పెద్ద చనిపోయిన పరిస్థితుల్లో కుటుంబానికి సహకారంగా జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఒకేసారి 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ పథకానికి అర్హులైన వారిని దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. 59 సంవత్సరాల లోపు వయసు ఉన్న కుటుంబ పెద్ద ఏదైనా కారణం చేత మరణించి ఉంటే జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అతిపెద్ద కుటుంబం అర్హులని, ఈ పథకం కింద అవసరమైన ధ్రువపత్రాలు జతచేస్తూ దరఖాస్తు చేసుకుంటే వారం రోజుల్లో వారి కుటుంబ సభ్యుల అకౌంట్ లో 20 వేలు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసి కేజీబీవీ పరిసరాలు, కిచెన్, స్టోర్ రూమ్, వాష్ ఏరియాను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో చండూరు ఆర్డీఓ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ మల్లేష్, ఎంపీడీఓ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక వైద్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఈలా త్రిపాఠి




కనగల్, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) : మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ప్రతిరోజు వచ్చే రోగుల రిజిస్టర్ ను చూసి, ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్కువ సంఖ్యలో ప్రసవాలు చేసినందుకు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఏ ఎన్ సి రిజిస్టర్ తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో కే సుమలత, ప్రాథమిక ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ గాదరి రామకృష్ణ, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ ఈలా త్రిపాఠి



కనగల్, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) : మండలంలోని తేల కంటి గూడెం గ్రామపంచాయతీలో ప్రజా పాలన పైలట్ ప్రాజెక్టు కింద మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను శనివారం జిల్లా కలెక్టర్ ఈలా త్రిపాఠి అధికారులతో కలిసి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లను దసరా పండుగ రోజున రోడ్లు, భవనములు, మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. మొత్తం ఎన్ని ఇండ్లు పురోగతిలో ఉన్నాయని అధికారుల నుంచి వివరాలను సేకరించారు .83 ఇండ్లకు గాను 72 ఇండ్లు స్లాబ్ లెవెల్ దశలో ఉన్నాయని, 12 ఇండ్లు పూర్తి అయినట్లు హౌసింగ్ ఏ.ఈ. వెంకటేశ్వర్లు కలెక్టర్ ఇలా త్రిపాఠికి వివరించారు. ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన అనంతరం ఇంటి స్థలాలకు సంబంధించిన వివరాలను రెవెన్యూ అధికారుల నుంచి నివేదిక తీసుకొనిత్వరలో వాటికి కూడా పట్టాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని లబ్దారులకు హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పిడి రాజకుమార్, ఆర్డీవో అశోక్ రెడ్డి, తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో కే సుమలత, ఆర్ ఐ సునీత, ఇన్చార్జి ఎంపిఓ వీరబాబు, పంచాయతీ కార్యదర్శి క్రాంతి, మాజీ సర్పంచులు బోగారి రాంబాబు, బిల్లపాటి మోహన్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఉన్నారు.

## వినాయక మండపాల్లో వెల్లివిరిసిన మతసామరస్యం

కామేపల్లి, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) : మండలంలోని గ్రామాల్లో హిందూ సాంప్రదాయ పండుగలు వస్తే ముస్లింలు– ముస్లిం పండుగలు వస్తే హిందువులు ఐకమత్యంగా జరుపుకుంటారని చెప్పడానికి గణపతి నవరాత్రి ఉత్సవాలు నిదర్శనంగా నిలిచాయి. మండలంలోని కొమ్మినేపల్లి గ్రామపంచాయతీలో పలుచోట్ల వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా తొమ్మిది రోజులు పాటు నిర్వహించారు.శనివారం జరిగిన లడ్డు వేలం పాటలో మూడుచోట్ల లడ్డులను అత్యధికంగా వేలం పాట పాడి లడ్డూలను దక్కించుకున్నది ఇదే గ్రామానికి చెందిన ముస్లి వ్యాపారి షేక్ రబ్బాని పాషా...వివరాలు ఇలా ఉన్నాయి. కొమినేపల్లి గ్రామపంచాయతీలోని డిబి సెంటర్, ముదిరాజ్ బజార్, మీసేవ సెంటర్లలో వినాయక మండపంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా శనివారం



నిర్వహించిన లడ్డు వేలం పాటలలో మూడుచోట్ల ముస్లిం వ్యాపారి షేక్ రబ్బన్ పాషా అత్యధిక ధరకు వేలంపాడి లడ్డూలను దక్కించుకున్నారు. ముస్లిం సోదరుడు కోళ్ల ఫారం వ్యాపారి పాష కు గణేష్ ఉత్సవ కమిటీ గ్రామ ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను దేవాలయాలుగా తీర్చిదిద్దాలి



మర్రిగూడ, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) : నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలోని మర్రిగూడ మండల కేంద్రంలో ప్రభుత్వ మోడల్ పాఠశాల జూనియర్ కళాశాల వసతి గృహాన్ని తనిఖీ చేశారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి విద్యార్థినుల డార్మెటరీ హాల్, డైనింగ్ హాల్, వంటగది, బాత్రూంలు, లెట్రూమ్‌లు పరిశీలించి నాన్యమైన భోజనం పెడుతున్నారా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచినప్పటికీ విద్యార్థులకు పెట్టె భోజనంలో నాణ్యత ఉండడం లేదని అన్నారు... అనంతరం మోడల్ పాఠశాలను పరిశీలించారు. తరగతిగదులు ఆటస్థలం పరిశీలించి మోడల్ పాఠశాల అభివృద్ధికి స్థానిక నాయకులతో కమిటీ ఉంటుందని, వారందరూ వచ్చి మోడల్ పాఠశాలలో ఏ ఏ సమస్యలు ఉన్నాయని విషయాలకు సంబంధించి పరిశీలన చేసి పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసిలు పాశం సురేందర్ రెడ్డి, మేతిరి యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్,మాల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్, నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెన్నమనేని రవీందర్రావు, మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల కంటే సమాజసేవ చేసేవారు అంటేనే ఇష్టం

మర్రిగూడ, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) : మర్రిగూడ మండలంలోని కుదబాక్షపల్లి గ్రామంలో శనివారం పాశం ధర్మ రెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు పాశం కిరణ్ కుమార్ రెడ్డి మరియు శంకర నేత్రాలయ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత కంటిపొర వైద్య శిబిరాన్ని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న ధనవంతులు ప్రజాసేవ చేయాలని పిలుపునిచ్చారు. నాకు రాజకీయాల కంటే సమాజ సేవ చేసేవారు అంటేనే ఎక్కువ ఇష్టమని అన్నారు. అమెరికాలో స్థిరపడిన పాశం కిరణ్ కుమార్ రెడ్డి పుట్టిన ప్రాంతానికి తమ వంతు సాయం చేయాలని ఇక్కడికి వచ్చి ఈ కార్యక్రమం చేయడం చాలా గొప్ప విషయమని ఈ సందర్భంగా ఆయనని అభినందించారు. కార్యక్రమంలో డీసీసీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి,



మర్రిగూడ మాజీ జెడ్పిటిసిలు పాశం సురేందర్ రెడ్డి, మేతరి యాదయ్య, మర్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్, నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెన్నమనేని రవీందర్రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్, పందుల పాండు, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య



కోట్‌పల్లి, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) : గ్రామాలను అభివృద్ధి పరచడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డ కింది అంజయ్య అన్నారు. కోట్ పల్లి మండల కేంద్రంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చొరవతో ఎస్సీ సబ్ ప్లాన్ కింద 55 లక్షల నిధులతో ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణ పనులను కోట్ పల్లి మాజీ సర్పంచ్ నక్కల విజయలక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు జ్ఞానేశ్వర్, మాజీ ఉపసర్పంచ్ రియాజ్, శివానందం, మాజీ మత్స్య శాఖ సంఘం అధ్యక్షులు నక్కల బందప్ప బందయ్య ,సీనియర్ నాయకులు చిత్ర శేఖర్, యువ నాయకులు దినేష్, వార్డు సభ్యులు చాకలి రమేష్, పెద్దెల్లి నర్సింలు, బండి నరసింహులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఉన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రామన్నపేట కోర్టు జడ్జిలు జి.సబిత, ఎస్.శిరీష



రామన్నపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) : ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉంటుందని రామన్నపేట సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మరియు అదనపు జూనియర్ సివిల్ కోర్టు జడ్జిలు అన్నారు. రామన్నపేట కోర్టు ప్రాంగణంలో ఈ నెల 13 న కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ లోక్ అదాలత్ ద్వారా రాజీసాధ్యమగిన అన్ని క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ట్రాఫిక్ చలానా కేసులు, ఎక్సైజ్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు కోర్టు వద్దకు రాకుండా ఉన్న బ్యాంకు, బీట్ ఫండ్, టెలిఫోన్ సంస్థల బాకీ వివాదాలు, ఫ్రీ లిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకునే అవకాశం ఉన్నదని అన్నారు. ఈ లోక్ అదాలత్ ద్వారా న్యాయస్థాన పరిష్కారంతో అన్ని తేలిక, త్వరిత తీర్పును అందించబడునని పార్టీలు, న్యాయవాదులు, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, తగు సహకారం అందించగలరని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయంగా విధులు నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామ పాలన అధికారులు విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. గురువారం కలెక్టరేట్ లో నిర్వహించిన గ్రామ పాలన అధికారుల కౌన్సెలింగ్ లో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.అభ్యర్థి సొంత నియోజకవర్గం కాకుండా వేరే నియోజకవర్గంలో ఖాళీల జాబితా ప్రదర్శిస్తూ వారి ఐచ్చికాల మేరకు పోస్టింగ్‌లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు.నియామక పత్రాలు తీసుకున్న గ్రామపాలన అధికారులు భాద్యతగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిజాయతీ, నిబద్ధత కోసం పోరాడేదే జర్నలిజం

మణుగూరు, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) : నిజాన్ని నిర్భయంగా రాసి ప్రజలను చైతన్యం చేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మణుగూరు ఇల్లందు క్లబ్ లో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జర్నలిస్ట్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా పరిగణించే జర్నలిస్టుల సేవలు మరువలేనివి. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో, అవినీతి, అక్రమాలను బహిర్గతం చేయడంలో వారి పాత్ర అపారమని అన్నారు.వృత్తిలో ఎదురవుతున్న సవాళ్లపై చర్చిస్తూ, నిజాయితీ నిష్పక్షపాత ధోరణితో సమాజానికి సేవ చేయాలని సంకల్పబద్ధత కలిగి ఉండాలని అన్నారు. సమాజ మార్పుకు దోహదపడే వాస్తవ అవాస్తవాలను దృష్టిలో పెట్టుకొని ప్రచురించడం వల్ల ప్రజల్లో మార్పు వస్తుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు చేసే పనులు మంచి లేదా చెడు ఏది చేసినా వాస్తవాలను రాయడం వల్ల వాళ్లలో మార్పు వస్తుందని అన్నారు.వార్తను సమయానికి అందించి, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో మీడియా వర్గాల పాత్ర గొప్పదన్నారు. పర్యావరణ పరిరక్షణ విద్య వైద్యం మహిళా సాధికారత రైతులు కార్మికులు చిన్న వ్యాపారుల సమస్యలను ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయుల శ్రమ విలువ కట్టలేనిది అన్నారు. పాలకులను ప్రశ్నించే గొంతు వారిదే ప్రభుత్వ నిర్ణయాలు చట్టాలు పథకాలు ఆర్థిక పరిస్థితుల గురించి వార్తల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు సమాచారం చేరవేయడంలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రతపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ఈ సందర్భంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేస్తానని అలాగే ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి ఏర్పాటు చేయాలని మండల తహసిల్దార్ కు సూచించారు. వచ్చే ఏడాది జర్నలిస్టు డే అయ్యే ఖర్చు నేనే భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పాత్రికేయులందరికీ జర్నలిస్ట్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ప్రధాన అధికారి దుర్గం రామచందర్, డి.ఎస్.పి రవీందర్ రెడ్డి, మండల తహసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో తేల్లూరి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ టి ప్రసాదరావు, ఎంపీఓ వెంకటేశ్వర రావు, ఎస్ ఓ



టు జి ఎం శ్రీనివాస చారి, డిజిఎం (పర్సనల్) ఎస్ రమేష్ , పట్టణ ప్రముఖులు దోసపాటి వెంకటేశ్వరరావు, దండా రాధాకృష్ణ, సీఐ పీ. నాగబాబు, ఎస్ఐ బి. రంజిత్, మణుగూరు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, కాంగ్రెస్ నాయకులు గాండ్ల సురేష్, మణుగూరు మండల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.




# ఫోర్త్ సిటీ భవిష్యత్తు తరాలకు మరో హైటెక్ సిటీ

- గ్రోత్ కారిడార్లలో భూమి బంగారమే..
- అభివృద్ధి పనుల ప్రారంభంతో మూడు రెట్లు పెరిగిన ధరలు
- ఓఆర్ఆర్-ట్రిబుల్ ఆర్ గ్రోత్ కారిడార్లలో భూమి బంగారమే..

**జనంసాక్షి:**రేపటి అర్బన్ ఇండియా విజనే భారత్ ఫ్యూచర్ సిటీ. కృత్రిమ మేధస్సు, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ తయారీ, పర్యాటకం, స్పోర్ట్స్, చలనచిత్ర నిర్మాణం, ఆరోగ్యం వంటి అన్ని రంగాలకు ప్రత్యేకంగా జోన్‌లను కేటాయిస్తూ.. రేపటి తరాలకు పర్యావరణ హితమైన నగరాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. వచ్చే పదేళ్లలో సుమారు 10 లక్షల ఉద్యోగులు పనిచేయనున్న ఈ ఫోర్త్ సిటీలో ఈ మేరకు హౌసింగ్ డిమాండ్ ఉంటుందని రియల్ ఎస్టేట్ నిపుణులు కొత్త మనోహర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌కు దక్షిణం వైపున 765 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో అభివృద్ధి చెందనున్న ఈ సమగ్ర పట్టణ ప్రాంతం భారత్‌కే తలమానికంగా నిలుస్తుందని తెలిపారు. ఇప్పటికే ఫేజ్-1లో 14 వేల ఎకరాల భూమిని సమీకరించారు. మరో 30 వేల ఎకరాల భూమిని సమీకరించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఫ్యూచర్ సిటీలో రహదారుల నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయి. పనుల ప్రారంభమైతే ఆయా ప్రాంతాల్లోని భూమి బంగారంగా మారుతుంది. వచ్చే రెండేళ్లలో ఫ్యూచర్ సిటీలోని ప్రాంతాలలో భూముల ధరలు మూడు రెట్లు పెరగడం ఖాయం. మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల, గుమ్మడవల్లి, లేమూరు, యాచారం, కందుకూరు, నందివనపర్తి, కడ్తాల్, ఆమన్‌గల్ ప్రాంతాల్లో అభివృద్ధి జోరుగా ఉంటుంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాలలో ఎకరం రూ.2-5 కోట్లు ఉండగా.. వచ్చే రెండేళ్లలో రూ.10-15 కోట్లకు చేరుతుంది. ఔటర్ రింగ్ రోడ్డుతో అభివృద్ధి హైదరాబాద్‌కే పరిమితమైంది. కానీ, రీజినల్ రింగ్ రోడ్డు, దాని చుట్టూ రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్ట్‌లతో సగం తెలంగాణ ప్రాంతం అభివృద్ధి నెక్ట్స్ లెవల్‌కు చేరుతుంది. ఇప్పటికే ఆయా కీలక ప్రాజెక్ట్‌లపై సర్కారు కసరత్తు చేస్తోంది. ఔటర్‌కు ఇరువైపులా గ్రోత్ కారిడార్ కిలో మీటర వరకే కేటాయించారు. దీంతో మల్టీ పర్పస్ జోన్‌గా మారిన ఆ ప్రాంతంలో హైరైజ్ అపార్ట్‌మెంట్లు, భారీ గేటెడ్ కమ్యూనిటీలు, వాణిజ్య సముదాయాలు వచ్చాయి. ఇక, ఇరువైపులా 5 కి.మీ. వరకూ గ్రోత్ కారిడార్‌గా పరిగణించనున్న ట్రిబుల్ ఆర్ ప్రాంతంలో అభివృద్ధి ఇంతకు రెట్టింపు స్థాయిలో ఉంటుంది. ఈ కారిడార్లలో ఎక్కడ భూమి కొన్నా బంగారంగా మారడం ఖాయం. బేగంపేట విమానాశ్రయం ప్రారంభించిన తొలినాళ్లలో హైదరాబాద్‌కు శివారు ప్రాంతమది. కానీ, ఇప్పుడు సిటీకి మెయిన్ సెంటర్‌గా అభివృద్ధి చెందింది. ఇదే తరహాలో ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డుల అభివృద్ధితో సమీప భవిష్యత్తులో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కూడా ప్రధాన నగరంగా మారుతుంది. ఫోర్త్ సిటీ నుంచి శంషాబాద్‌కు 20 కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఈ మార్గమంతా శరవేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. హైటెక్ సిటీలతో ఐటీ కంపెనీల రాకతో గచ్చిబౌలి, నానక్‌రాంగూడ ఎలాగైతే అభివృద్ధి చెందాయో అంతకు రెట్టింపు వేగంతో మహేశ్వరం అభివృద్ధి చెందుతుంది. ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఎయిరో స్పేస్ కంపెనీల రాకతో రావిర్యాల, ఆదిభట్ల, మహేశ్వరం ప్రాంతాల రూపురేఖలే మారిపోయాయి. బెంగళూరు హైవే, ఫ్యూచర్ సిటీలతో అనుసంధానమై ఉండటం అదనపు అంశాలు. గత ప్రభుత్వంలో ఎలాగైతే టీఎస్-బీపాస్ ద్వారా 21 రోజుల్లోనే పారిశ్రామిక పెట్టుబడులు, సంస్థలకు అనుమతులు ఇచ్చారో.. అదే తరహాలో హెచ్‌ఎండీఏ, హెచ్ఎంఆర్ ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లకు టైం లైన్ పెట్టి అనుమతులను ఇవ్వాలి. దీంతో ప్రాజెక్ట్‌లు చేపట్టేందుకు బిల్డర్లు ముందుకు రావడంతో పాటు పన్నులు, ఫీజుల రూపంలో ప్రభుత్వానికి బోలెడంత ఆదాయం సమకూరుతుంది.



## నెలకు రూ.20 లక్షల జీతం..

- వర్క్ ఫ్రమ్ హెూమ్ ఉద్యోగం


**జనంసాక్షి:**ఏఐ విజృంభణతో వేలాదిగా ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. ఫ్రెషర్లకు మంచి జీతంతో ఉద్యోగాలు రావడమే కష్టమైపోతున్న ప్రస్తుత తరుణంలో ఓ 23 ఏళ్ల కుర్రాడు మాత్రం మరో విధంగా నిరూపించాడు. ఈశాన్య భారతదేశంలోని ఒక చిన్న పట్టణానికి చెందిన ఈ టెకీ పట్టుదల, నైపుణ్యం అన్ని సవాళ్లను, వైఫల్యాలను అధిగమించగలవని నిరూపించాడు. ఏకంగా 500 పైగా తిరస్కరణలను ఎదుర్కొన్న ఈ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇప్పుడు ఏఐలోనే అగ్ర సంస్థలలో ఒకటైన ఓపెన్‌ఏఐలో పనిచేస్తున్నారు. నెలకు రూ.20 లక్షల జీతం. అది కూడా వర్క్ ఫ్రమ్ హెూమ్ ఉద్యోగం. ఈ యువ ఇంజనీర్ రెడ్డిట్ పోస్టు ప్రకారం.. తన కుటుంబంలో కంప్యూటర్ సైన్స్ లో బీటెక్ చేసిన మొదటి వ్యక్తి ఇతనే. ఏడాదికి రూ.3.6 లక్షల వేతనంతో మొదట్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఆఫర్ వచ్చింది. తీసుకున్నాడు. అయితే జాయిన్ డేట్ కోసం ఎదురుచూడకుండా మరింత క్రియాశీలకంగా వ్యవహరించాడు. వందలాది రిమోట్ అంతర్జాతీయ ఉద్యోగాలకు దరఖాస్తు చేయడం ప్రారంభించాడు. ఈ మార్గం ప్రారంభంలో లెక్కలేనన్ని తిరస్కరణలకు దారితీసింది, కానీ చివరికి ఫలించింది. 'నెలల తరబడి తిరస్కరణ తరువాత తిరస్కరణ. ఆ అప్లికేషన్లలో నాకు ఒక్క ఇంటర్వ్యూ కాల్ మాత్రమే వచ్చింది, ఎలాగోలా క్లియర్ చేశాను' అంటూ రెడిట్ పోస్ట్‌లో పేర్కొన్నాడు. దాదాపు 500-600 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న టెక్కీ ఓపెన్‌ఏఐ లింక్డ్ ప్రాజెక్టుతో ఒకే ఇంటర్వ్యూను పొంది విజయవంతంగా ఉత్తీర్ణత సాధించాడు. మొదట్లో ఏడాదికి రూ.3.6 లక్షలుగా ఉన్న ఆయన జీతం ఇప్పుడు నెలకు రూ.20 లక్షలకు చేరింది. రూ.లక్షల జీతంతో చేతిలో ఉద్యోగం ఉన్నా టెక్కీ మాత్రం ఆగడం లేదు. ఓపెన్‌ఏఐ లింక్డ్ ప్రాజెక్టు ద్వారా వచ్చే అదనపు డబ్బుతో సొంతంగా టెక్ సంస్థను ఏర్పాటు చేసుకునే పనిలో ఉన్నాడు. ఇది పూర్తయితే అతను తన లాంటి మరింత మందిని చేర్చుకుని పెద్ద ప్రాజెక్టులపై పనిచేయాలనుకుంటున్నాడు. మంచి కంపెనీల్లో సౌకర్యవంతమైన ఒక్క జాబ్ వస్తే చాలు స్థిరపడాలనుకుంటున్న యువతకు ఈ కుర్రాడు భిన్నంగా ఆలోచిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.



## రూ.60 లక్షలలోపు ధర ఉండే ఇళ్లకు ఆదరణ

- అద్దెను ఈఎంఐగా చెలిస్తే సొంతిల్లు సొంతం
- వెస్ట్ హైదరాబాద్ మినహా అన్ని వైపులా ఈ తరహా నిర్మాణాలు

**జనంసాక్షి:**గ్రేటర్‌లో సామాన్యుల సొంతింటి కల రోజురోజుకూ దూరమవుతున్న నేపథ్యంలో పలు నిర్మాణ సంస్థలు వాటిని చేరువ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. భూముల ధరలు పెరగడం, నిర్మాణ సామగ్రి, కార్మికుల వ్యయాల భారమవడం వంటి పలు కారణాలతో నగరంలో ఇళ్ల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అయినా పలు నిర్మాణ సంస్థలు ఇప్పటికీ పశ్చిమ హైదరాబాద్ మినహా ఇతర ప్రాంతాల్లో సామాన్య, మధ్యతరగతికి అందుబాటు ధరల్లో గృహాలను నిర్మిస్తున్నాయి. తక్కువ ధర అనో, ప్రీలాంచ్‌లోనో కొనుగోలు చేసి మోసపోకుండా.. కాస్త జాగ్రత్త వహిస్తే సొంతింటి కలను నెరవేర్చుకోవచ్చు.
రెండు బెడ్ రూములు, కిచెన్, హాల్, టాయిలెట్స్‌తో 700-800 చ.అ. విస్తీర్ణంలో ఉండే బడ్జెట్ హెూమ్స్‌కు ఇప్పటికీ ఆదరణ ఉంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నేపథ్యంలో హైదరాబాద్‌లో అఫర్డబుల్ హౌసింగ్ ప్రాజెక్ట్‌లకు గిరాకీ ఉంది. చిన్న వ్యాపారులు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, మధ్యస్థాయి ఉద్యోగులు వంటి సామాన్య, మధ్య తరగతి వర్గాలు ఎక్కువగానే ఉన్నారు. వీరు తమ సొంతింటి కలను బడ్జెట్ హెూమ్స్‌తో తీర్చుకుంటారు. అద్దెకు ఉండే బదులు అదే సొమ్మును నెలవారీ వాయిదా(ఈఐఎం) రూపంలో చెల్లిస్తే సొంతిల్లు సొంతమవుతుందనేది వారి కాన్సెప్ట్. దీంతో రూ.60 లక్షల లోపు ధర ఉండే అందుబాటు గృహాలకు డిమాండ్ పెరిగింది. 2-3 ఏళ్ల క్రితం వరకు కూడా దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే గృహాల ధరలు అందుబాటులో ఉండేవి. కానీ, హైరైజ్ అపార్ట్‌మెంట్లు, ఆధునిక వసతుల కల్పనలో బిల్డర్లు పోటీ పడుతుండటంతో రూ.కోట్లు వెచ్చిస్తేగానీ సొంతింటి కల సాకారం కాని పరిస్థితి. మాదాపూర్, నార్సింగి, నానక్‌రాంగూడ, కోకాపేట వంటి పశ్చిమ హైదరాబాద్ మినహా మిగిలిన మూడు జోన్లలో ఇప్పటికీ సామాన్యులకు రూ.60 లక్షల లోపు ధర ఉండే అఫర్డబుల్ గృహాలు దొరుకుతున్నాయి. ఇబ్రహీంపట్నం, నాగార్జున్‌సాగర్ రోడ్, హయత్‌నగర్, పోచారం, ఘట్‌కేసర్, కీసర, శామీర్‌పేట వంటి ప్రాంతాల్లో బడ్జెట్ హెూమ్స్ కొనుగోలు చేయవచ్చు. ఔటర్ లోపల ఉండే నివాస ప్రాంతాల్లోని గేటెడ్ కమ్యూనిటీల్లో ఎంపిక చేసుకోవడం ఉత్తమం. దీంతో ఇల్లు చిన్నగా అనిపించినా, చుట్టూ ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ వంటి విభాగాల నుంచి నిర్మాణ అనుమతులు, రెరా రిజిస్ట్రేషన్ ఉన్న ప్రాజెక్ట్‌లలోనే కొనుగోలు చేయాలి. పమోటర్లు, బిల్డర్ల పాత చరిత్ర చూడాలి. ప్రాజెక్ట్‌లను పూర్తి చేసే ఆర్థిక శక్తి నిర్మాణ సంస్థకు ఉందో లేదో పరిశీలించాలి. రోడ్డు, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి మౌలిక వసతులు ఉన్న ప్రాంతాల్లో కొనుగోలు చేయడం ఉత్తమం. బడ్జెట్ హెూమ్స్ ప్రాజెక్ట్‌లకు సమీపంలో విద్యాసంస్థలు, ఉపాధి అవకాశాలు ఉన్న ప్రాంతాలను ఎంచుకోవడం బెటర్.




# ఈయూకు పెరిగిన భారత డీజిల్ ఎగుమతులు

- ఆగస్టులో 137 శాతం జంప్


**జనంసాక్షి:**భారత్ నుంచి యురోపియన్ యూనియన్(ఈయూ)కు చేసే చమురు ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. ఏడాది ప్రాతిపదికన ఆగస్టు నెలలో 137 శాతం డీజిల్ ఎగుమతులు పుంజుకున్నాయి. ఇవి రోజుకు సుమారు 2,42,000 బ్యారెల్స్(బీపీడీ)కు చేరుకున్నాయి. 2026 జనవరిలో రష్యన్ క్రూడాయిల్ నుంచి శుద్ధి చేసిన ఉత్పత్తులపై ఈయూ నిషేధం విధించడమే ఇలా దేశీయ డీజిల్ ఎగుమతులు పుంజుకోవడానికి కారణమని తెలుస్తుంది. రష్యా నుంచి దిగుమతి చేసుకున్న చమురుతో శుద్ధి చేసిన ఉత్పత్తులపై ఈయూ ఆంక్షలు విధించింది. ఇవి వచ్చే ఏడాది జనవరి నుంచి అమల్లోకి రానున్నాయి. దానికి ముందే యురోపియన్ కొనుగోలుదారులు ఇంధన సరఫరాలపై ప్రభావం పడకుండా ఉండేందుకు జాగ్రత్త పడుతున్నారు. అందులో భాగంగా ఇండియా వంటి దేశాల్లో రిఫైనరీ కంపెనీలతో శుద్ధి చేసిన చమురు ఉత్పత్తులను సరఫరా చేయాలనేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. దాంతో ఇండియాలో ఈయూకు చేసే డీజిల్ ఎగుమతులు పెరిగాయి. రష్యా ఎగుమతులపై ఈయూ, జీ7 దేశాలు ధరల పరిమితి, ముడిచమురు ఆంక్షలు విధించాయి. దాంతో భారతీయ రిఫైనరీలు డిస్కౌంట్ ధరలకు రష్యా ముడి చమురును దిగుమతి చేసుకొని, శుద్ధి చేయడం, చట్టబద్ధంగా డీజిల్, జెట్ ఇంధనాన్ని యూరప్‌కు తరలించడం పెరిగింది. భారతీయ రిఫైనరీలు ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ, ఎంఆర్‌పీఎల్ ఈ ఎగుమతులను




పెంచడానికి డిస్కౌంట్ క్రూడ్‌ను భారీగా దిగుమతి చేసుకుంటున్నాయి. 2024 మొదటి మూడు త్రైమాసికాల్లో ఈయూకు ఇంధన ఎగుమతులు ఏడాది ప్రాతిపదికన 58% పెరిగాయి. రష్యన్ క్రూడ్ నుంచి శుద్ధి చేసిన ఉత్పత్తుల తయారీపై ఈయూ ఆంక్షలు విధించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాకు ఆదాయాన్ని తగ్గించేందుకు జీ7 దేశాలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ ఆంక్షలు 2026 జనవరి నుంచి అమల్లోకి రానున్నాయి. రవాణా, వ్యవసాయం, పరిశ్రమలకు డీజిల్ కీలకం. డీజిల్, డీజిల్ గ్రేడ్ క్రూడాయిల్ సరఫరాలో రష్యా అగ్రస్థానంలో ఉంది.

## ప్రభుత్వ బ్యాంకులకు రెండు రోజుల మంథన్

ప్రభుత్వరంగ బ్యాంకుల (పీఎస్‌బీలు) రెండు రోజుల మంథన్ కార్యక్రమాన్ని కేంద్ర ఆర్థిక శాఖ ఈ నెల 12, 13వ తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనుంది. ప్రభుత్వరంగ బ్యాంక్‌ల చీఫ్‌లు, ఇతర ముఖ్య అధికారులు ఇందులో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా తదుపరి తరం సంస్కరణలపై చర్చించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. చివరిగా 2022 ఏప్రిల్‌లో ఇదే తరహా కార్యక్రమం జరిగింది. సేవల అందుబాటును పెంచడం, అత్యుత్తమ సేవలకు సంబంధించి (ఈఏఎస్‌ఈ) సంస్కరణలను ఆర్థిక సేవల విభాగం మార్గదర్శకంలో చేపట్టొచ్చని పేర్కొన్నాయి. కస్టమర్ సేవలను ఎలా మెరుగుపరచాలి, డిజిటైజేషన్, హెచ్‌ఆర్ ప్రోత్సాహకాలు, కార్పొరేట్ గవర్నెన్స్, సహకారం విషయమైన తీసుకోవాల్సిన చర్యలను సూచించాలంటూ చివరి పీఎస్‌బీ మంథన్‌లో ఆరు వర్కింగ్ గ్రూప్‌లను ఏర్పాటు చేయడం గమనార్హం.




## ఐక్యరాజ్యసమితి సమావేశాలకు భారత్ దూరం

- అమెరికా అధిక టారిఫ్‌ల వేళ భారత్ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అమెరికా అధిక టారిఫ్‌ల వేళ భారత్ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులో అమెరికాలో జరగనున్న ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరు కావాల్సి ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఈ సమావేశాలకు మోదీ హాజరు కావడం లేదని తెలిసింది. ఆయనకు బదులు విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఈ సమావేశాల్లో ప్రసంగించనున్నట్లు తాజా సమాచారం. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. హై లెవల్ డిబేట్ మాత్రం సెప్టెంబర్ 23 నుంచి 29 వరకు జరగనున్నది. చర్చలో పాల్గొనే వక్తల జాబితాను తాజాగా యూఎన్ గత నెల రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. తొలుత బ్రెజిల్ చర్చను ప్రారంభిస్తుంది.


# ఉ.కొరియాలో 'అమెరికా ఆపరేషన్' విఫలమైన వేళ!

**జనంసాక్షి:**అమెరికా-ఉ.కొరియా మధ్య దౌత్య సంబంధాలు క్షీణస్థితిలో ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉత్తర కొరియాలో నిఘా పరికరాన్ని అమర్చేందుకు అగ్రరాజ్యం గతంలో ఓ ఆపరేషన్ చేపట్టిందట. అత్యంత రహస్య ఆపరేషన్లు నిర్వహించే నేవీ సీల్ బృందం దీనిని చేపట్టినట్లు సమాచారం. అయితే, ఆ సమయంలో కమాండోలు జరిపిన కాల్పుల్లో పలువురు ఉ.కొరియా పౌరులు మృతి చెందడంతో ఈ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేసినట్లు అమెరికా వార్తా సంస్థ ది న్యూయార్క్ టైమ్స్ తాజా కథనంలో పేర్కొంది. ఇదే అంశంపై మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ.. ఆ విషయాలేమీ తనకు తెలియదని చెప్పడం గమనార్హం. కిమ్ జోంగ్ ఉన్‌కు సంబంధించి ప్రైవేటు కమ్యూనికేషన్‌ను నిరోధించే ఓ ఎలక్ట్రానిక్ పరికరాన్ని ఉత్తర కొరియాలో అమర్చాలని అమెరికా భావించిందట. తద్వారా నిఘా సమాచారాన్ని వాషింగ్టన్‌కు అందజేయాలన్నది వారి లక్ష్యం. ఇటువంటి అత్యంత రిస్క్‌తో కూడిన మిషన్ చేపట్టాలంటే అధ్యక్షుడి ఆమోదం తప్పనిసరిగా ఉండాల్సిందే. అయితే, 2019లో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న ట్రంప్.. ఈ టాప్-సీక్రెట్ నేవీ సీల్ ఆపరేషన్‌కు ఆమోదం తెలిపారని సమాచారం. ఈ మిషన్‌కు సంబంధించి 25 మందికిపైగా అధికారులు, సైనిక సిబ్బందిని ఇంటర్వ్యూ చేసినట్లు న్యూయార్క్ టైమ్స్ కథనం పేర్కొంది. ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత అమెరికా-ఉ.కొరియా మధ్య 2018లో దౌత్య చర్చలు మొదలయ్యాయి. ఆ క్రమంలోనే కిమ్ సామ్రాజ్యంలో నిఘా పరికరాన్ని అమర్చాలనే ప్రణాళికను పెంటగాన్ రచించింది. ఇందుకోసం అణు సామర్థ్యం కలిగిన జలాంతర్గామిని ఉ.కొరియా తీరానికి పంపించి.. అక్కడ నుంచి రెండు మినీ సబ్‌మెరైన్ల ద్వారా ఒడ్డుకు చేరుకొని నిఘా పరికరాన్ని అమర్చాలనేది ప్లాన్. ఒసామా బిన్ లాడెన్‌ను మట్టుబెట్టిన 'రెడ్ స్క్వాడ్రన్' యూనిట్‌లోని సీల్ బృందానికి ఈ పనిని అప్పజెప్పింది. అత్యంత సున్నితమైన, రహస్య ఆపరేషన్‌లను చేపట్టేందుకు అమెరికా దీనిని 1980లో రూపొందించింది. ఉత్తర కొరియా ఆపరేషన్ కోసం ఇందులో ఉండే కమాండోలు కొన్ని నెలలపాటు రిహార్సల్స్ చేశారు. అయితే, ఉత్తరకొరియా సరిహద్దు ఆంక్షల కారణంగా డ్రోన్లు, ఇతర సాంకేతికత వినియోగించే అవకాశం లేకపోవడం 'సీల్'కు సవాలుగా మారింది. కేవలం శాటిలైట్ ఇమేజ్‌లపైనే ఆధారపడడంతో రియల్‌టైమ్ సమాచారం లభించే అవకాశం లేకుండా పోయింది. అయినప్పటికీ ఆపరేషన్‌కు నేవీ సీల్ ముందుకెళ్లింది. వియత్నాంలో (2019) కిమ్‌తో ట్రంప్ భేటీ అయ్యేందుకు సిద్ధమవుతున్న సమయంలోనే.. ఓ రోజు రాత్రి 'సీల్' తన ఆపరేషన్‌ను మొదలుపెట్టింది. నలుపురంగు సూట్‌లు, నైట్-విజన్ అద్దాలతోపాటు నిఘాకు చిక్కని ఆయుధాలు ధరించిన కమాండోలు అనుకున్న విధంగా తీరానికి చేరుకున్నారు. లక్ష్యాన్ని పూర్తిచేసే అదే సమయంలో వారికి ఓ ఊహించని పరిణామం ఎదురైంది. ఉత్తర కొరియాకు చెందిన ఓ చిన్న బోటు వారి సమీపానికి వచ్చింది. తమవైపు ఫ్లాష్‌లైట్‌లు వేయడంతో ముప్పు ఎదురైందని గ్రహించిన సీల్ బృందం వారిపై కాల్పులు జరిపింది. సెకన్లలోనే బోటులో ఉన్న వారు ప్రాణాలు కోల్పోయారు. దీంతో అప్రమత్తమైన 'సీల్'.. నిఘా పరికరాన్ని అమర్చకుండానే తమ ఆపరేషన్‌ను అక్కడితోనే ముగించినట్లు తాజా కథనం పేర్కొంది. 2005లో జార్జ్ డబ్ల్యూ బుష్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఇదే బృందం ఉ.కొరియాలో కోవర్టు ఆపరేషన్ చేపట్టిందట. అయినా ఇప్పటికీ దీనిపై ఎటువంటి బహిరంగ సమాచారం లేదు. అయితే, తాజా ఆపరేషన్ గురించి ట్రంప్ యంత్రాంగం అమెరికా కాంగ్రెస్‌లోని కీలక సభ్యులకూ తెలియజేయలేదని, ఇది ఆందోళనకర విషయమని తాజా కథనం వెల్లడించింది.



## ట్రంప్ కామెంట్లు.. మోదీ కీలక నిర్ణయం

**జనంసాక్షి:**నరేంద్ర మోదీ గొప్ప ప్రధాన మంత్రి అని, తనకు మంచి స్నేహితుడని, అయినా ఈ మధ్యకాలంలో ఆయన చేసిన పనులు ఎందుకనో నచ్చడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో.. ప్రధాని మోదీ తీసుకున్న ఓ కీలక నిర్ణయం తీవ్ర చర్చనీయాంశమైంది. ఐక్యరాజ్య సమితి సాధారణ అసెంబ్లీ వార్షికోత్సవ హైలెవల్ సెషన్‌కు హాజరై భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించాల్సి ఉంది. అయితే తాజాగా విడుదలైన ప్రసంగ కర్తల జాబితాలో ఆయన పేరు లేదు. ఆయన స్థానంలో విదేశాంగ మంత్రి జైశంకర్ పేరును చేర్చారు. దీంతో మోదీ ఉద్దేశపూర్వకంగానే ఆ పర్యటన నుంచి తప్పుకున్నారనే చర్చ జోరందుకుంది. సెప్టెంబర్ 9వ తేదీన ఐరాస సాధారణ అసెంబ్లీ 80వ సెషన్ ప్రారంభం కానుంది. "ఒక్కటిగా ఉన్నప్పుడు మెరుగ్గా ఉంటుంది.. శాంతి, అభివృద్ధి మానవ హక్కుల కోసం 80 సంవత్సరాలు.. అంతకంటే ఎక్కువ' అనే థీమ్‌తో ఈ ఏడాది



సెషన్ జరగనుంది. ఇక.. హైలెవల్ జనరల్ డిబేట్ సెప్టెంబర్ 23-29 తేదీల మధ్య జరగనుంది. ఆనవాయితీ ప్రకారం బ్రెజిల్ ఈ డిబేట్‌లో మొదట ప్రసంగించనుంది. అటుపై యూఎన్‌జీఏ పోడియంలో ప్రపంచ దేశాధినేతలను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించనున్నారు. రెండో దఫా అధ్యక్షుడు అయ్యాక ఐరాస నుంచి ఆయన ప్రసంగించడం ఇదే తొలిసారి కానుంది. జులైలో విడుదల చేసిన ప్రొవిజనల్ లిస్ట్‌లో భారత్ తరఫున ప్రధాని నరేంద్ర మోదీ హాజరై.. సెప్టెంబర్ 26వ తేదీన ప్రసంగిస్తారని ఉంది. అయితే తాజా లిస్ట్‌లో ఆయన పేరుకు బదులు జైశంకర్ పేరు చేరింది. సెప్టెంబర్ 27వ తేదీన భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ప్రసంగించనున్నారు. అంతకు ఒక్కరోజు ముందుగానే.. ఇజ్రాయెల్, చైనా, పాక్, బంగ్లాదేశ్ అధినేతలు ప్రసంగించనున్నారు. ఇదిలా ఉంటే.. భారత ప్రధాని నరేంద్ర మోదీ ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికాలో పర్యటించారు. అయితే.. 50 శాతం సుంకాల విధింపు తర్వాత ఆ పరిస్థితి పూర్తిగా మారింది. రష్యా చమురు, ఆయుధాల కొనుగోలు నేపథ్యంతో ట్రంప్ భారత్‌పై సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. తక్షణమే కొనుగోళ్లు ఆపాలంటూ అల్టిమేటం జారీ చేశారు. కానీ..ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ ప్రకటించారు. తాజా షాంగై సదస్సులో పుతిన్, జిన్‌పింగ్‌తో మోదీ దోస్తీపై ట్రంప్ తీవ్ర? అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత్, రష్యాలు అమెరికాకు దూరమై.. కుటిలమైన చైనాకు దగ్గరవుతున్నారనే ఆరోపణ గుప్పించారు. అయితే కొన్నిగంటలకే మాటమార్చా.. అలాంటిదేం లేదన్నారు. భారత్‌తో బంధం ప్రత్యేకమైందన్నారు. అదే సమయంలో.. భారత్-పాక్ ఉద్రిక్తతలను తానే ఫోన్ కాల్ చేసి చల్లార్చానంటూ ట్రంప్ ప్రకటించుకుంటూ వస్తుండగా.. భారత్ ఆ వాదనను తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ వ్యవహారం భారత్‌లో రాజకీయ దుమారానికి కూడా కారణమైంది. ఈ క్రమంలోనే కెనడాలో జరిగిన జీ7 సదస్సు నుంచి ట్రంప్ ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించి.. ప్రధాని మోదీ భారత్‌కు తిరిగి రావాల్సి వచ్చింది. ఇక కొత్త రక్షణ ఒప్పందం కోసం రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికాలో పర్యటించాల్సి ఉండగా.. అది వాయిదా పడింది. ఇప్పుడు ఐరాస కార్యక్రమానికి మోదీ గైర్హాజరు అవుతుండడం ట్రంప్ వైఖరికి నిరసనగానే అనే చర్చ సోషల్ మీడియాలో జోరుగా నడుస్తోంది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
07 సెప్టెంబర్ 2025

# నిబద్ధతతో పని చేస్తేనే వ్యవస్థ మనుగడ సాధ్యం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- గ్రామ పాలన అధికారులకు నియామక పత్రాలు పంపిణీ చేసిన కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 06(జనంసాక్షి):** నిబద్ధతతో పనిచేస్తేనే వ్యవస్థ మనుగడ సాధ్యం అవుతుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గ్రామ పాలన అధికారులకు నియామక పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ప్రభుత్వంలో చాలా కీలకమని, ప్రభుత్వ భూముల సంరక్షణ, ప్రైవేటు పట్టా భూముల రికార్డుల నిర్వహణ, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ల జారీ వంటి అనేక కీలక బాధ్యతలు మన వద్ద ఉంటాయని తెలిపారు. జిల్లాలో గ్రామ పంచాయతీలకు గ్రామ పాలన అధికారులను ప్రభుత్వం నియమించిందని, వీరు క్షేత్రస్థాయిలో ప్రజలకు నిబంధనల ప్రకారం మెరుగైన సేవలు అందించాలని, ఎక్కడా అవకతవకలకు పాల్పడటానికి వీలు లేదని స్పష్టం చేశారు. సిటిజన్ చార్ట్ ప్రకారం ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చూడాలని అన్నారు. క్షేత్రస్థాయిలో అదనపు కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసిల్దార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని , గ్రామ పాలన అధికారుల పనితీరు నిరంతరం పర్యవేక్షిస్తామని వివరించారు. మూడు సంవత్సరాల తర్వాత రెవెన్యూ శాఖకు గ్రామ పాలన అధికారుల రూపంలో విఆర్ఓ, విఆర్ఏ, జూనియర్ అసిస్టెంట్లు తిరిగి మాతృ శాఖ (రెవెన్యూ) రావడం జరుగుతుందని అన్నారు. నేడు నియామక పత్రాలు పొందుతున్న అభ్యర్థులు వెంటనే విధులలో చేరాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో కలెక్టరేట్ ఏఓ రామ్ రెడ్డి , జీ.పి.ఓ. లు తదితరులు పాల్గొన్నారు.

# మానవ సేవతోనే సమాజ వికాసం

- ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**మంథని, (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ 'మానవ సేవే – మాధవ సేవ' అనే భావనతో ముందుకొచ్చి తోటివారికి సాయం చేస్తేనే సమాజం పురోగమిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం బాచుపల్లిలో 'కామరాజు అన్నపూర్ణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'కాలేజ్ ఫీ రెన్యూవల్స్ ప్రోగ్రామ్ ఫర్ది అకడమిక్ ఇయర్ 2025–26, ఇంటరాక్ట్ విత్ స్టూడెంట్స్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'జనాభాకు అనుగుణంగా ప్రజల అవసరాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో కేవలం ప్రభుత్వాలు మాత్రమే కృషి చేస్తే సరిపోదు. సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలంటే సామాజిక బాధ్యతతో కూడిన ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి. ముఖ్యంగా కామరాజు అన్నపూర్ణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ లాంటి స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం. ఎంతో మందికి స్ఫూర్తిదాయకం' అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 'సమాజం మనకేమిచ్చిందన్నది కాదు, మనమేమిచ్చామన్నది ముఖ్యం. అన్నదానంతో పాటు విద్యాదానం చాలా ముఖ్యం. విద్య అనేది కేవలం ఒక డిగ్రీ కాదు, అది ఒక వ్యక్తి భవిష్యత్తును మార్చే శక్తి. ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో 300 మంది పేద విద్యార్థుల చదువుకు సాయం చేస్తుండటం నిజంగా ప్రశంసనీయం. అందరికీ ఆదర్శనీయం' అని కొనియాడారు. 'సామాజిక సేవ అంటే కేవలం డబ్బులు ఖర్చు చేయడం మాత్రమే కాదు. ఒక చిరునవ్వు, మంచి మాట, చిన్న సహాయం కూడా సేవే. ఇప్పుడు మనం చేసే మంచి పనులు మనతోనే ఆగిపోవు. అవి మన పిల్లలకు, భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలుస్తాయి' అని వివరించారు. 'మీకు ఏ రంగంలో ఆసక్తి ఉందో తెలుసుకోండి. అందుకు అనుగుణంగా ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోండి. ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి... గొప్ప విజయాలు అంత సులభంగా రావు. ఓపిక, పట్టుదల, నిరంతర కృషి అవసరం. ఎన్ని అడ్డంకులొచ్చినా లక్ష్య సాధనలో ధైర్యంగా ముందుకు సాగండి. తప్పకుండా విజయం సాధిస్తారు' అని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, కామరాజు అన్నపూర్ణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, ప్రణీత్ గ్రూప్ సీఎండీ నరేంద్ర కుమార్ కామరాజు, మాజీ ఎంపీ జీవీ ఎల్ నరసింహా రావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్, మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ, హౌసింగ్ శాఖలు నివేదికలివ్వాలి


**ఐడీఓసీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు**



**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 06 (జనంసాక్షి) :** జిల్లాలో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలు, గృహాల నష్టం వివరాల నివేదికలను త్వరగా అందివ్వాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని పలు శాఖల కార్యాలయాలను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వ్యవసాయ, హౌసింగ్ కార్యాలయాలను సందర్శించి, ఆ శాఖల పనితీరును సమీక్షించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో జరిగిన పంట నష్టం వివరాలకు సంబంధించి రూపొందించిన నివేదికలు పరిశీలించారు. బాధిత రైతులకు ప్రభుత్వపరంగా సహాయం అందేలా పక్కాగా పంట నష్టం వివరాలు పొందుపర్చాలని సూచించారు. భారీ వర్షాల వల్ల సంభవించిన వరదల కారణంగా సిరికొండ, ధర్పల్లి, భీమ్గల్, ఇందల్వాయి, వేల్పూర్, వర్ని మండలాలలో పలు పంట పొలాల్లో ఇసుక మేటలు వేసిందని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈజీఎస్ కూలీలచే ఈ ఇసుక మేటలు తొలగింపజేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ.ఓలు, ఏ.ఈ. ఓలు, ఇతర వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇసుక మేటలు వేసిన పంట భూముల వివరాలను ఉపాధి హామీ అధికారులకు అందిస్తే, వారు ఈజీఎస్ కూలీలచే ఇసుక మేటలు తొలగింపజేస్తారని, పరస్పర సమన్వయంతో రైతులకు ప్రయోజనం చేకూరేలా చూడాలన్నారు. ఈజీఎస్ కాంపోనెంట్ కింద అన్ని జీపీల పరిధిలో విరివిరి గా పనులు గుర్తిస్తూ, వాటిని చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డీఆర్డీఓ సాయాగౌడ్ ను ఆదేశించారు. తద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. హౌసింగ్ శాఖను తనిఖీ చేసిన సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిని సమీక్షించారు. మంజూరీ తెలుపబడిన లబ్ధిదారులు అందరూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసుకునేలా పర్యవేక్షణ జరపాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల వివిధ దశలను అనుసరిస్తూ లబ్దిదారులకు వెంటదివెంట బిల్లులు వారి ఖాతాలలో జమ అయ్యేలా చూడాలన్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జె.గోవిందు, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, ఈ.ఈ నివర్తి ఉన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయం సందర్శన కాగా, నిజామాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయాన్ని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శని వారం సందర్శించారు. కార్పోరేషన్‌లోని వివిధ విభాగాల పనితీరు గురించి కమిషనర్ దిలీప్‌కు మార్‌తో సమీక్షించారు. నగర పాలక సంస్థ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు



**నిజంసాగర్ సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** బడుగు బలహీనవర్గాల అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన కొనసాగుతుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. శనివారం నాడు నిజాంసాగర్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. నిజంసాగర్ మండలానికి 11 మహమ్మద్ నగర్ మండలానికి 23 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపించేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉండి సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి అందిస్తుందని అన్నారు. వివిధ కారణాలచే ఆసుపత్రుల్లో చికిత్స పొందినటువంటి బాధితులకు రాష్ట్రంలోనే అత్యధికంగా ఎల్ఓసిలను జుక్కల్ నియోజకవర్గానికి అందించామని అన్నారు. గత ప్రభుత్వంలో ఏ ఒక్కరికి రేషన్ కార్డులు అందించకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేసారని కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులను అందించి ప్రతి కుటుంబంలో సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో జరుగుతున్నటువంటి అభివృద్ధిని ఓర్వలేక బీఆర్ఎస్ పనిగట్టుకుని ప్రజల్లో లేనిపోని అపోహలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి కెసిఆర్ ప్రభుత్వం వందల కోట్లు దుర్వినియోగం చేశారని అన్నారు. కేసీఆర్ కుటుంబం మొత్తం తెలంగాణను నిలువు దోపిడీ చేసిందని అన్నారు. వారు అవినీతి చేయకపోతే కాళేశ్వరంపై సిబిఐ విచారణను ఎందుకు వద్దంటుందని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండే నిజ నిజాలు తెలుసుకోకుండా ధర్నాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. జుక్కల్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూములు ఇవ్వకుండా పక్క నియోజక వర్గమైన బాన్సువాడకు హనుమంతు షిండే డబ్బులకు అందించారని అన్నారు. రానున్న స్థానికైనకలలో కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ సైనికుల్లా పని చేసే పార్టీ అభ్యర్థులను 100% గెలిపించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిట్లం ఏఎంసి చైర్మన్ చికోటి మనోజ్ కుమార్, నిజాంసాగర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, మహ్మద్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, తాసిల్దార్ బిక్షపతి, మండల కాంగ్రెస్ నాయకులు అనీస్ పటేల్, మల్లయ్య గారి ఆకాష్, ప్రజాపం డరి,మల్లూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఒంటరి శ్రీనివాస్ రెడ్డి, పెద్ది అంజయ్య, బింగి శ్రీధర్, శేఖర్, బుడిమే శ్రీనివాస్, గొల్ల హనుమాన్లు, నారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవానికి కేంద్రమంత్రులు రాక

– సన్నాహక సమావేశంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు



**హైదరాబాద్ సెప్టెంబర్ 06 (జనంసాక్షి) :**తెలంగాణ విమోచన దినోత్సవం 2025ను విజయవంతంగా నిర్వహించడానికి హైదరాబాద్ లోని బర్కత్ పురా సిటీ ఆఫీసులో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెప్టెంబర్ 17 వేడుకల కోసం సమగ్ర ప్రణాళిక, భద్రతా ఏర్పాట్లు, కంటోన్మెంట్ పార్కులో దివంగత మాజీ ప్రధాని వాజ్ పేయి విగ్రహ ఆవిష్కరణ, ఇతర కార్యక్రమాల షెడ్యూల్ గురించి దిశానిర్దేశం చేశారు. నిజాం, రజాకార్ల నుంచి విముక్తి పొందిన సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు నిరాకరిస్తూ వచ్చాయి. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బిజెపి అనేక పోరాటాలు చేస్తూ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం విస్మరించినప్పటికీ తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు కేంద్ర ప్రభుత్వం 2022 నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17న అధికారిక తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను నిర్వహిస్తోంది. 2022, 2023లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా గారు, 2024లో జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ ఏడాది కూడా కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అధికారికంగా నిర్వహించనుంది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పాల్గొని జాతీయ జెండా ఎగరవేయనున్నారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర సాంస్కృతిక–పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మహారాష్ట్రకు చెందిన మంత్రులు, రాష్ట్ర పార్టీ నాయకులు పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించి జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా తెలంగాణ స్వాతంత్ర్య పోరాట యోధుల గాథలను, ఉద్యమ కథలను వివరిస్తూ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు. పరేడ్ గ్రౌండ్ సమీపంలోని కంటోన్మెంట్ పార్కులో దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ చేయనున్నారు. స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సన్మానించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనిర్వహిస్తున్న ఈ వేడుకలకు బిజెపి – తెలంగాణ పూర్తిగా సహకరిస్తోంది. వీటితో పాటు పార్టీ పరంగానూ అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది.

# కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్



**యైటింక్లయిన్ కాలనీ సెప్టెంబర్ 06 (జనంసాక్షి) :** సింగరేణి, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు బీ. అశోక్ యాజమాన్యాన్ని కోరారు. శనివారం వివిధ డిపార్టుమెంటులో కాంట్రాక్టు కార్మికులను, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. మన రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ ప్రైవేటు విభాగాల్లో ప్రధానంగా సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్.ఎఫ్.సి.ఎల్, గ్రామపంచాయతీ, మున్సిపల్, ప్రభుత్వ హాస్పిటల్ ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ కార్మికులతోపాటు స్కీం వర్కర్స్ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నార న్నారు . వేతనాలు, ఉద్యోగ భద్రత, పని గంటల భారం, పని స్థలాల్లో రక్షణ. తదితర సమస్యల పరిష్కారానికి హైదరాబాదులో జరిగే ఐఎఫ్టీయూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆనంతరం పోస్టరును ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నాయకులుకు ఒదారపు శారద, రామగిరి మదనమ్మ మేరీ, వనమాల ములకల లింగయ్య, రాయమల్, గుడిసెల కొమరమ్మ, .పాల్గొన్నారు.

# నిమజ్జనోత్సవంలో హైడ్రా భాగస్వామ్యం




**హైదరాబాద్, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** నగరంలో శనివారం జరుగుతున్న గణపతి నిమజ్జ నోత్సవంలో హైడ్రా భాగస్వామ్యం అయ్యింది. హుస్సేన్ సాగర్ వద్ద జరుగుతున్న ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పర్యవేక్షించారు. హుస్సేన్ సాగర్ వద్ద ఏర్పాటు చేసిన హైడ్రా కంట్రోల్ రూమ్ నుంచి నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలించారు. నేరుగా ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. హైడ్రా అడిషనల్ కమిషనర్ ఎన్ అశోక్ కుమార్, హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్యతో పాటు హైడ్రా డీఆర్ఎఫ్ అధికారులు జయప్రకాష్, యజ్ఞ నారాయణ, గౌతం, మోహన్ తో పాటు డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.హుస్సేన్ సాగర్లో బోటులో తిరుగుతూ హైడ్రా సిబ్బంది గస్తీ కాస్తున్నారు.

# 43 మంది జేఎంఈటీ ట్రైనీల జీవితాల్లో వెలుగులు

- పునర్నియామకానికి ఉత్తర్వులు జారీ
- క్రమశిక్షణతో పనిచేస్తూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ సూచన



**గోదావరిఖని, (జనంసాక్షి):** సింగరేణి సంస్థలో జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలుగా (జేఎంఈటీ) చేరి వివిధ కారణాలతో టర్మినేట్ అయిన 43 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవడానికి వీలుగా సింగరేణి యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ శ్రీ ఎన్.బలరామ్ ఆదేశాల మేరకు వారికి మరొక అవకాశాన్ని కల్పించేలా ఉత్తర్వులు విడుదల అయ్యాయి. గతంలో వీరంతా విధులకు గైర్హాజరు కావడం, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించకపోవడం వల్ల విధుల నుంచి తొలగించడం జరిగింది. అయితే వీరిని తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై ఇటీవల డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్, సింగరేణి యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం అయిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటియూసి) కు మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఈ నేపథ్యంలో వీరిని తిరిగి విధుల్లోకి తీసుకోవడానికి వీలుగా యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా టర్మినేట్ అయి పునర్నియామకం పొందుతున్న 43 మంది జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలకు ఇది తాజా నియామకంగా గుర్తించడం జరుగుతుంది.

**– వీరంతా సంస్థ ఏర్పాటు చేసే హై పవర్ కమిటీ ముందుకు వెళ్లి తమ వివరాలు, ఓవర్ మెన్ సర్టిఫికెట్, గ్యాస్ టెస్టింగ్ ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లు మొదలైనవి సమర్పించవలసి ఉంటుంది.**

**– అనంతరం ఆ కమిటీ సూచన మేరకు మెడికల్ ఫిట్ నెస్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. దాని ఆధారంగా ప్రాథమిక అపాయింట్మెంట్ ఆర్డర్లు జారీ చేస్తారు.**

**– తిరిగి ఉద్యోగంలో చేరిన జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలు తమ మొదటి సంవత్సరంలో తప్పనిసరిగా కనీసం 190 మస్టర్లకు తగ్గకుండా విధులు నిర్వహించాలి.**

**మరో అవకాశం రావడం అదృష్టం.. కష్టపడి పనిచేయండి :** ఈ ఒప్పందం ప్రకారం 24.07.2025 నాటికి టర్మినేట్ అయిన జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీల (జేఎంఈటీ) వయసు 45 సంవత్సరాల కంటే తక్కువ ఉండి , హైపర్ కమిటీలో దరఖాస్తు చేసుకొని మెడికల్ టెస్టులలో ఫిట్ అయినవారికి జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ ( జేఎంటి), టి అండ్ ఎస్ గ్రేడ్ – సీ గా పునర్నియామక పత్రాలను త్వరలో అందజేస్తామని సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్ తెలియ జేశారు. తిరిగి ఉద్యోగాల్లో చేరుతున్న వీరంతా క్రమశిక్షణతో పనిచేసి వచ్చిన మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పోటీ మార్కెట్ లో ఉద్యోగాలను సాధించడం అతి కష్టంగా ఉంటోందని, అలాంటి సమయంలో ఒకసారి తొలగింపునకు గురైనప్పటికీ మరో విలువైన అవకాశం ఇస్తున్న కంపెనీకి ఉత్తమ సేవలు అందించాలని కోరారు.


# సీతారామ ప్రాజెక్టులో భూమి కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి

**జగిత్యాల సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం**



**మేడిపల్లి,సెప్టెంబర్ 06(జనంసాక్షి):** దేశాయిపేట గ్రామంలో సర్వేనెంబర్ 890, 804 సుమారుగా 339 ఎకరాల వ్యవసాయ భూమి , సర్వే నెంబర్ 437 రాజలింగంపేట గ్రామంలో 100 ఎకరాల భూమి సీతారామ ప్రాజెక్టు నష్టపరిహారంలో భాగంగా ఈ గ్రామాలలో వ్యవసాయ రైతుల భూమిని ఫారెస్ట్ వారికి అన్యాక్రాంతంగా అప్పగించిన దువలన సిపిఐ కార్యదర్శి విశ్వనాథం నిరసన తెలియజేయడం జరిగింది.రైతులకు రైతు భీమా, రైతు భరోసా గత 6 సంవత్సరాల నుండి రావడం లేదు అని,వడ్లు అమ్మకాలు జరిగేటప్పుడు ఐకెపి,పిఏసిసి సెంటర్‌లలో రైతులు వడ్లు అమ్మ డానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మునుగురు హనుమంతు భీమారం మండలం సిపిఐ పార్టీ మండల కార్యదర్శి కొండా రాజయ్య గుగ్గిల మల్లేశం గంగరాజం మారు రాజిరెడ్డి తాజా మాజీ సర్పంచ్ నాంచారి స్వప్న రాజేందర్ బీసీ సంక్షేమ సంఘం భీమారం మండలం ఉపాధ్యక్షులు లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థినికి ప్రతిష్టాత్మక గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** : విద్యార్థులకు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించడమే కాకుండా వాటిలో పాల్గొనేదెందుకు తగినటువంటి ప్రోత్సాహాన్ని అందించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాలలో విద్యార్థిని అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కళల పట్ల అవగాహన పెంపొందించి వివిధ కళా ప్రదర్శనలలో పాల్గొనేందుకు ఆసక్తిని పెంపొందించడమే కాకుండా వాటిలో పాల్గొని విజేతలుగా నిలవాలని వారు కోరారు. ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్లో భారత్ ఆడ్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో సుమారు 4500 మంది విద్యార్థుల పైగా వారితో నిర్వహించినటువంటి కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాఠశాల చెందినటువంటి గజబింకార్ శ్రీనిత్య, ఆరో తరగతి, సుమారు 4500 మంది కళాకారులతో నిర్వహించినటువంటి కూచిపూడి నృత్య ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కాకుండా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకోవడం చాలా హర్షించదగ్గ విషయమని విద్యార్థినికి పుష్పగుచ్ఛంతో పాటు జ్ఞాపికలను ప్రధానం చేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు రాజన్న ఆలయం మూసివేత



**రాజన సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా నేడు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయాన్ని మూసివేయనున్నారు. ఆదివారం 11.25 గంటల నుండి సోమవారం తెల్లవారు జామున 3.45 గంటల వరకు ఆలయ మూసి వేయనున్నట్లు ఆలయాధికారులు, అర్చకులు తెలిపారు. ఆదివారం శ్రీ స్వామి వారికి పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం 11.30 కు ఆలయం మూసివేసి సోమవారం గ్రహణ మోక్షం అనంతరం వేకువ జామున 3.45 గంటలకు ఆలయ సంప్రోక్షణ ఆలయ శుద్ధి, స్వామివారికి ప్రాతఃకాల పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతిస్తామన్నారు. ఆదివారం రాత్రి 9 గంటల 56 నిమిషాలకు ప్రారంభమై 1:26 నిమిషాల వరకు దాదాపు మూడున్నర గంటల పాటు రాహు గ్రస్త చంద్రగ్రహణం ఉంటుందని, శతభిష, పూర్వాభద్ర నక్షత్రం, కుంభ రాశి వారు గ్రహణాన్ని చూడ కూడదన్నారు. గ్రహణ మోక్ష అనంతరం తమకు తోచిన విధంగా దానాలు నిర్వహించాలని, పిల్లలు వృద్ధులు, గర్భిణీలు జాగ్రత్తలు పాటించాలని ఆలయ అర్చకులు తెలిపారు.

# బ్యాక్ వాటర్‌తో నష్టపోయిన పత్తి పంట



**మహదేవపూర్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** గరవారం రోజుల క్రితం ఎగువన కురుసినబారి వర్షలకు అన్నారం సరస్వతి బారేజ్ బ్యాక్ వాటర్ పత్తిచేన్లలోకి చేరడంతో పత్తి పంట నీటిలో మునిగిపోయింది. సుమారు మూడురోజులు పత్తి పంట నీటిలో మునుగడంతో పత్తి చేట్లకు కాసిన కాయలతో పాటు సహా చేట్లని చనిపోవడం జరిగింది.ప్రభుత్వ ఆదేశాలమేరకు. మండల వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం అన్నారం, చంద్రుపల్లి, నాగేపల్లి, పల్గుల, గ్రామాల్లోని పంట నష్టపోయిన రైతుల పంట చేన్లు సుమారు 300 ఎకరాలు సర్వే చేయడం జరిగిందని తెలిపారు.





పటాన్‌చెరు నియోజకవర్గం.. రాజధాని హైదరాబాద్‌కు ఆనుకొని వేగంగా విస్తరిస్తున్న ప్రాంతం. ఇక్కడ వివిధ ప్రాంతాల్లో ఉన్న పారిశ్రామికవాడలు , ఐటీ కారిడార్‌కు దగ్గరగా ఉండటంతో పట్టణీకరణ జరిగి జనాభా క్రమంగా పెరుగుతోంది. పటాన్‌చెరు, అమీన్‌పూర్, ఆర్‌సి పురం, తెల్లపూర్, బొల్లారం, ఇస్నాపూర్ ప్రాంతాల్లో పెద్దఎత్తున కొత్త కాలనీలు, భారీ అపార్ట్ మెంట్స్‌తో విస్తరణ జరుగుతున్నాయి. ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని అమీన్ పూర్, తెల్లపూర్, బొల్లారం మున్సిపాలిటీని, ఓఆర్ఆర్ లోపలి గ్రామాలను జిహెచ్ఎంసీ పరిధిలో ఇటీవల విలీనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఐదు కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడం బాగానే ఉన్నా.. విస్తరిస్తున్న కాలనీలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన జరగడం లేదు. జిహెచ్ఎంసీకి, హెచ్ఎండీఏకు పటాన్‌చెరు ప్రాంతం నుండి పెద్దఎత్తున వివిధ రుపాల్లో ఆదాయం సమకూరుతున్నా అనుకున్న మేర పురోగతి లేకపోయింది. ప్రత్యేకతలకు ఆలవాలమైన ఈ కేంద్రంలో మంత్రులు దృష్టి పెట్టడం లేదు. ప్రజాపాలన ఏర్పడి ఏడాదిన్నర గడిచిపోయినప్పటికీ మంత్రులు ఒకట్రెండు సార్లకు మించి పర్యటించలేదంటే అతిశయోక్తి కాదేమో..!




# ఎవ్వరికీ పట్టని చెరువు
# ఆదరణ కరువు

## పటాన్‌చెరు నియోజకవర్గంలో అడుగుపెట్టని మంత్రివర్యులు

- జిల్లా మంత్రి దామోదర రాజనరసింహా సైతం పర్యటించని వైనం
- పార్టీలోని గ్రూపు రాజకీయాలూ.. లుకలుకలూ కారణమా..?
- మంత్రుల పర్యటనలు లేక ఆగిన అభివృద్ధి కార్యక్రమాలు
- ఆదాయం దండిగా ఉన్నప్పటికీ మౌలిక వసతులు మృగ్యం




**చాడ వేణుగోపాల్ రెడ్డి (జనంసాక్షి ప్రత్యేక ప్రతినిధి)**

ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి మంత్రిగా ఉన్న ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన నుంచి ఇప్పటివరకు ఒక్క సందర్భంలో మాత్రమే పటాన్‌చెరు నియోజకవర్గంలో పర్యటించారు. 2024 బడి బాట కార్యక్రమం భాగంగా అమీన్‌పూర్ మున్సిపాలిటి పరిధిలోని బంధంకొమ్ము ప్రభుత్వ పాఠశాలలో పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్న మంత్రి.. పటాన్‌చెరువైపు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. నిత్యం హైదరాబాద్ నుండి తన సొంత నియోజకవర్గం అందోల్‌తో పాటు సంగారెడ్డి జిల్లా పర్యటనకు పటాన్‌చెరు మీదుగానే వెళ్తున్న ఆయన.. ఇక్కడ ఎలాంటి కార్యక్రమాలకూ ఆసక్తి చూపడం లేదు. స్థానిక సమస్యలు, అభివృద్ధి వంటి అంశాలను కేబినెట్‌లో చర్చించి నిధులు, ప్రాజెక్టులు తెస్తారని ఆశగా చూస్తున్న నియోజకవర్గవాసులకు నిరాశ తప్పడం లేదు. సిగాచి ప్రమాదం జరిగినప్పుడు వారం రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన ఆయన.. ఆ తర్వాత ఏ ఒక్కసారీ రాలేకపోయారు. అప్పుడు ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న కొండా సురేఖ బీసీ కులగణనకు చిట్కూల్ గ్రామంలో సర్వేను పర్యవేక్షించారు. ఇప్పుడు ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి కూడా పటాన్‌చెరువైపు వచ్చిందే లేదు.

**సమీక్షలు గాలికి.. ఏదీ పురోగతీ..?**

మంత్రులు తరచూ పర్యటించినప్పుడే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చురుగ్గా సాగుతాయి. కిందిస్థాయి అధికారి మొదలు ఉన్నతాధి కారులు ప్రత్యక్షంగా మంత్రుల పర్యటనలో ఉంటారు గనుక వారి ఆదేశాలు వేగంగా అమల్లోకొచ్చే చర్యలు చేపడుతుంటారు. సమీక్షల వల్ల సంబంధిత శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తుంటారు. అయితే, పటాన్‌చెరులో మంత్రుల జాడే లేకపోవడం వల్ల వివిధ శాఖాధికారులు ఎలాంటి గమ్యమూ, లక్ష్యమూ లేకుండా నామ మాత్రంగా పనిచేస్తున్నారు. సరైన ప్రణాళిక లేకుండా తోచింది చేసుకుంటూ వెళ్తున్నారు. లక్షలాది కుటుంబాలు నివాసముంటున్న పటాన్‌చెరు ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు భారీ ప్రణాళికలు, నిధులు అవసరం. ముఖ్యంగా కొత్తగా వస్తున్న కాలనీలు, అపార్టుమెంట్లకు రోడ్డు, డ్రెయినేజీ, తాగునీరు వంటి సదుపాయాలు మిక్కిలి అవశ్యం. వివిధ ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా కారణంగా విపరీతంగా ట్రాఫిక్ హెచ్చుతోంది. కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి. కోట్లాది రూపాయలు పన్నులు చెల్లిస్తున్న ఈ ప్రాంతంలో ఇవేవీ మచ్చుకైనా జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### స్థానిక రాజకీయాల్లో అనిశ్చితి.. వర్గపోరు!

2023 ఎన్నికల్లో పటాన్‌చెరులో బీఆర్ఎస్ తరపున గూడెం మహిపాల్ రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి కాట శ్రీనివాస్ గౌడ్‌పై ఆయన గెలుపొందగా.. బీఎస్పీ తరపున పోటీచేసిన నీలం మధు సైతం భారీగా ఓట్లు సాధించాడు. తదనంతరం కాంగ్రెస్ సర్కారు కొలువుదీరగానే ఎమ్మెల్యే గూడెం హస్తంగూటికి చేరిపోయారు. లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ అభ్యర్థిగా నీలం మధు నిలబడ్డప్పటికీ.. అప్పటికే నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వర్సెస్ ఎంపీ అభ్యర్థి అన్నట్టుగా వర్గాలు తయారయ్యాయి. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యే గూడెం.. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని ఆరోపణలొచ్చాయి. ఈ క్రమంలోనే ఇంచార్జి కాట శ్రీనివాస్ వర్గం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుపై దాడిచేయడం సంచలనంగా మారింది. పీసీసీ కమిటీ వేసి సమస్యలను సద్దుమణిగించినా.. ఇప్పటికే మూడు గ్రూపుల్లో కుతకుతలు కొనసాగుతున్నాయి. ఈ మూడు గ్రూపుల వల్ల ప్రభుత్వం, పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. ప్రొటోకాల్ రగడ, గ్రూపు తగాదాల పంచాయితీ తరచూ గాంధీభవన్‌కు చేరడం ఆనవాయితీగా మారింది. దీంతో పటాన్‌చెరులో ప్రోగ్రాం అంటేనే మంత్రులకు మనకెందు కులే ఈ గొడవ అన్నట్టుగా తయారైంది. ఈ పరిణామాలు నియోజకవర్గ అభివృద్ధికి ఆటంకంగా మారాయని స్థానికులు ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా మంత్రి చొరవ చూపి సమన్వయం మెరుగుపరిచి పటాన్‌చెరు నియోజక వర్గాన్ని అభివృద్ధి బాట పట్టించాలనే విజ్ఞప్తులు వస్తున్నాయి.

## త్వరలో బీసీసీఐ ఎన్నికలు

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఎన్నికల తేదీ ఖరారైంది. సెప్టెంబర్ 28న జరిగే వార్షిక సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11:30 గంటలకు ఈ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మీటింగ్‌లో ఎన్నికల ప్రక్రియపై చర్చించను న్నారు. సెప్టెంబర్ రెండో వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని సమాచారం. ఇటీవల బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ వయసు 70 ఏళ్లు దాటడంతో పదవీ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో కార్య దర్శిగా ఉన్న రాజీవ్ శుక్లా మధ్యంతర అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవుల కోసం ఎన్నికలు జరగను న్నాయి. ఈ సమావేశంలో అపెక్స్ కౌన్సిల్, ఐపీఎల్, డబ్ల్యూపీఎల్ కోసం గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటుపై కూడా చర్చించనున్నారని తెలుస్తోం ది. అపెక్స్ కౌన్సిల్‌లో బీసీసీఐ సాధారణ కార్యవర్గం నుంచి ఒక సభ్యుడు, భారత క్రికెట్ అసోసియేషన్ నుంచి ఇద్దరు సభ్యులు ఉంటారని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.

## భూ క్రయ, విక్రయాల ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన జారీ చేయడం ఏమనగా.. నేను **అమర్ ఖాన్ తండ్రి మోహిన్ అహ్మద్ ఖాన్,** ఆధార్ నెంబర్ 4003 2976 8756, గ్రామం గుంజేట్టి, మండలం న్యాల్ కల్, జిల్లా సంగారెడ్డి, తెలంగాణ. నా పేరున గల సర్వే నెం 107 ఓ లో 1 ఎకరా, 107 ఓ 2 లో 1 ఎకరా, 107 ఓ 3లో 10 గుంటల పట్టా భూమిని.. **శ్రీమతి షబానా బేగం భర్త గులాం అసద్ అహ్మద్,** పట్టణం / పంచాయతీ జల్పల్లి, ఇంటి నెంబర్ 2-246/1, ఆధార్ నెంబర్ 7273 2893 4573, జిల్లా కే.వి రంగారెడ్డి, తెలంగాణ వారికి విక్రయించడం జరిగింది. క్రయ విక్రయాల నేపథ్యంలో ఎవరికైనా ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ చరవాణి నెంబర్ 7799877571కు నేరుగా సమాచారం లేదా ఫిర్యాదు చేసుకోవడంలో ఇలాంటి అభ్యంతరం లేదని ప్రకటనను జారీ చేయడం జరిగింది.

# వికెట్ కీపర్‌గా జితేశ్



ఆసియా కప్ కోసం టీమ్ ఇండియా తుది జట్టు కూర్పు గురించి మ్యాచ్ ముందు వరకు స్పష్టత ఉండదు, కానీ అభిమానులు, విశ్లేషకులు తమ సలహాలు ఇస్తుంటారు. పరిస్థితులకు తగ్గట్టుగా కెప్టెన్, కోచ్ జట్టును ఎంపిక చేస్తారు. ఈ నేపథ్యంలో ఆసియా కప్ కోసం భారత జట్టు తుది ×పై కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం, అయితే ఇవి అధికారికం కాదు. జితేశ్ శర్మను ప్రధాన వికెట్ కీపర్‌గా తీసుకోవచ్చని, ఈ సందర్భంలో సంజు శాంసన్‌ను బ్యాటర్‌గా పరిగణించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ కూర్పుతో జట్టు బరిలోకి దిగితే లోయర్ ఆర్డర్‌లో రింకు సింగ్‌కు అవకాశం తగ్గే అవకాశం ఉంది. ఐపీఎల్‌లో ఫినిషర్‌గా జితేశ్ అద్భుత ప్రదర్శన చేయడం కలిసొచ్చే అంశం. టాప్ ఆర్డర్‌లో అభిషేక్ శర్మ, సంజు శాంసన్ లేదా శుభ్‌మన్ గిల్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ ఉండే అవకాశం ఉంది. జితేశ్ శర్మ మిడిల్ ఆర్డర్‌లో ఆడవచ్చని సమాచారం. ఆ తర్వాత ఆల్‌రౌండర్ల కోటాలో హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్ తప్పకుండా ఉండొచ్చు. ఇలా ఎనిమిది స్థానాలు ఖరారవుతాయి. మిగిలిన మూడు స్థానాల్లో ఇద్దరు ఫాస్ట్ బౌలర్లు, ఒక స్పెషలిస్ట్ స్పిన్నర్‌కు అవకాశం ఇవ్వాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఈ లెక్కన రింకు సింగ్, శివమ్ దూబెలకు తుది జట్టులో చోటు దక్కడం కష్టమే. టాప్ ఆర్డర్‌లో మార్పులు జరిగితేనే వీరికి అవకాశం దక్కే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ఆసియా కప్ ఫైనల్‌కు భారత్‌తో పాటు శ్రీలంక చేరుకుంటుందని మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా అంచనా వేశాడు. శ్రీలంక ఆసియా కప్‌ను ఆరుసార్లు గెలిచిందని, ఈసారి వారి జట్టు కూడా బలంగా ఉందని, అందుకే ఫైనల్‌కు చేరుకుని భారత్‌తో టైటిల్ కోసం పోటీపడుతుందని చోప్రా వ్యాఖ్యానించాడు.

## యాంకర్ యేషా సాగర్‌తో రింకూ సింగ్ ముచ్చట్లు

రింకు సింగ్ ఆసియా కప్ కోసం దుబాయ్ చేరుకున్నాడు. కానీ, అక్కడికి వెళ్లే ముందు, ఈ సిక్సర్ కింగ్ యూపీ టీ20 లీగ్‌లో మీరట్ మావెరిక్స్ జట్టు తరపున ఆడుతున్నాడు. అక్కడ అతని ప్రదర్శన అద్భుతంగా ఉంది. అయితే, మొదటి క్వాలిఫయర్ మ్యాచ్‌లో, అతని జట్టు కాశీ రుద్రాస్ చేతిలో 5 పరుగుల తేడాతో ఓడిపోయింది. రింకు సింగ్ జట్టును గెలిపించడానికి తీవ్రంగా ప్రయత్నించాడు. అతను 23 బంతుల్లో 40 పరుగులు కూడా చేశాడు. కానీ చివరి ఓవర్‌లో అతని వికెట్‌తో మీరట్ మ్యాచ్ ఓడిపోయింది. మ్యాచ్ ముగిసిన తర్వాత, యూపీ టీ20 లీగ్ యాంకర్ యేషా సాగర్ రింకు సింగ్‌తో మాట్లాడింది. ఈ సమయంలో భారత ఆటగాడు అద్భుతమైన సమాధానం ఇచ్చాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఓటమి తర్వాత యేషా సాగర్ రింకు సింగ్‌తో మాట్లాడింది. దీనిపై రింకూ మాట్లాడుతూ, 'మేం మిడిల్ ఓవర్లలో బ్యాటింగ్ చేయడంలో విఫలమయ్యాం. నేను బ్యాటింగ్ చేయడానికి వెళ్ళినప్పుడు, ప్రతి బంతిని బౌండరీ తరలించాల్సి వచ్చింది. కానీ, అదృష్టం మాతో లేదు. పవర్ ప్లేలో బ్యాటర్స్ విఫలమయ్యారు. లేదంటే, మేం మ్యాచ్ గెలవగలిగేవాళ్ళం' అంటూ తెలిపాడు.

# చరిత్ర సృష్టించిన అల్కరాజ్, సిన్నర్

### వరుసగా మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌కు దూసుకెళ్లిన యువ టెన్నిస్ స్టార్లు




పురుషుల టెన్నిస్‌లో యువ కెరటాలు కార్లోస్ అల్కరాజ్, జన్నిక్ సిన్నర్ అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తున్నారు. ఈ సీజన్‌లో అదిరిపోయే ఫామ్‌లో ఉన్న ఈ ఇద్దరు మరో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ పోరుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టైటిల్ పోరులో తలపడిన ఈ యువ ఆటగాళ్లు ఇప్పుడు యూఎస్ ఓపెన్ ఫైనల్‌కు చేరుకున్నారు. దీంతో, ఒకే సీజన్‌లో వరుసగా మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ ఆడిన ఆటగాళ్లుగా సరికొత్త చరిత్ర సృష్టించారు. రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్ వంటి దిగ్గజాలకు కూడా సాధ్యంకాని ఈ రికార్డును ఈ టాప్ సీడ్స్ నెలకొల్పారు. అమెరికా వేదికగా జరుగుతున్న యూఎస్ ఓపెన్‌లో సిన్నర్, అల్కరాజ్ ఆద్యంతం అదరగొట్టి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచారు. శుక్రవారం రాత్రి జరిగిన సెమీఫై నల్‌లో ఇటలీ స్టార్ సిన్నర్, ఫెలిక్స్ అగర్ అలియస్మిమెను 6-1, 3-6, 6-3, 6-4 స్కోరుతో చిత్తు చేశాడు. మ్యాచ్ మధ్యలో పొత్తి కడుపులో నొప్పి కారణంగా బ్రేక్ తీసుకున్నప్పటికీ సిన్నర్ గెలుపొందాడు. రెండో సెమీఫైనల్‌లో అల్కరాజ్, నొవాక్ జకోవిచ్‌ను 6-4, 7-6(4), 6-2 స్కోరుతో ఓడించి మూడేళ్ల తర్వాత ఫైనల్‌కు చేరాడు. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంగా ఉన్న జకోవిచ్‌ను ఇంటికి పంపి, తొలి సెట్ కోల్పోయినా పట్టుదలతో పోరాడిన అల్కరాజ్ గెలుపొందాడు. ఫైనల్‌లో సిన్నర్‌తో మూడోసారి తలపడేందుకు ఈ స్పెయిన్ యువ ఆటగాడు సిద్ధమయ్యాడు. ఈ ఇద్దరి కంటే ముందు 2012లో జకోవిచ్, నాదల్ మాత్రమే వరుసగా మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ ఆడిన రికార్డు కలిగి ఉన్నారు.

# ఆంక్షల్లేవ్.. ఆడుతాం




### భారత్-పాక్ మ్యాచ్‌పై సందిగ్ధతకు తెర: బీసీసీఐ స్పష్టీకరణ

పదిహేడో సీజన్ ఆసియా కప్ ప్రారంభానికి మరో మూడు రోజులు మాత్రమే ఉండగా, ఎనిమిది జట్లు టైటిల్ కోసం పోటీపడుతున్నాయి. అయితే, అభిమానుల దృష్టి మాత్రం సెప్టెంబర్ 14న జరిగే భారత్-పాకిస్థాన్ మధ్య హై ఓల్టేజ్ మ్యాచ్‌పైనే నెలకొంది. పాకిస్థాన్ ఉగ్రవాదులను పోషిస్తోందనే విమర్శల నేపథ్యంలో టీమిండియా ఈ మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తుందనే వార్తలు వినిపించాయి. దీంతో ఈ చిరస్థాయి ప్రత్యర్థుల పోరుపై సందిగ్ధత ఏర్పడింది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఎట్టకేలకు మౌనం వీడింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆంక్షలు లేనందున టీమిండియా పాకిస్థాన్‌తో కచ్చితంగా తలపడుతుందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను బీసీసీఐ పాటిస్తుందని, ఐసీసీ, ఆసియా కప్ వంటి టోర్నమెంట్‌లలో భారత జట్టు ఆడే విషయంలో ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని ఆయన తెలిపారు. భారత్‌కు మిత్రదేశం కాని జట్టుతో ఆడే విషయంలో ఎలాంటి ఆంక్షలు లేవని, కాబట్టి బహుళ దేశాలు పాల్గొనే టోర్నమెంట్‌లలో టీమిండియా అన్ని మ్యాచ్‌లు ఆడుతుందని ఆయన వెల్లడించారు. ఆసియా కప్ ఒక బహుళ జాతీయ టోర్నమెంట్ అని, ఇందులో ఆసియా దేశాలు పోటీపడతాయని, భారత్‌తో శత్రుత్వం ఉన్న దేశ జట్టు కూడా ఉండవచ్చని, అయినప్పటికీ భారత జట్టు బరిలోకి దిగుతుందని సైకియా ఏఎన్ఐ వార్తా సంస్థతో చెప్పారు. అయితే, ద్వైపాక్షిక సిరీస్‌ల విషయంలో మాత్రం శత్రు దేశాలతో క్రికెట్ ఆడే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు.




## ఆసియా కప్‌లో భారత్ రికార్డులు

2025 ఆసియా కప్‌కు సమయం దగ్గరపడుతోంది. మరో మూడు రోజుల్లోనే ఈ మినీ టోర్నమెంట్‌కు తెర లేవనుంది. దుబాయ్ వేదికగా టీ20 ఫార్మాట్‌లో టోర్నీ జరగనుంది. సెప్టెంబర్ 09న ప్రారంభమై, ఇదే నెల 28న ముగుస్తుంది. అయితే 1984లో ప్రారంభమైన ఈ టోర్నీ సక్సెస్‌ఫుల్‌గా 16ఎడిషన్లు పూర్తి చేసుకుంది. ఇక 17వ ఎడిషన్?కు సర్వం సిద్ధమైంది. ఈ టోర్నీలో భారత్ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగనుంది.

# శ్రేయాస్ అయ్యర్‌కు భారత ఏ జట్టు కెప్టెన్సీ



ఆసియా కప్ స్క్వాడ్‌లో స్థానం సంపాదించలేకపోయిన శ్రేయాస్ అయ్యర్‌కు సెలెక్టర్లు కొత్త బాధ్యతలు అప్పగించారు. రోహిత్ శర్మ వారసుడిగా వన్డే ఫార్మాట్‌కు సాధ్యమైన సారథిగా భావిస్తున్న అయ్యర్‌కు భారత ఏ జట్టు కెప్టెన్సీని అప్పగించారు. సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియా ఏ జట్టుతో జరిగే రెండు మల్టీ డే మ్యాచ్‌లకు శ్రేయాస్ నాయకత్వం వహించనున్నారు. ఈ సిరీస్ కోసం శనివారం సెలెక్టర్లు 15 మందితో కూడిన భారత ఏ జట్టును ప్రకటించారు. ఈ జట్టులో అయ్యర్‌కు డిప్యూటీగా ధ్రువ్ జురెల్ సహకరించనుండగా, ఇంగ్లండ్ పర్యటనలో మెరిసిన సాయి సుదర్శన్, ప్రసిధ్ కృష్ణ, దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్న అభిమన్యు ఈశ్వరన్, ఐపీఎల్ స్టార్లు ఆయుష్ బదొని, దేవ్‌దత్ పడిక్కల్‌లు స్థానం దక్కించుకున్నారు. ముంబై తరఫున దేశవాళీ క్రికెట్‌లో అదరగొడుతున్న తనుష్ కొతియాన్, సీనియర్ పేసర్ ఖలీల్ అహ్మద్, వికెట్ కీపర్ ఎన్.జగదీశన్ కూడా స్క్వాడ్‌లో చోటు సంపాదించారు. ఆసియా కప్ జట్టులో లేని మహ్మద్ సిరాజ్, కేఎల్ రాహుల్ రెండో మల్టీ డే మ్యాచ్ కోసం భారత ఏ జట్టుతో చేరనున్నారని సమాచారం. భారత ఏ స్క్వాడ్‌లో శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, ఎన్.జగదీశన్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), దేవ్‌దత్ పడిక్కల్, హర్ష్ దూబే, ఆయుష్ బదొని, నితీశ్ రెడ్డి, తనుష్ కొతియాన్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, ఖలీల్ అహ్మద్, మానవ్ సుతార్, యశ్ ఠాకూర్ ఉన్నారు. భారత ఏ, ఆస్ట్రేలియా ఏ జట్ల మధ్య సెప్టెంబర్ 23న తొలి మల్టీ డే మ్యాచ్ జరగనుంది. ఈ రెండు మ్యాచ్‌ల తర్వాత ఇరు జట్లు మూడు వన్డేల్లో తలపడనున్నాయి. కాన్పూర్ వేదికగా సెప్టెంబర్ 30న తొలి వన్డే, అక్టోబర్ 3న రెండో వన్డే, అక్టోబర్ 5న మూడో వన్డే నిర్వహించనున్నారు. స్వదేశంలో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు ముందు సిరాజ్, రాహుల్, ప్రసిధ్‌లకు ఈ మ్యాచ్‌లు ప్రాక్టీస్‌గా ఉపయోగపడనున్నాయి.

# విరాళాలు ఇవ్వండి..

### పంజాబ్ వరద బాధితులకు సినీ, క్రీడా ప్రముఖుల చేయూత

ఇటీవల సంభవించిన వరదలతో పంజాబ్ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. ఈ ప్రకృతి విపత్తులో చిక్కుకున్న పంజాబ్ ప్రజలను ఆదుకునేందుకు సినీ, క్రీడా ప్రముఖులు విరాళాలు అందజేస్తున్నారు. బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ఇటీవల రూ.5 కోట్ల విరాళాన్ని ప్రకటించారు. ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ కూడా విరాళాలు ఇవ్వాలని ఎక్స్ వేదిక ద్వారా విజ్ఞప్తి చేశారు. పంజాబ్ రాష్ట్రం బలం, ధైర్యానికి ప్రతీక అని, అక్కడి ప్రజల ప్రేమ తనకు ఎంతో బలాన్నిచ్చిందని, కానీ ఈ వరదలు వారిని కుంగదీశాయని శ్రేయాస్ అన్నారు. చిన్న మొత్తంలోని ఆర్థిక సాయం కూడా బాధితుల జీవితంలో కొత్త ఆశలు చిగురింపజేస్తుందని, అందరం కలిసి చేయూతనిస్తే పంజాబ్ ప్రజల ముఖాల్లో మళ్లీ నవ్వులు తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు. పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ షేర్ చేసిన వీడియోలో దాతలు ముందుకొచ్చి విరాళాలు అందించాలని శ్రేయాస్ కోరారు. కరోనా సమయంలో వేలాది మందికి సాయం చేసిన బాలీవుడ్ నటుడు సోనూ సూద్ ఈసారి కూడా పంజాబ్ వరద బాధితులకు సహాయం అందించారు. పంజాబ్ కింగ్స్ రూ.33.8 లక్షల విరాళాన్ని ప్రకటించింది మరియు గ్లోబల్ సిఖ్ ఛారిటీ సంస్థతో కలిసి కనీసం రూ.2 కోట్లు సేకరించి బాధితులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సట్లెజ్, బియాస్, రావి నదులు ఉప్పొంగడంతో పంజాబ్‌లో వరద విలయం సృష్టించింది. ఈ దశాబ్దంలో ఎన్నడూ చూడని విధంగా భారీ ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఈ వరదల కారణంగా 43 మంది ప్రాణాలు కోల్పోగా, వందలాది గ్రామాలు నీటమునిగాయి మరియు వేలాది ఎకరాల పంట పొలాలు ధ్వంసమయ్యాయి. 23 జిల్లాలు, 1,902 గ్రామాలు తీవ్ర నష్టాన్ని చవిచూశాయని, 3.84 లక్షలకు పైగా మందిపై ప్రభావం పడిందని ముఖ్యమంత్రి హర్దీప్ సింగ్ ముందియాన్ వెల్లడించారు.




# రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధే ధ్యేయం

- రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- రూ. 4.35 కోట్ల వ్యయంతో 6 దేవాలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 6(జనంసాక్షి):** రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం మంత్రి కొండా సురేఖ వరంగల్ (తూర్పు) నియోజక వర్గంలోని 6 దేవాలయాలకు రూ. 4.35 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేశాయిపేటలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో స్వామి వారి ఉత్సవ సందర్భంగా కోటి దీపాలను వెలిగించే కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొని ఒత్తులు వెలిగించారు.

అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మట్టెవాడ భోగేశ్వర స్వామి దేవాలయం, దేశాయిపేట రంగనాయక స్వామి దేవాలయం, కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, గోవిందరాజుల గుట్ట వద్ద ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణం, కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వర రంగనాయక స్వామి దేవాలయం కాశిబుగ్గ, అబ్బని కుంట లోని మహేశ్వర దేవాలయాల అభివృద్ధి నవీకరణ పనులకు నేడు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ప్రతి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.భక్తులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా ప్రణాళికబద్ధంగా ఆలయాల్లో నిర్మాణాలు చేపట్టాలని, ఆలయాలకు రంగులు వేసి కొత్తదనాన్ని తీసుకురావాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. తూర్పు నియోజకవర్గానికి 18 దేవాలయాల అభివృద్ధి పనుల కు మంజూరు చేశామని, అందులో భాగంగా నేడు ఆరు దేవాలయాల అభివృద్ధి పనుల ను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు.మిగిలిన దేవాలయాల అభివృద్ధి పనులను త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. దశలవారీగా అన్ని ఆలయా ల అభివృద్ధి, నవీకరణ, పునరుద్ధరణ చేయడతామని తెలిపారు. కాకతీయుల కాలం నాటి చారిత్రాత్మక దేవాలయాలు వరంగల్ లో అధికంగా ఉన్నందున వాటిని పునరుద్ధరణ చేసి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మన పై ఉందన్నారు.పురావస్తు, పర్యాటక శాఖలకు సంబంధించిన దేవాలయా లను కూడా అభివృద్ధి చేయుటకుగాను ఆయా శాఖల నుండి అనుమతి కొరకు జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.పురావస్తు శాఖ వారి అనుమతి మంజూరైన తదుపరి ఆయా దేవాలయాలు అభివృద్ధి చేస్తామని, దేవదాయ శాఖకు సంబంధించిన అన్ని దేవాలయాలకు, దేవాదా య ధర్మదాయ శాఖ మంత్రిగా తాను నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నామని ఈ సందర్భం గా మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామ తేజస్వి శిరీష్ కావేటి కవిత చింతకుల అనిల్ కుమార్ ఓసి స్వర్ణలత భాస్కర్ సోమిశెట్టి ప్రవీణ్ కుమార్ ఎండోమెంట్ అధికారి సునీత, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ ఎర్రకోటలో రూ.1.5 కోట్ల కలశం దొంగతనం

**జైన ఆచారంలో దొంగ జైన సాధువుగా వేషం**

**ఢిల్లీ :** ఎర్రకోటలో జరిగిన జైన మత ఆచారంలో కోటి రూపాయల విలువైన కలశం దొంగతనం కలకలం రేపింది. సెప్టెంబర్ 3న ఎర్రకోటలోని 15 ఆగస్టు పార్క్‌లో జరిగిన 'దసలక్షణ మహాపర్వ' సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. వ్యాపారవేత్త సుధీర్ జైన్ రోజూ పూజ కోసం తీసుకొచ్చే ఈ కలశం, 760 గ్రాముల బంగారంతో తయారై, 150 గ్రాముల వజ్రాలు, మాణిక్యాలు, పచ్చలతో అలంకరించబడింది. అదనంగా 115 గ్రాముల చిన్న బంగారు ఝరీ, బంగారు కొబ్బరి కూడా దొంగిలించబడ్డాయి, మొత్తం విలువ సుమారు రూ.1.5 కోట్లు. ఈ దొంగతనం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ కార్యక్రమానికి హాజరైన సమయంలో, స్వాగత ఏర్పాట్ల సందడిలో జరిగింది. దొంగ జైన సాధువు వేషంలో వచ్చి, గుండాలో ఉన్న గందరగోళంలో ఈ వస్తువులను బ్యాగ్‌లో వేసుకొని పరారయ్యాడు.

## గణేష్ ఉత్సవాల బందోబస్తు ఓ అనుభవం

- ఏ పండగ అయినా తొక్కిసలాట రాకుండా చూస్తాం
- ట్రైనీ ఐపిఎస్ అధికారులతో కమిషనర్ సివి ఆనంద్

**హైదరాబద్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** గణేష్ ఉత్సవాల బందోబస్తు నిర్వహించడం 13వ సారి అని, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నాలుగో సారి అని సివి ఆనంద్ తెలిపారు. శనివారం నేషనల్ పోలీస్ అకాడమీ నుండి 170 మంది ట్రైనీ ఐపిఎస్ అధికారులతో కమిషనర్ సివి ఆనంద్‌తో ముఖాముఖిగా మాట్లాడారు. సివి ఆనంద్ హైదరాబాద్ నగరంలో 10 సంవత్సరాలుగా విధులు నిర్వహించిన తన అనుభవాన్ని పంచుకున్నారు. హైదరాబాద్ దేశంలోనే అత్యంత సున్నితమైన, విస్తారమైన నగరాల్లో ఒకటని, ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారని, అందుకే పండుగల నిర్వహణ చాలా ముఖ్యమని వివరించారు. గణేష్ ఉత్సవాలకు పోలీసులు బందోబస్తు ఎలా నిర్వహిస్తారో వివరిస్తూ, ఈ ఏడాది నిమజ్జనం కోసం చివరి రోజున సుమారు 25,000 విగ్రహాలు వచ్చే అవకాశం ఉందని ఆనంద్ పేర్కొన్నారు. ఇంత భారీ స్థాయిలో జరిగే ఈ ఉత్సవానికి ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా భద్రత కల్పించడం చాలా ముఖ్యమని చెప్పారు. గణేష్ ఉత్సవం, మిలాద్ ఉన్ నబీ, బోనాలు, దసరా నవరాత్రులు, హనుమాన్ ర్యాలీ, శ్రీ రామనవమి ర్యాలీ వంటి పండుగల సందర్భంగా తొక్కిసలాటలు జరగకుండా హైదరాబాద్ పోలీసులు తీసుకుంటున్న కార్యాచరణ ప్రణాళిక, సన్నాహాలు, వ్యూహాలు మరియు ఇతర చర్యల గురించి ఒక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆన్‌లైన్ అనుమతి ఫారాలు, విగ్రహాలకు జియోట్యాగింగ్, డ్రోన్‌లు, యాప్‌లు, సిసిటివిల వాడకం, అలాగే మల్టీ-ఏజెన్సీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వంటి సాంకేతికతను పోలీసులు ఎలా వినియోగిస్తున్నారో కూడా కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో రామ్ నివాస్ సేపట్, ఐపీఎస్, కల్మేశ్వర్ సింగేన్వార్, ఐపీఎస్ మరియు పుష్ప, డీసీపీ, పాల్గొన్నారు.

## ముంబైలో ఉగ్ర బెదిరింపులు

**నిందితుడిని పట్టుకున్న పోలీసులు**

**ముంబయి :** ముంబైలో ఉగ్ర బెదిరింపులు కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. నగరంలో 34 మానవ బాంబులు, 400 కిలోల ఆర్‌డిఎక్స్‌తో కోటి మందిని చంపుతామని వచ్చిన బెదిరింపు సందేశం పోలీసులను అప్రమత్తం చేసింది. వినాయక నిమజ్జనం సందర్భంగా ఈ బెదిరింపు సందేశం రావడంతో రాష్ట్రవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు బీహార్‌లోని పాటలీపుత్రకు చెందిన అశ్విని కుమార్ (51) అనే వ్యక్తిని నోయిడాలో అరెస్టు చేశారు. స్నేహితుడిపై ప్రతీకారం తీర్చుకోవడానికి అతడు ఈ నకిలీ బెదిరింపులకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. 2023లో ఫిరోజ్ అనే వ్యక్తి తనపై కేసు పెట్టడంతో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించినట్లు అశ్వినీ తెలిపాడు. దీంతో కోపంతో ఫిరోజ్ పేరుతో ముంబై ట్రాఫిక్ పోలీసుల వాట్సాప్ నంబర్‌కు బెదిరింపు సందేశం పంపినట్లు వెల్లడించాడు. పోలీసులు అతడి నుంచి ఏడు మొబైల్ ఫోన్లు, మూడు సిమ్ కార్డులు, ఆరు మెమరీ కార్డులు, ఒక ఎక్స్‌టర్నల్ సిమ్ స్లాట్, రెండు డిజిటల్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. గత శుక్రవారం ముంబై ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ అధికారిక వాట్సాప్ నంబర్‌కు వచ్చిన సందేశంలో 'లష్కరే జీహాదీ' అనే సంస్థకు చెందినవారమని, 14 పాకిస్థానీ ఉగ్రవాదులు నగరంలోకి ప్రవేశించారని, 34 మానవ బాంబులతో 400 కిలోల ఆర్‌డిఎక్స్‌తో దాడులు చేస్తామని బెదిరించారు. ఈ సందేశం అందిన వెంటనే క్రైమ్ బ్రాంచ్, యాంటీ-టెర్రరిస్ట్ స్క్వాడ్‌తో సహా ఇతర దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగి, తనిఖీలు నిర్వహించాయి. నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో ఈ బెదిరింపులు నకిలీవని తేలింది. నిందితుడిని ముంబైకి తరలించి మరింత దర్యాప్తు జరుపుతున్నారు.

## ఉత్తరాది వరదలను జాతీయ విపత్తుగా గుర్తించాలి

**ఆ మేరకు ఆయా రాష్ట్రాల్లో సహాయ,పునరావాలు చేపట్టాలి**

**కేంద్రానికి సిపిఎం ప్రధానకార్యదర్శి బేబీ డిమాండ్**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6(జనంసాక్షి):** ఉత్తర భారతదేశంలో వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి అసాధారణ పరిస్థితిపై సీపీఐ(ఎం) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన చేశారు. ఈ భారీ విపత్తును ఎదుర్కోవడంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. సహాయ, పునరావాస చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభావిత రాష్ట్రాలన్నింటిలోనూ సీపీఐ(ఎం) బృందాలు చురుగ్గా పనిచేస్తున్నాయని, ఆయా రాష్ట్రాల్లో సహాయక చర్యల్లో పాల్గొనాలని సీపీఐ(ఎం) తన కార్యకర్తలందరికీ పిలుపునిచ్చింది. బాధిత ప్రజలకు సహాయం అందించడానికి నిధులు సేకరించాలని సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ కాశ్మీర్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ భారీ వర్షాలు, వరదలు మరియు కొండచరియలతో అతలాకుతలమవుతున్నాయని తెలిపారు. ఈ తీవ్ర విపత్తులో ప్రాణనష్టం సంభవించడం పట్ల సీపీఐ(ఎం) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పంజాబ్ అత్యంత ప్రభావితమైందని, రాష్ట్రంలోని 23 జిల్లాలు వరదల బారిన పడ్డాయని పేర్కొన్నారు. నివేదికల ప్రకారం, రాష్ట్రంలోని 1655 గ్రామాల్లోని సుమారు 3 లక్షల ఎకరాల పంటలు పాక్షికంగా లేదా పూర్తిగా మునిగిపోయాయని, 4 లక్షలకు పైగా ప్రజలు ప్రత్యక్షంగా ప్రభావితమైనట్లు- పేర్కొన్నారు. అనేక ఆనకట్టల నుండి విడుదల చేయబడిన మిగులు నీటితో పాటు- భారీ వర్షాలు బియాస్, సలటెజ్, రావి మరియు ఘగ్గర్ నదులు పొంగిపొర్లాయని తెలిపారు. ఫలితంగా వరద పంజాబ్, హర్యానాలలోని పంటలకు తీవ్ర నష్టం కలిగించిందని తెలిపారు. హర్యానాలో 12 జిల్లాల్లోని 1,402 గ్రామాలలో విస్తరించి ఉన్న దాదాపు 2.5 లక్షల ఎకరాల్లో పంటలు పూర్తిగా నాశనమయ్యాయని పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో కుండపోత వర్షం, వరదల కారణంగా వేల ఎకరాల వరి నేలకొరిగిందని, 170 మందికి పైగా మరణించినట్లు- సమాచారముందని తెలిపారు. రాజస్థాన్, ఢిల్లీలోని కొన్ని ప్రాంతాలలో కూడా విస్తృత నష్టం జరిగిందని పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో 320 మందికి పైగా మరణించడంతో పాటు-, చాలా మంది గల్లంతు అయినట్లు- సమాచారముందని తెలిపారు. ప్రజా మౌలిక సదుపాయాలు, భూమి మరియు ఇళ్ళు, పశువులు, పండ్ల చెట్లు-, నిలబడి ఉన్న పంట వాహనాలు, గోశాలలు భారీగా ధ్వంసం అయ్యాయని తెలిపారు. సిమ్లా మరియు కులులోని ఆపిల్ తోటలు నాశనమయ్యాయని, దాదాపు 25,000 ఎకరాల ఉద్యానవన భూమికి నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. ఉత్తరాఖండ్ కూడా ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో చాలా మంది గల్లంతు అయినట్లు- నివేదికలు వెలువడ్డాయని తెలిపారు.

# కమీషన్లు రావని పేదలకు ఇళ్లు కట్టలేదు

మాట్లాడుతూ స్వంత ఇంటి నిర్మాణం పేదోడి ఆత్మ గౌరవం,భరోసా,ధైర్యం అన్నారు.ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో పేద వారి చిరకాల కోరిక చిన్న ఇల్లు నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ఇండ్లు రాష్ట్రంలో మొదటి విడత 4 లక్షల 50 వేల ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు..ప్రతి నియోజక వర్గానికి 3500 ఇండ్ల చొప్పున మంజూరు చేసినట్లు ఇండ్ల నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు.దేవరకద్ర నియోజకవర్గం లో 3500 ఇండ్లు మంజూరు చేసినట్లు, 1900 ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నట్లు,100 నుండి 120 ఇండ్లు పూర్తి కావచ్చినట్లు చేప్పారు

ఇండ్లు పూర్తి చేసుకున్న మహిళలు సంతోషంగా ఉన్నారని,వారికి శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని చేప్పారు.గత ప్రభుత్వం 10 సంవత్సరం కాలంలో లక్ష నుండి లక్షా 50 వేల ఇండ్లు నిర్మించినా 10 లక్షల ఇండ్లు పూర్తి అయ్యేవని, కాని 10 సంవత్సరం లలో 94 వేలు ఇండ్లు నిర్మాణం కు టెండర్ లు పిలిచి 74 వేలు మాత్రమే పూర్తి చేసారని,వాటిని పూర్తి చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా నియోజక వర్గానికి 3,500 ఇండ్లు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు.ఇచ్చిన మాట ప్రకారం 3 విడతలుగా ఇండ్లు మంజూరు చేసి ప్రతి పేద వాడికి మంజూరు చేస్తామని తెలిపారు. కులం తో,పార్టీ తో సంబంధం లేకుండా ఓటు కోసం కాకుండా ప్రతి పేదవాడి చిరకాల కోరిక తీరుస్తామని అన్నారు. ఏప్రిల్ నెలలో రెండో విడత ఇండ్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడిరచారు. ఇండ్లు నిర్మాణం దశలను అనుసరించి 5 లక్షలు రూ.లు దశల వారీగా ప్రతి సోమవారం డబ్బులు లబ్ధిదారునికి చెల్లిస్తున్నట్లు ఆయన తెలిపారు.పునాది వరకు నిర్మించుకున్న ఇండ్లకు ఇందిరమ్మ మంజూరు క్యాబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.గత ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖను భ్రష్టు పట్టించారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా అవినీతి లేకుండా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు నుండి పూర్తి చేసుకునే వరకు డబ్బులు దశల వారీగా చెల్లించే వరకు ముఖ్యమంత్రి సూచనల మేరకు అధికారులు అద్భుతంగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఎన్నికల ముందు చెప్పిన విధంగానే ధరణి ని బంగాళాఖాతంలో వేసినట్లు, భూభారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు గ్రామ పాలనాధికారుల నియామకం చేసినట్లు, దసరా నాటికి ల్కెసెన్స్ సర్వేయర్లను నియమకం చేయనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. భూములకు భద్రత కల్పించేలా భూభారతి చట్టాన్ని తీర్చిదిద్దామని ఆయన తెలిపారు.ప్రజల ఆశలు, ఆలోచనలు అనుగుణంగా పేదోడి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన అన్నారు.దేవరకద్ర నియోజకవర్గంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వీల్కెనంత త్వరలో మంజూరు చేస్తానని అదేవిధంగా తహశీల్దార్



కార్యాలయం భవనాలను త్వరలో మంజూరు చేసి శంకుస్థాపనకు వస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు .రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి లిజూపల్లి కృష్ణారావులి మాట్లాడుతూ తరతరాలుగా తాతల కాలం నుండి ఇండ్లు నిర్మాణం ఒక కలగా పూరి గుడిసెల్లో ఉండే పరిస్థితి నుండి దశాబ్దాల కలను నెరవేర్చుటకు ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కు ఆర్థిక సహాయం చేస్తుందని ఆయన తెలిపారు. కె.సి.ఆర్ సి. ఎం.గా ఉన్నప్పుడు అప్పటి వరకు 64 సంవత్సరాలలో 22 మంది సి. ఎం.లు పని చేశారని తెలిపారు.గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో ఏడు లక్షల 30000 కోట్ల అప్పు చేసిందని ఈ అప్పు తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు 6500 కోట్ల చొప్పున వడ్డీ కడుతుందని తెలిపారు 10 సంవత్సరాల్లో 8 లక్షల కోట్ల అప్పు చేసి రెండు పడక గదులు ఇవ్వలేదని తన నియోజకవర్గంలో కేవలం 1400 ఇండ్లు మంజూరు చేశారని ఏడుసార్లు టెండర్ లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరు లక్ష రూపాయల నష్టం వస్తుందని ముందుకు రాలేదని తెలిపారు.వందలాదిమంది అమరల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం కుటుంబ పాలన అప్పులతో ప్రజా సమస్యలు పేరుకుపోయాయని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రుణమాఫీ రైతు భరోసా సన్న బియ్యం పంపిణీ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని ప్రజలు బతుకులు బాగుపడాలని సుఖంగా సంతోషంగా ఉండాలని ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.రాష్ట్ర పశు సంవర్ధక,డ్కెరీ అభివృద్ధి,మత్స్య, క్రీడలు యువజన శాఖ మంత్రి లివాకిటి శ్రీహరిలి మాట్లాడుతూ పేదవాడికి ఇల్లు ఇవ్వాలని 22,500 కోట్ల రూ.లు బడ్జెట్ లో కేటాయించి రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇళ్లను నిర్మించాలని ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేరున మంజూరు చేస్తుందన తెలిపారు. నియోజకవర్గానికి 3500 చొప్పున 175 కోట్లతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేస్తుందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కాగితాలు చూపిస్తారని,ఇండ్లు నిర్మాణం చేస్తే అప్పులు చేయాల్సి ఉంటుందని ప్రచారం జరిగిందని తెలిపారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇంటి నిర్మాణంకు ఆర్థిక సహాయం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం వచ్చాక రైతులకు రుణమాఫీ సన్నబియ్యం, రైతు భరోసా 200 యూనిట్ల ఉచిత కరెంటు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మహిళలకు ఆర్.టి.సి. బస్సులలో ఉచిత ప్రయాణం తదితర పథకాల అమలు చేస్తుందని తెలిపారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని సంకల్పం తో సి. ఎం.మహిళా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందని ఆయన తెలిపారు మూసాపేట మండల కేంద్రంలో 94 ఇల్లు మంజూరు కాగా 42 పూర్తి కావచ్చాయని అందులో ఈరోజు గృహ ప్రవేశం చేసుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గం లో 3500 ఇండ్లు మంజూరు కాగా అందులో 1922 ఇండ్లు గ్రౌండ్ అయినాయని మూడు,నాలుగు నెలలలో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. మొదటి విడత ఇందిరమ్మ ఇల్లు మంజూరు కకాని వారికి రెండో విడత 1000 ఇండ్లు మంజూరు చేయాలని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు .అలాగే బేస్మెంట్ వరకు వేసుకున్న వారికి సీఎంతో మాట్లాడి ఇంటి నిర్మాణానికి సహకారం అందించాలని మంత్రిని కోరారు.కొత్తకోట, దేవరకద్రలో సబ్ రిజిస్టార్ కార్యాలయాలు మంజూరు చేయాలని, కొత్తకోటను రెవెన్యూ డివిజన్ చేయాలని కోరారు మూసాపేట్,కౌకుంట్ల, అడ్డాకు ల, మధనాపురంలలో మండల కాంప్లెక్స్ మంజూరు చేయాలని కోరుట్ల మదనాపురం అడ్డాకులలో కూడా మండల కాంప్లెక్స్ మంజూరు చేయాలని కోరారు అదే దేవరకథలు కూడా ఏర్పాటు చేయాలని కోరారు.జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం కార్యక్రమంలో మంత్రులు పాల్గొని గృహ ప్రవేశం చేయడం సంతోషకరం అన్నారు. రాష్ట్రం ప్రభుత్వం ఏర్పడి 18 నెలల కాలంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని, రైతులకు మహిళలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. జిల్లాలో 10507 ఇండ్లను మంజూరు చేయగా ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు చొప్పున మంజూరు చేసినట్లు అందులో 6,829 ఇండ్లు మొదలుపెట్టడం జరిగిందని త్వరలో మిగిలినవి కూడా మొదలుపెడతామని తెలిపారు. 3130 వివిధ దశలలో నిర్మాణం బట్టి చెల్లింపులు జరిగినట్లు ఈ సందర్భంగా తెలిపారు జిల్లాలో భూభారతి చట్టం అమలు చేస్తున్నట్లు137 మంది జి.పి.ఓ లను నియమించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి వైద్యం భాస్కర్, డిఆర్డిఓ నరసింహులు, మండల ప్రత్యేక అధికారి ఇందిర, ఆర్డిఓ నవీన్, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు

## ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి గేమ్ ఛేంజర్

**ఖమ్మం, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):**

ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి భవిష్యత్తులో దక్షిణ భారతదేశానికి గేమ్ చేంజర్‌గా మారి ఖమ్మం జిల్లాకు వరంగా మారబోతున్నదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. శనివారం ఖమ్మం నగర శివారులో ధంసలాపురం వద్ద ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు, మున్నేరు బ్రిడ్జి పనులను ఆయన తనిఖీ చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే ఆర్ఓబి, ఎంట్రీ- ఎగ్జిట్ పాయింట్లను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులు, ఏజెన్సీలకు పలు సూచనలు చేశారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి, కొత్త ఏడాదిలో ప్రజలకు అందుబాటు-లో తేవాలని ఆదేశించారు. ఉత్తర, దక్షిణ భారతాన్ని కలుపుతూ కనెక్టింగ్ హైవేగా ఖమ్మానికే కాదు.. తెలంగాణకు గేమ్ చేంజర్‌గా మారుతుందని అన్నారు. 160 కిలోమీటర్ల జాతీయ రహదారి పూర్తికావడం వల్ల గంటన్నర సమయంలో ఖమ్మం నుంచి రాజమండ్రి వెళ్ళవచ్చని అన్నారు. సూర్యాపేట నుంచి విజయవాడ వెళ్ల కుండా ఖమ్మం మీదుగా వైజాగ్, గోదావరి జిల్లాలవారు, ఒడిశా వెళ్ళేవారికి ప్రయాణం 150 కిలోమీటర్లు తగ్గుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, ఇక్కడి వారికి ఈ రోడ్డు ఉపయోగపడుతుందని తెలిపారు. ఉత్తర దక్షిణ భారతదేశాన్ని కలిపే రహదారిగా తయారవుతుందని, రూ.3,500 కోట్లతో ఈ రహదారి నిర్మిస్తున్నామని అన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి డిజైన్స్ రూపకల్పనలో జాప్యం కావడం వల్ల ఆలస్యం జరిగిందని అన్నారు. దంసలాపురం ఎగ్జిట్ ఎ÷-లాన్‌లో ముందు లేకపోవడం వల్లనే పనుల్లో జాప్యం జరిగిందన్నారు. ధంసలాపురం ఆరోఓబి నవంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఎగ్జిట్ పనులు తో పాటు- మున్నేరు బ్రిడ్జి రైల్వే ఫైఓవర్ నిర్మాణ పనులు కూడా నవంబర్ నాటికి కావాలన్నారు. ఆర్.ఓ.బి. నిర్మాణానికి సంబంధించి హైటెన్షన్ విద్యుత్ లైన్స్ తరలింపు, భూసేకరణ వంటి అన్నిపనులు పూర్తి చేశామని, నవంబర్ నాటికి ఒకవైపు రైల్వే బ్రిడ్జి పూర్తి చేసుకుంటే సత్తుపల్లి -జంగారెడ్డిగూడెం వరకు ఉపయోగపడుతుందని అన్నారు. కొత్త సంవత్సరంలో ఖమ్మం- దేవరపల్లి



జాతీయ రహదారి పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి రావాలని అన్నారు. రైల్వే శాఖను సమన్వయం చేసుకుంటూ ఆర్ఓబి త్వరగా పూర్తిచేయాలని అన్నారు. రైల్వే, కెనాల్, మున్నేరుపై రహదారి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నుంచి సత్తుపల్లి వరకు జాతీయ రహదారికి సర్వీస్ రోడ్లు వేస్తే రైతులకు ఉపయోగ పడుతుందని, దీనికి కావలసిన ఏర్పాట్లు- చేయాలని అన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా వ్యవసాయ ప్రాంతం అధికంగా ఉందని, నాగార్జున్ సాగర్ కాల్వ క్రింద ఆయకట్టు- ఉన్నందున 365 రోజుల పాటు- హార్వెస్టర్ రాకపోకలు ఉంటాయని, రహదారి వాహనాలకు ఆటంకం కలగకుండా సర్వీస్ రోడ్లు ఏర్పాటు- చేయాలని ఆదేశించారు. వర్షాలు తగ్గిన నేపథ్యంలో మున్నేరు బ్రిడ్జితో పాటు- ధంసలాపురం ఎగ్జిట్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి చిన్న, చిన్న సమస్యలు ఉంటే కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ- ఛైర్మన్ హనుమంతరావు, నేషనల్ హైవే పిడి దివ్య, ఆర్అండ్‌బి ఎస్ఇ యాకోబ్, ఖమ్మం ఆర్‌డిఒ నర్సింహారావు, కార్పొరేటర్లు కమర్తపు మురళి, రావూరికరుణ సైదుబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు సాదు రమేశ్ రెడ్డి,వ డ్డెబోయిన నర్సింహారావు, బ్రహ్మారెడ్డి, ఏడుకొండలు, అంజిరెడ్డి, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సైదులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మరో ఇరవై ఏండ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది

- ప్రతి కార్యకర్త ఓ సోషల్ మీడియా వారియర్‌గా పనిచేయాలి
- పాత, కొత్త బేదం లేదు... అందరిది ఒకటే నినాదం జై కాంగ్రెస్
- 20 నెలల్లో 1759 కోట్ల రూపాయల అభివృద్ధి
- వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి




**వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 6 జనంసాక్షి :**

వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరో 20 సంవత్సరాలు అధికారంలో ఉంటుందని, ఈ లక్ష్య సాధన కోసం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చురుగ్గా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు చేర్చేందుకు కృషి చేయాలని శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత, కొత్త అనే భేదం లేకుండా అందరూ "జై కాంగ్రెస్" నినాదంతో ఏకతాటిపై పనిచేయాలని సూచించారు. వనపర్తి నియోజకవర్గం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, దీన్ని దేశంలోని టాప్ 10 నియోజకవర్గాల్లో నిలబెట్టే లక్ష్యంతో పనిచేస్తామన్నారు. ఆరు కొత్త సింగిల్ విండోలు, రెండు వ్యవసాయ మార్కెట్ యార్డులు, రాజకీయ పదవులు కొందరికి రాబోతున్నాయని తెలిపారు. విద్యా రంగంలో కేంద్రీయ విద్యాలయం, నవోదయ, వెటర్నరీ కళాశాల, ఏడు వెటర్నరీ ఆసుపత్రులు, స్పోర్ట్స్ స్కూల్, టర్ఫ్ హాకీ మైదానం, స్విమ్మింగ్ పూల్, జిమ్, పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణ, హాం ప్రాజెక్టు ద్వారా రహదారుల బలోపేతం చేయనున్నట్లు వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 20 నెలల్లో 1759 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. గత పదేళ్లలో కేవలం జీవోలకే పరిమితమైన పాలన జరిగిందని, నిధులు మంజూరు కాలేదని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని, వనపర్తి అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని, మాట తప్పనని హామీ ఇచ్చారు. ప్రతి కార్యకర్త సోషల్ మీడియా వారియర్‌గా పనిచేసి, చిన్న పనినైనా ప్రజలకు తెలిసేలా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, పీసీసీ సభ్యులు శంకర్ ప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, విజయవర్ధన్ రెడ్డి, మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370